www.vishvambhara.com
తెలుగు దినపత్రిక
# విశ్వంభర
అక్షరం సాక్షిగా..
గురువారం
19-09-2024
సంపుటి : 01 | సంచిక : 137 | పేజీలు : 12 | వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్


డా॥ కాచం సత్యనారాయణ
CMD



## జమిలి ఎన్నికలకు సై



### ఆమోదించిన కేంద్ర కేబినెట్

వచ్చే శీతాకాల సమావేశాల్లో బిల్లు పెట్టే అవకాశం
మాజీ రాష్ట్రపతి కోవింద్ కు అభినందనలు తెలిపిన మోదీ
గగన్ యాన్, చంద్రయాన్ విస్తరణకు పచ్చజెండా
ఈ ఆమోదం.. ఆచరణాత్మకం కాదు:మల్లికార్జున్ ఖర్గే
ప్రజాస్వామ్యానికి విఘాతం: ఓవైసీ
వ్యతిరేకిస్తున్న వివిధ పార్టీలు..

**దిల్లీ:** దేశంలో జమిలి ఎన్నికలకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. దేశవ్యాప్తంగా ఒకేసారి ఎన్నికల నిర్వహణకు సంబంధించి మాజీ రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ రూపొందించిన నివేదికను మంత్రివర్గం ఆమోదించింది. వచ్చే పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో ఈ బిల్లును ప్రవేశపెట్టే అవకాశాలున్నాయి. సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తులు, హైకోర్టు న్యాయమూర్తులతో సహా 32 పార్టీలు ప్రముఖ న్యాయమూర్తులు దీనిని సమర్థించారు. 18 రాజ్యాంగ సవరణలను ప్యానల్ సిఫార్సు చేసింది. అదేవిధంగా చంద్రయాన్-4కు, గగన్యాన్, చంద్రయాన్ విస్తరణకు కేబినెట్ ఆమోదం తెలిపింది. "ఒక దేశం, ఒకే ఎన్నికలు" విధానాన్ని అమలు చేయడం ద్వారా ఎన్నికల ప్రక్రియ సులభతరం అవుతుందని, తద్వారా వేగవంతమైన ఆర్థికవృద్ధికి దారితీస్తుందని ప్యానల్ పేర్కొంది. లోక్సభ, రాష్ట్ర అసెంబ్లీ, పంచాయతీలకు మూడు స్థాయిల్లో ఎన్నికలు నిర్వహించడం వల్ల వలస కార్మికులు పలుమార్లు ఓటేయడం కోసం సెలవులపై తమ ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని.. దీనివల్ల ఉత్పత్తిలో అంతరాయం కలుగుతుందని వెల్లడించింది. దానిని నివారించాలంటే జమిలి ఎన్నికలే ఏకైక పరిష్కారమని పేర్కొంది.

మిగతా2లో...

**జమిలి ఎన్నికలు సాధ్యమేనా?**
పార్టీల భిన్నాభిప్రాయాలు..ఆచరణలో అనేక సవాళ్లు
దేశవ్యాప్తంగా ప్రారంభమైన చర్చ
ప్రత్యేక వ్యాసం 4లో..

“

కేంద్ర కేబినెట్ సంచలన నిర్ణయం తీసుకుంది. దేశవ్యాప్తంగా ఒకేసారి పార్లమెంట్ , అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించేలా జమిలి ఎన్నికలకు ఆమోదం తెలిపింది. మాజీ రాష్ట్రపతి రామ్నాథ్ కోవింద్ ఇచ్చిన నివేదికకు జైకొట్టింది. రానున్న శీతాకాల సమావేశాల్లో జమిలి ఎన్నికల బిల్లును పార్లమెంట్లో ప్రవేశపెట్టబోతోంది. చాలా కాలంగా జమిలి ఎన్నికల గురించి మాట్లాడుతున్న కేంద్ర నాయకులు ఈ విషయంలో ముందడుగు వేశారనే చెప్పవచ్చు. కాంగ్రెస్ సహా పలు పార్టీలు వ్యతిరేకిస్తున్న నేపథ్యంలో కేబినెట్ నిర్ణయం దేశవ్యాప్తంగా చర్చకు దారితీసింది.

### ప్రజాస్వామ్య బలోపేతానికి ముందడుగు..ప్రధాని మోదీ



దేశవ్యాప్తంగా ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలన్న కమిటీ సిఫార్సులను కేబినెట్ ఆమోదించడంపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 'ఎక్స్' వేదికగా స్పందించారు. దేశ ప్రజాస్వామ్యాన్ని మరింత శక్తిమంతంగా, భాగస్వామ్యయుతంగా మార్చే కీలక ముందడుగుగా దీనిని పేర్కొన్నారు. ఉన్నతస్థాయి కమిటీకి నాయకత్వం వహించినందుకు, నివేదిక రూపకల్పనలో భాగంగా అన్ని వర్గాలతో విస్తృత చర్చలు జరిపినందుకు మాజీ రాష్ట్రపతి రామ్నాథ్ కోవింద్కు అభినందనలు తెలిపారు.

### ఈ ఆమోదం.. ఆచరణాత్మకం కాదు:మల్లికార్జున్ ఖర్గే



జమిలి ఎన్నికల విధానాన్ని కాంగ్రెస్ సహా 15 పార్టీలు వ్యతిరేకించాయి. ఈ ప్రతిపాదన ఆచరణాత్మకమైనది కాదని కాంగ్రెస్ పేర్కొంది. పార్టీ అధినేత మల్లికార్జున్ ఖర్గే మాట్లాడుతూ "ఇది ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం. దీనిని ప్రజలు అంగీకరించరు" అని అన్నారు. గతంలోనూ కాంగ్రెస్, బీఆర్ఎస్, సీపీఐ నాయకులు జమిలి ఎన్నికలపై తీవ్ర విమర్శలు చేశారు. ఇండియా కూటమి వన్ నేషన్- వన్ ఎలక్షన్ విధానానికి వ్యతిరేకమని గతంలోనే రేవంత్ రెడ్డి ఓ ప్రకటనలో స్పష్టం చేశారు. ఓడిపోతామనే భయంతోనే జమిలి ఎన్నికలను ముందుకు తెచ్చారని ఆరోపించారు. సీపీఐ సైతం జమిలి ఎన్నికలపై వ్యతిరేకంగా ఉంది. ఒకేసారి దేశవ్యాప్తంగా ఎన్నికలు జరపడం అనేది తలకిందులుగా తపస్సు చేసిన వీలుగాని అంశమని ఈ నెల 3న సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి అన్నారు.

### ప్రజాస్వామ్యానికి విఘాతం..
జమిలి ఎన్నికలపై ఓవైసీ స్పందన
2

### రాహుల్‌గాంధీ హత్యకు కుట్ర

- బీజేపీ నేతల వ్యాఖ్యలే అందుకు నిదర్శనం
- ఢిల్లీ పోలీసులకు కాంగ్రెస్ ఫిర్యాదు
- కేంద్ర ఎన్నికల సంఘానికి ప్రతి సమర్పణ



**దిల్లీ:** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ హత్యకు కుట్ర జరుగుతోందని కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. ఈ మేరకు పలువురు బీజేపీ నేతలపై బుధవారం దిల్లీలోని తుగ్లక్ రోడ్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ నాయకుడు అజయ్ మాకెన్ ఫిర్యాదు ప్రతిని కేంద్ర ఎన్నికల సంఘానికి పంపారు. రాహుల్ గాంధీని లక్ష్యంగా చేసుకుని అధికార
మిగతా2లో...


2

### నిఖత్ జరీన్‌కు గ్రూప్-1 ఉద్యోగం
నియామక పత్రం అందజేత



### కొత్తగూడెం కలెక్టరేట్‌లో ఏసీబీ దాడులు
రూ.1.14లక్షల లంచం తీసుకుంటూ చిక్కిన హార్టికల్చర్ అధికారి..!
2

మరిన్ని తాజా వార్తల కోసం **స్కాన్** చేయండి



### నేటి చికెన్ ధరలు

| | |
|---|---|
| ఫామ్ ధర ₹ 105 | రిటైల్ ₹ 127 |
| స్కిన్ ₹ 184 | స్కిన్ లెస్ ₹ 210 |

## యువతకు చేయూత అందిస్తాం



వ్యవసాయం, పరిశ్రమల్లో పెట్టుబడులు పెట్టేలా సహకరిస్తాం
ఎంఎస్ఎంఈలు అభివృద్ధి చెందడం ద్వారానే రాష్ట్రాల వృద్ధి
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ○ ఎంఎస్ఎంఈ పాలసీ విడుదల

**విశ్వంభర, హైదరాబాద్:**

వ్యవసాయం, పరిశ్రమల్లో పెట్టుబడి పెట్టేందుకు గాను యువతకు తగిన చేయూతనిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. వ్యవసాయం అంటే దండుగ కాదన, పండగ అన్నదే తమ విధానమన్నారు. ఎంఎస్ఎంఈలు అభివృద్ధి చెందడం ద్వారానే రాష్ట్రాలు వృద్ధి చెందుతాయని స్పష్టం చేశారు.హైదరాబాద్‌లో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల నూతన విధానం ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ కా ర్యక్రమంలో ఎంఎస్ఎంఈ పాలసీని సీఎం రేవంత్ రెడ్డి విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.ఐటీ, ఫార్మా అభివృద్ధికి కాంగ్రెస్ ఎంతో కృషి చేసిందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. కొవిడ్‌కు వ్యాక్సిన్ తయారీలో కూడా మన రాష్ట్రం ముందుందని వివరించారు. ప్రభుత్వ విధానాలను కొనసాగించినప్పుడే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని అన్నారు. విధాన రూపకల్పనలు లేకుండా రాష్ట్రం అభివృద్ధి చెందదని పేర్కొన్నారు. ప్రపంచంతో పోటీ పడేలా పీవీ నరసింహారావు ఆర్థిక విధానాలు తీసుకొచ్చారని గుర్తు చేశారు.

మిగతా2లో...

### కేసీఆర్ హయాంలో అభివృద్ధి పరుగులు

- గత పదేళ్లలో గణనీయంగా ఎంఎస్ఎంఈ వృద్ధి
- కురచ బుద్ధితో విమర్శలు చేసినంత మాత్రాన నిజాలు దాగవు
- కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ విమర్శలు


2

### నవంబర్ 10లోగా బీసీ గణన పూర్తి చేయాలి
లేదంటే ప్రత్యక్ష ఆందోళనకు దిగుతాం.. కాంగ్రెస్ సర్కారుకు కేటీఆర్ హెచ్చ
2

### హైదరాబాద్‌తో పాటు జిల్లాల అభివృద్ధి

- అదే మా ప్రభుత్వ విధానం
- ట్రిలియన్ ఎకానమీనే సీఎం సంకల్పం
- ఎంఎస్ఎంఈల పాలసీ విడుదల కార్యక్రమంలో మంత్రి శ్రీధర్‌బాబు


2


2

### భారాస పాలనలో ఘనతను కాంగ్రెస్ ఖాతాలో వేసుకుంటున్నారు
ఎంఎస్ ఎంఈలపై హరీశ్‌రావు ఆరోపణ

### ఆ సోదాలు ఆపాలని చెప్పలేం
పోలీసుల వివరణ తీసుకోకుండా అలా ఆదేశాలివ్వలేం
మిషన్ చబుత్ర, ఆపరేషన్ రోమియోలపై హైకోర్టు
విచారణ 4 వారాలకు వాయిదా


2

# నిఖత్ జరీన్‌కు గ్రూప్1 ఉద్యోగం

**హైదరాబాద్:** బాక్సర్ నిఖత్ జరీన్‌కు తెలంగాణ ప్రభుత్వం ఉద్యోగం కల్పించింది. జరీన్‌ను డీఎస్పీగా నియమిస్తూ డీజీపీ జితేందర్ నియామక పత్రాన్ని అందజేశారు. జరీన్ మూడేళ్లపాటు ప్రొబెషనరీ ట్రైనింగ్ చేయాల్సి ఉంటుంది. నిఖత్ జరీన్‌కు గ్రూప్-1 క్యాడర్ ఉద్యోగం ఇస్తానని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఇస్తాంబుల్‌లో జరిగిన మహిళల ప్రపంచ బాక్సింగ్ విభాగంలో వరల్డ్ ఛాంపియన్ షిప్‌ను నిజామాబాద్ జిల్లాకు చెందిన నిఖత్ జరీన్ సాధించారు.గత ప్రభుత్వం జరీన్‌కు నజారానా ప్రకటించింది. నివాస స్థలం కేటాయించింది. కేంద్ర ప్రభుత్వం అర్జున అవార్డు అందజేసింది. గ్రూప్-1 క్యాడర్ ఉద్యోగం ఇస్తామని రేవంత్ ప్రభుత్వం మాట ఇచ్చి నిలబెట్టుకుంది. గత నెల 1వ తేదీన జరిగిన మంత్రివర్గ సమావేశంలో సెక్షన్ 4లో తెలంగాణ రెగ్యులేషన్ ఆఫ్ అపాయింట్ మెంట్స్‌కు సవరణ చేసింది. నిఖత్ జరీన్‌కు ఉద్యోగం ఇవ్వాలని హోం శాఖను ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు హోం శాఖ డీఎస్పీగా నియమించింది.

**రెండుసార్లు టైటిల్**

నిఖత్ జరీన్ వరల్డ్ ఛాంపియన్ షిప్‌లో రెండుసార్లు టైటిల్ గెలుచుకుంది. 2023, 2022లో కూడా టైటిల్ నెగ్గింది. కామన్వెల్త్ గేమ్స్‌లో స్వర్ణం, ఏషియన్ గేమ్స్‌లో కాంస్య పతకాలు సాధించింది. పారిస్ ఒలింపిక్స్‌లో మాత్రం నిరాశ పరిచింది. మహిళల 50 కేజీల విభాగంలో ప్రీ క్వార్టర్స్‌లో వెనుదిరిగింది.

# కేసీఆర్ హయాంలో అభివృద్ధి పరుగులు

**విశ్వంభర, హైదరాబాద్:** కేసీఆర్‌ను తక్కువ చేయాలని.. కురచ బుద్ధితో విమర్శలు చేసినంత మాత్రాన నిజాలు దాగవని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. పదేళ్ల కేసీఆర్ పరిపాలనలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) రంగం అభివృద్ధిలో పరుగులు పెట్టిందని గుర్తు చేశారు. ఇది తాను చెబుతున్నది కాదని.. స్వయంగా కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారికంగా లెక్కలతో వివరించిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని తక్కువ చేసి చూపాలని ఎంత ప్రయత్నించినప్పటికీ అది సాధ్యం కాలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేసిన సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల పాలసీలో బీఆర్ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధిని ప్రస్తావించిన అంశాన్ని కేటీఆర్ గుర్తు చేశారు. కేసీఆర్ హయాంలో పారిశ్రామిక ప్రగతి పరుగులు పెట్టిందనడానికి కాంగ్రెస్ చెప్పిన లెక్కలే నిదర్శనమన్నారు. గత పదేళ్లలో ఎంఎస్ఎంఈ వృద్ధి రేటు 11 శాతం నుంచి 15 శాతం ఉందని ప్రభుత్వమే అంగీకరించిందని కేటీఆర్ చెప్పారు. 2018-2023 మధ్యలో టీఎస్ఐపాస్ ద్వారా పెరిగిన సగటు పెట్టుబడులు 115శాతం ఉన్నాయన్నారు. జీఎస్డీపీలో ఎంఎస్ఎంఈల వాటాలో 10శాతం వృద్ధి చెందిందన్నారు. ఏటా ఎంఎస్ఎంఈల సంఖ్య 15 శాతం పెరిగిందని, ఎంఎస్ఎంఈల కారణంగా ఉపాధి 20శాతం పెరిగిందన్నారు. ఎంఎస్ఎంఈల్లో ఎస్సీ, ఎస్టీ మహిళలు 30శాతం ఉద్యోగాలు పొందారని.. 2020-2023 మధ్యలో అతి తక్కువ ఎంఎస్ఎంఈలు మూతబడ్డ రాష్ట్రం తెలంగాణ అన్నారు. ఇవి బీఆర్ఎస్ చెబుతున్న లెక్కలు కాదని.. కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పిన లెక్కనేనని కేటీఆర్ చెప్పారు. కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన టీఎస్ఐపాస్ వంటి ప్రగతిశీల విధానాలు, చిన్న పరిశ్రమలకు ఇచ్చిన ప్రోత్సాహకాలతోనే ఈ అద్భుత ప్రగతి సాధ్యమైందన్నారు. కేసీఆర్‌ని తక్కువ చేయాలనుకొని కురచ బుద్ధితో విమర్శలు చేసినంతా మాత్రాన నిజాలు దాగవని అన్నారు. సూర్యుడు తూర్పున ఉదయిస్తాడు అన్నది ఎంత నిజమో.. కేసీఆర్ తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధి చేశాడన్నది అంతే నిజమని కేటీఆర్ అన్నారు. ఇదే విషయాన్ని రానున్న రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వమో ఒప్పుకోక తప్పదని స్పష్టం చేశారు.

# నవంబర్ 10లోగా బీసీ గణన పూర్తి చేయాలి

**విశ్వంభర, హైదరాబాద్:** నవంబర్ 10వ తేదీలోగా బీసీ గణన పూర్తి చేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. తెలంగాణ భవన్‌లో ఆయన బుధవారం బీఆర్ఎస్ బీసీ నేతలతో సమావేశం నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ బీసీ డిక్లరేషన్ పేరుతో చేసిన మోసంపై పార్టీకి సంబంధించిన బీసీ నేతలతో చర్చించినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అమలు చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. అమలు జరిగే వరకు కాంగ్రెస్ సర్కారును నిలదీస్తామని స్పష్టం చేశారు. 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాల్సిందేనన్నారు. వెంటనే సమగ్ర కులగణన ప్రారంభించి.. నవంబర్ 10వ తేదీలోగా పూర్తి చేయకుంటే బీసీల తరపున ఎలా ముందుకువెళ్తామన్నదానిపై కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. అవసరమైతే ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామన్నారు. బీసీలకు రూ.లక్ష కోట్ల బడ్జెట్ ఇస్తామని చెప్పి రూ.8వేలకోట్లు మాత్రమే బడ్జెట్‌లో పెట్టారని విమర్శించారు. బీసీ సబ్‌ప్లాన్ తీసుకురావాలన్నారు. రూ.25వేల నుంచి రూ.35వేలకోట్లు పెట్టాలన్నారు. స్థానిక సంస్థల్లో బీసీల వాటా పెంచాలన్నారు. ఎంబీసీలకు మంత్రిత్వశాఖ ఏర్పాటు చేస్తామన్నారని.. హామీ ఇచ్చిన మేరకు మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కేబినెట్‌లో ఇద్దరు మాత్రమే బీసీ మంత్రులు ఉన్నారన్నారు. నేతన్నలు సంక్షోభంలో ఉన్నారని.. చేపపిల్లల పంపిణీ ఆపేసి గంగపుత్రుల పొట్టగొడుతున్నదని ధ్వజమెత్తారు. బలహీన వర్గాల సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ పోరాడుతుందన్నారు. బీసీ డిక్లరేషన్‌లోనే దాదాపు దాదాపు 70 హామీలు ఉన్నాయని.. బీసీల కోసం బీఆర్ఎస్ కదిలిందన్నారు. రాష్ట్రంలోని బలహీన వర్గాలకు పెద్దదిక్కుగా బీఆర్ఎస్ ఉంటుందన్నారు. జమిలి ఎన్నికలపై కేంద్ర ప్రభుత్వం క్లారిటీ ఇవ్వాలన్నారు. వచ్చే ఎన్నికల కోసం దేశంలోని అన్ని ప్రభుత్వాలను రద్దు చేస్తారా? బీఆర్ఎస్ నేత ప్రశ్నించారు. ఈ జమిలీ ఎన్నికలపై పార్టీ నేతలమంతా కూర్చొని చర్చించి నిర్ణయిస్తామన్నారు.

# కొత్తగూడెం కలెక్టరేట్‌లో ఏసీబీ దాడులు



**విశ్వంభర, కొత్తగూడెం:** కొత్తగూడెం కలెక్టర్‌లో బుధవారం అవినీతి నిరోధకశాఖ అధికారులు దాడులు నిర్వహించారు. డ్రిప్ ఇరిగేషన్‌కు అనుమతి కోసం లంచం తీసుకుంటుండగా జిల్లా హార్టికల్చర్ అధికారిని అధికారులు పట్టుకున్నారు. హార్టికల్చర్‌ఆఫీసర్ సూర్య నారాయణ డ్రిప్ ఇరిగేషన్ పర్మిషన్ కోసం రూ.1.14లక్షలు తీసుకుంటుండగా అధికారులు వలేసి పట్టుకున్నారు. హార్టికల్చర్ అధికారి సూర్యనారాయణను అదుపులోకి తీసుకొని దర్యాప్తు చేస్తున్నారు చేస్తున్నట్లు ఏబీసీ డీఎస్పీ రమేశ్ తెలిపారు. డ్రిప్‌కు సంబంధించిన ఫైల్స్‌ను ప్రాసెస్ చేసేందుకు, మైక్రో ఇరిగేషన్ ఇంజినీర్‌తో పొలాలను పరిశీలించేందుకు, బిల్లులు కలెక్టర్‌కు పంపేందుకు పాల్వంచ, ములకలపల్లి, దమ్మపేట మండలాల్లో రైతులకు సంబంధించిన 15 మంది నుంచి దాదాపు 14.17లక్షల పనులకు గాను లంచం డిమాండ్ చేయగా.. బాధితులు ఏసీబీని ఆశ్రయించారు. ఈ మేరకు ఏసీబీ అధికారులును హార్టికల్చర్ అధికారిని వలవేసి పట్టుకున్నారు. ఎవరైనా అధికారులు పనులు చేసేందుకు లంచం డిమాండ్ చేస్తే తమను ఆశ్రయించాలని ఏసీబీ అధికారులు కోరారు. జిల్లా అధికారిని వరంగల్ సెషన్స్ కోర్టు జడ్జి ముందు హాజరుపరచనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

# ఆ సోదాలు ఆపాలని చెప్పలేం



**విశ్వంభర, హైదరాబాద్:** మిషన్ చబుత్ర, ఆపరేషన్ రోమియో వంటి పేర్లతో పోలీసులు నిర్వహిస్తున్న సోదాలను నిలిపివేయడానికి హైకోర్టు నిరాకరించింది. పోలీసుల నుంచి వివరాలు తెలుసుకోకుండా సోదాలను నిలిపివేయాలంటూ ఆదేశాలివ్వలేమని తేల్చి చెప్పింది. పోలీసులు నిర్వహిస్తున్న ఈ సోదాలపై వివరణ ఇవ్వాలంటూ హోంశాఖ ముఖ్యకార్యదర్శి, డీజీపీ, నగర పోలీసు కమిషనర్లకు నోటీసులు జారీ చేస్తూ విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. మిషన్ చబుత్రా, ఆపరేషన్ రోమియో, మిడ్‌నైట్ కౌన్సెలింగ్ వంటి పేర్లతో చట్టవిరుద్ధంగా సోదాలు నిర్వహిస్తుండటాన్ని సవాలు చేస్తూ హైదరాబాద్‌కు చెందిన సామాజిక కార్యకర్త మసూద్ ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆలోక్ ఆరాదే, జస్టిస్ జె శ్రీనివాసరావులతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. చిన్న చిన్న వ్యాపారులు, వీధి వ్యాపారులను రాత్రి 10:30 నుంచి 11 గంటల్లోనే మూసివేయిస్తున్నారని, ఇది 2015లో జారీ చేసిన జీఓకు ఇది విరుద్ధమని పిటిషనర్ తరపు న్యాయవాది ధర్మాసనానికి తెలిపారు. హోటళ్లు, రెస్టారెంట్లను ఉదయం 5 నుంచి రాత్రి 12 గంటలకు వరకు నిర్వహించుకోవడానికి ప్రభుత్వం అనుమతించినా పోలీసులు మూసివేయిస్తున్నారన్నారు. అయితే పోలీసులు చట్టవిరుద్ధంగా సోదాలు నిర్వహిస్తూ గుర్తింపు కార్డులు చూపాలంటూ ప్రజలను, ఇళ్లలోని మహిళలను వేధింపులకు గురి చేస్తున్నారన్నారు.

**నాలుగు వారాలు వాయిదా :** ఏ చట్టం కింద పోలీసులు సోదాలు నిర్వహిస్తున్నారని పోలీసులకు లేఖలు రాసినా ప్రయోజనం లేకపోయిందన్నారు. పేదలు నివసించే కొన్ని ఎంపిక చేసిన ప్రాంతాల్లోనే సోదాలు నిర్వహిస్తున్నారన్నారు. మిషన్ చబుత్రా, ఆపరేషన్ రోమియో పేర్లతో నిర్వహిస్తున్న సోదాలను నిలిపివేసేలా ఆదేశాలివ్వాలని కోరారు. ఇందులో పిటిషనర్ కూడా బాధితుడేనన్నారు వాదనలను విన్న ధర్మాసనం ప్రభుత్వానికి నోటీసులు జారీ చేస్తూ విచారణను 4 వారాలకు వాయిదా వేసింది

# రాహుల్‌గాంధీ హత్యకు కుట్ర



(మొదటి పేజీ తరువాయి)

ఎన్‌డీఏ నేతలు చేస్తున్న వ్యాఖ్యలే అందుకు నిదర్శనమని ఫిర్యాదులో పేర్కొన్నారు. జమ్ముకశ్మీర్, హరియాణా ఎన్నికల వేళ దేశంలో శాంతిభద్రతలకు భంగం కలిగించాలనే ఉద్దేశంతో రాహుల్‌పై దాడికి కుట్ర చేస్తున్నారని మాకెన్ పేర్కొన్నారు. శివసేన ఎమ్మెల్యే సంజయ్ గైక్వాడ్, బీజేపీ నేతలు తర్వీందర్ సింగ్ మేర్వా, రావ్‌నీత్‌సింగ్ భిట్టు, రఘురాజ్ సింగ్ రాహుల్‌పై చేసిన వ్యాఖ్యలు ఆయన భద్రతపై అనుమానాలు కలిగిస్తున్నాయని మాకెన్ తన ఫిర్యాదులో వివరించారు. మౌనంగా ఉండకుంటే ఇందిరా గాంధీకి పట్టిన గతే మీకూ పడుతుందంటూ రాహుల్‌ను ఉద్దేశించి ఈనెల 11న తర్వీందర్ సింగ్ చేసిన వ్యాఖ్యలను మాకెన్ తన ఫిర్యాదులో అజయ్ పేర్కొన్నారు. అలాగే రాహుల్ నాలుకను కోసి తెస్తే రూ.11లక్షలు ఇస్తానంటూ శివసేన నేత సంజయ్ గైక్వాడ్ చేసిన వ్యాఖ్యలు రాహుల్‌కు ఉన్న ముప్పును సూచిస్తున్నాయని మాకెన్ వివరించారు. ఈ ఫిర్యాదుపై వెంటనే కేసు నమోదు చేసి దర్యాప్తు చేయాలని పోలీసులను కోరారు. మాజీ ప్రధానులు ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ ఇప్పటికే దేశం కోసం తమ ప్రాణాలు త్యాగం చేశారని, ఈ పరిస్థితుల్లో రాహుల్‌కు హెచ్చరికలను పంపుతున్నారంటే ఎలా అర్థం చేసుకోవాలని మాకెన్ ప్రశ్నించారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలు, మైనారిటీల సంక్షేమంపై రాహుల్ మాట్లాడుతుంటే ఓర్వలేకే బీజేపీ నేతలు బెదిరింపులకు పాల్పడుతున్నారని మాకెన్ విమర్శించారు.

**రాహుల్ భద్రతకు కేంద్రం చర్యలు తీసుకోవాలి : స్టాలిన్**

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి బెదిరింపులు వస్తున్నాయంటూ మీడియాలో వస్తున్న వార్తలపై తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయనకు రక్షణ కల్పించేందుకు కేంద్రం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. "మీ నానమ్మకు పట్టిన గతే మీకు పడుతుంది" అని ఒక బీజేపీ నాయకుడు రాహుల్ గాంధీని బెదిరించినట్లు వార్తలు చదవి దిగ్భ్రాంతికి గురయ్యా. శివసేన శిందే వర్గం ఎమ్మెల్యే రాహుల్ నాలుకను కత్తిరిస్తే బహుమానం ప్రకటించడం, ఇతర బెదిరింపులు చూసి షాక్‌కు గురయ్యా. నా సోదరుడు రాహుల్‌కు పెరుగుతున్న చరిష్మా, ప్రజల మద్దతు చాలా మందిని అశాంతికి గురిచేసింది, ఇలాంటి నీచమైన బెదిరింపులకు దారితీసింది. ప్రతిపక్ష నాయకుడికి రక్షణ కల్పించడానికి కేంద్ర ప్రభుత్వం వేగంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

# హైదరాబాద్‌తో పాటు జిల్లాల అభివృద్ధి



**వి శ్వంభర, హైదరాబాద్:** హైదరాబాద్ తో పాటు ఇతర జిల్లాలు సమానంగా అభివృద్ధి చెందాలన్నదే తమ ప్రభుత్వ విధానమని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. మన రాష్ట్రం వన్ ట్రిలియన్ ఎకానమీ చేరుకోవాలని సీఎం సంకల్పించారన్నారు. తెలంగాణ ఆవిర్భావం తర్వాత తొలిసారి ఎంఎస్ఎంఈల పాలసీని విడుదల చేసినట్లు వెల్లడించారు. బుధవారం ఎంఎస్ఎంఈల పాలసీ విడుదల కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు.

“రాబోయే కాలంలో ఎంఎస్ఎంఈల్లో సాంకేతికతను వాడుకోవాలి. ఎంఎస్ఎంఈలను కాపాడుకోవాలని రాహుల్ గాంధీ కోరారు. ఎక్కువ స్థాయిలో ఉపాధి కల్పిస్తున్న రంగం ఎంఎస్ఎంఈలు. ఈ పరిశ్రమలకు చెందిన 120 మంది ప్రముఖుల నుంచి సలహాలు, సూచనలు తీసుకున్నాం. పారిశ్రామిక పార్కులను అభివృద్ధి చేస్తాం. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో మౌలిక వసతులతో ఫ్లాట్ ఫ్యాక్టరీలను ఏర్పాటు చేస్తాం. కొత్తగా క్లస్టర్లను ఏర్పాటు చేస్తున్నాం. కేంద్రం నుంచి ఆర్థిక సాయం పొందేందుకు సాంప్రదాయ, ప్రత్యామ్నాయం మార్గాలు చూశాం. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఆర్థిక పురోభివృద్ధిలో ఎంతో కీలక పాత్ర పోషిస్తాయి. రాష్ట్రం నుంచి అంతర్జాతీయ స్థాయిలో ఎగుమతులు జరిగేలా అందుబాటులోకి తీసుకొచ్చాం" అని తెలిపారు.

**రాహుల్ ఆలోచనతోనే కొత్త పాలసీ: భట్టి**

"రాహుల్ గాంధీ ఆలోచనలతోనే ఎంఎస్ఎంఈ నూతన పాలసీ తీసుకొచ్చాం. చాలా రాష్ట్రాల్లో ఎంఎస్ఎంఈలు మూతపడ్డాయి. ఇక్కడ ఇతర రాష్ట్రాలకు విభిన్నంగా రూపొందించారు. ఎంఎస్ఎంఈ పాలసీ రూపొందించిన శ్రీధర్ బాబుకు ధన్యవాదాలు. ఆర్థిక వ్యవస్థ పటిష్టత కోసం ఎంఎస్ఎలు కీలకం. దేశ జీడీపీకి, రాష్ట్ర జీడీపీకి ఎంఎస్ఎంఈ ఎంతో తోడ్పడుతుంది. దాదాపు రూ.80వేల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు బహుళ జాతి కంపెనీలు ముందుకు వచ్చాయి. భారీ పరిశ్రమలకు ఎంఎస్ఎంఈల నుంచి పలు ఉత్పత్తులు ఎగుమతి అవుతాయి" అని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడించారు.

# 'ఒకసారి తేల్చిన అంశంపైనే మళ్లీ పిటిషన్ ఎలా వేస్తారు?

- బీఆర్ఎస్ కార్యాలయం కూల్చివేత వివాదంపై హైకోర్టు సీరియస్
- కూల్చివేత నోటీసులపై జోక్యం చేసుకోలేమని స్పష్టీకరణ



**విశ్వంభర, హైదరాబాద్:** నల్గొండ జిల్లాలో భారత రాష్ట్ర సమితి పార్టీ భవనం క్రమబద్ధీకరణ వివాదంపై రెండోసారి పిటిషన్ దాఖలు చేయడంపై హైకోర్టు అగ్రహం వ్యక్తం చేసింది. ఒకసారి తేల్చిన అంశంపైనే మరోసారి పిటిషన్ ఎలా దాఖలు చేస్తారని ప్రశ్నించింది. కోర్టు సమయం వృథా చేసినందుకు రూ. లక్ష రూపాయలను ఖర్చుల కింద నల్గొండ న్యాయసేవాధికార సంస్థకు 4 వారాల్లో డిపాజిట్ చేయాలని ఆదేశించింది. క్రమబద్ధీకరణను తిరస్కరిస్తూ కూల్చివేత చర్యలు చేపడతామంటూ నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఇచ్చిన నోటీసుల్లో జోక్యం చేసుకోలేమంటూ తేల్చి చెప్పింది. నల్గొండ జిల్లా సర్వే నం 1506లో ఎకరం స్థలంలోని బీఆర్ఎస్ కార్యాలయ భవన నిర్మాణాన్ని క్రమబద్ధీకరణకు నిరాకరించడంతోపాటు జులై 30న మున్సిపల్ కమిషనర్ జారీ చేసిన కూల్చివేత నోటీసును సవాలు చేస్తూ నల్గొండ బీఆర్ఎస్ తరపున మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీం దర్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ టి.వినోద్‌కుమార్ విచారణ చే పట్టా రు . పార్టీ కార్యాలయం క్రమబద్ధీకరణ ద రఖాస్తును తిరస్కరిస్తూ జులై 20న కమిషనర్ జారీ చేసిన ప్రొసీడింగ్‌ను సవాలు చేస్తూ హైకోర్టును ఆశ్రయించినట్లు పిటిషనర్ తరపు న్యాయవాది తెలిపారు. అయితే ఇందులో జోక్యానికి హైకోర్టు నిరాకరిస్తూ చట్టప్రకారం ప్రత్యామ్నాయాలను చూసుకోవచ్చని సలహా ఇచ్చిందన్నారు.

పిటిషన్‌ను కొట్టివేస్తూ లక్ష రూపాయలు జరిమానా కమిషనర్ ఉత్తర్వులను సవాలు చేయడానికి ప్రత్యామ్నాయంగా మున్సిపల్ ట్రైబ్యునల్ లేదని, అందువల్ల మళ్లీ హైకోర్టును ఆశ్రయించినట్లు పిటిషనర్ తరపు న్యాయవాది తెలిపారు. క్రమబద్ధీకరణను తిరస్కరణతోపాటు జులై 2న 15 రోజుల్లో అక్రమ నిర్మాణాలను తొలగించాలని, లేని పక్షంలో మున్సిపాలిటీ తొలగిస్తుందని నోటీసులు జారీ చేసిందన్నారు. కూల్చివేత ఉత్తర్వుల అమలును నిలిపివేసి క్రమబద్ధీకరణ దరఖాస్తును పరిశీలించేలా ఆదేశించాలని కోరారు. ఈ సందర్భంగా అక్రమ నిర్మాణాలను కూల్చివేయవద్దంటూ సుప్రీం కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను ప్రస్తావించారు. నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ ఎలాంటి అనుమతులేకుండా నిర్మాణాలు చేపట్టినట్లు తెలిపారు. అందువల్ల అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలని నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. వాదనలను విన్న న్యాయమూర్తి పిటిషనర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. క్రమబద్ధీకరణ నిరాకరణ ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోవడానికి గతంలోనే హైకోర్టు నిరాకరించగా తిరిగి అదే అభ్యర్థనపై మరో పిటిషన్ ఎలా వేస్తారని నిలదీశారు. సుప్రీం కోర్టు ఆదేశాలు అన్నింటికీ వర్తించవని మున్సిపాలిటీ నోటీసులు జారీ చేసి చర్యలు చేపడుతోందన్నారు. మున్సిపల్ కమిషనర్ జారీ చేసిన కూల్చివేత ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోలేమంటూ పిటిషన్‌ను జరిమానాతో కొట్టివేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఒకే అభ్యర్థనపై రెండోసారి పిటిషన్ దాఖలు చేసి కోర్టు సమయాన్ని వృథా చేసినందుకు లక్ష రూపాయలను నల్గొండ జిల్లా న్యాయసేవాధికార సంస్థకు చెల్లించాలని ఆదేశించారు.

# జమిలి ఎన్నికలకు సై

(మొదటి పేజీ తరువాయి)

ప్రస్తుత ఎన్డీయే సర్కారు హయాంలోనే జమిలి ఎన్నికలు అమలుచేసి చూపుతామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఇటీవల స్పష్టంచేశారు. గతనెల స్వాతంత్ర్య దినోత్సవం రోజున ప్రధాని మోదీ ఎర్రకోట నుంచి ప్రసంగిస్తూ జమిలి ఎన్నికల గురించి ప్రస్తావించారు. దేశవ్యాప్తంగా ఏటా ఏదోఒక రాష్ట్రంలో ఎన్నికలు జరుగుతున్నాయని, వీటి ప్రభావం దేశ పురోగతిపై పడుతోందని ఆందోళన వ్యక్తంచేశారు. దీనినుంచి బయటపడాలంటే జమిలి ఎన్నికలే పరిష్కారమని అన్నారు. ఈ దిశగా అన్ని రాష్ట్రాలు ముందుకురావాలని పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో ఎన్డీఏ 3.0 సర్కారులోనే జమిలి ఎన్నికలు అమల్లోకి వస్తాయని రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి.

**ఎన్నికల ప్రక్రియ సులభతరం: కమిటీ**

'ఒక దేశం- ఒకే ఎన్నికలు' విధానాన్ని అమలు చేయడం ద్వారా ఎన్నికల ప్రక్రియ సులభతరం అవుతుందని, తద్వారా వేగవంతమైన ఆర్థికాభివృద్ధి సాధ్యమని కమిటీ తన నివేదికలో పేర్కొంది. పదేపదే ఎన్నికల వల్ల వలస కార్మికులు పలుమార్లు ఓటేయడం కోసం సెలవులపై తమ ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని.. దీంతో ఉత్పత్తిలో అంతరాయం కలుగుతోందని వెల్లడించింది. దీన్ని నివారించాలంటే జమిలి ఎన్నికలే ఏకైక పరిష్కారమని పేర్కొంది. దీనికి సంబంధించిన బిల్లును పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో ప్రవేశపెట్టే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. 18 రాజ్యాంగ సవరణలను ప్యానల్ సిఫారస్ చేసింది.

# ప్రజాస్వామ్యానికి విఘాతం.. జమిలి ఎన్నికలపై ఓవైసీ స్పందన

**హైదరాబాద్:** జమిలి ఎన్నికల విధానం ఫెడరలిజాన్ని నాశనం చేస్తుందని ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ అభిప్రాయపడ్డారు. రాజ్యాంగం ప్రాథమిక నిర్మాణంలో భాగమైన ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగిస్తుందని విమర్శించారు.జమిలి ఎన్నికలను కేంద్ర కేబినెట్ ఆమోదించిన నేపథ్యంలో ఎక్స్ వేదికగా స్పందించారు. ప్రధాని మోదీకి, కేంద్రమంత్రి అమిత్ షాకు తప్ప ఎవరికీ బహుళ ఎన్నికలపై సమస్యలు లేవని పేర్కొన్నారు. దేశానికి ఏకకాల ఎన్నికలు అవసరం కాదని తేల్చిచెప్పారు. ఇది బీజేపీ, ఆర్ఎస్ఎస్ సిద్ధాంతం అని ధ్వజమెత్తారు. తరచుగా వచ్చే ఎన్నికలే ప్రజాస్వామ్య జవాబు దారీతనాన్ని మెరుగుపరుస్తాయని ఓవైసీ పేర్కొన్నారు. ఈ అంశం పురపాలక సంఘం, స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా ప్రచారం చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.

# భారాస పాలనలో ఘనతను కాంగ్రెస్ ఖాతాలో వేసుకుంటున్నారు

**విశ్వంభర, హైదరాబాద్:** కేసీఆర్ పాలనలో ఎంఎస్ఎంఈల అభివృద్ధి, భారాస సాధించిన విజయాలను.. కాంగ్రెస్ ప్రభుత్వం తమ ఖాతాల్లో వేసుకుంటూ గొప్పలు చెప్పుకోవడం శోచనీయమని మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు 'ఎక్స్' వేదికగా విమర్శించారు. కేసీఆర్ పాలనలో ఎంఎస్ఎంఈలు ఎంతో అభివృద్ధి చెంది దేశానికి ఆదర్శంగా నిలిచాయని తెలిపారు. దేశంలోని చాలా రాష్ట్రాల్లో ఎంఎస్ఎంఈలు మూతపడ్డా.. తెలంగాణ రాష్ట్రంలో అనుసరించిన ఐపాస్ లాంటి విధానాలు ఎంఎస్ఎంఈలను దృఢంగా నిలిపాయని గుర్తు చేశారు. పెట్టుబడుల్లో 115 శాతం పెరుగుదలతో దేశంలో అగ్రగామిగా నిలవడంతో పాటు, ఉద్యోగాల కల్పనలో రాష్ట్రం 20 శాతం వృద్ధిరేటు సాధించిందని గుర్తు చేశారు. తెలంగాణలో ఎస్సీ, ఎస్టీ మహిళలకు 30 శాతం ఉద్యోగ అవకాశాలు లభించాయని స్పష్టం చేశారు. ఎంఎస్ఎంఈ రంగంలో స్థిరమైన వృద్ధి నమోదు చేసి ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందని చెప్పారు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం భారాస పాలనలో సాధించిన ఘనతను వారి ఖాతాలో వేసుకుంటూ గొప్పలు చెప్పుకొంటోందని విమర్శించారు. ఎంఎస్ఎంఈల అభివృద్ధికి చేసిన కృషి, భవిష్యత్తు కార్యాచరణ ఏంటో చెప్పకుండా గత ప్రభుత్వ విజయాలతో కాలం గడపడం శోచనీయమని హరీశ్ రావు ఎద్దేవా చేశారు.

# యువతకు చేయూత అందిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

దేశం ఆర్థిక పరిస్థితి దెబ్బతిన్నప్పుడు పీవీ నరసింహారావు కృషిని మనం జ్ఞాపకం చేసుకోవాలని సీఎం అన్నారు.

**ప్రతి విద్యార్థికి ఉపాధి కల్పించేలా పరిశ్రమలను ప్రోత్సహిస్తాం**

'ప్రతీ ఏటా ఎంతో మంది ఇంజినీరింగ్ విద్యార్థులు బయటికొస్తున్నారు. ప్రతి విద్యార్థికీ ఉపాధి కల్పించే విధంగా పరిశ్రమలను ప్రోత్సహిస్తాం. స్కిల్ అప్‌గ్రెడేషన్ చేయడానికి కృషి చేస్తున్నాం. మహేంద్ర, టాటా కంపెనీలతో కూడా ప్రత్యేక సమావేశాలు చేసి పెట్టుబడులకు ప్రోత్సహిస్తున్నాం. మేము చేసే ప్రతి ప్రయత్నమూ రాష్ట్ర భవిష్యత్తు కోసమే. వ్యవసాయం అనేది పండుగ, దండుగ కాదు అనేదే మా ప్రభుత్వ నినాదం. రూ.18 వేల కోట్ల నిధులు విడుదల చేసి రైతుల రుణాలు తీర్చాం.' అని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. "విద్యార్థులు పొందుతున్న పట్టాలకు ఇండస్ట్రీకి కావాల్సిన నైపుణ్యాలకు సరిపోవడం లేదని ఈ గ్యాప్‌ను తొలగించేలా విద్యార్థులకు నైపుణ్యాన్ని పెంపొందించేలా చర్యలు చేపట్టాం. ప్రముఖ కంపెనీలు స్కిల్ యూనివర్సిటీకి రూ.300 నుంచి రూ.500 కోట్లలను సామాజిక బాధ్యతగా ఇచ్చేందుకు ముందుకు వచ్చాయి. తెలంగాణ ఆర్థిక వ్యవస్థ ట్రిలియన్ డాలర్లకు చేరుకోవాలంటే ఎంఎస్ఎంఈలు కీలకం. 2028లో రాష్ట్ర ఆర్థిక బడ్జెట్ రూ.7 లక్షల కోట్లకు చేరుకుంటుంది' అని రేవంత్ రెడ్డి అన్నారు.

**మూసీ నది వీక్షణకు పర్యాటకులు వచ్చేలా అభివృద్ధి చేస్తాం**

తెలంగాణ రాష్ట్రం వడ్డించిన విస్తరాకును తలపిస్తోందని రేవంత్‌రెడ్డి అన్నారు. పరిశ్రమలకు అవసరమైన భూమి, నీరు, ఆర్థిక సాయం అందిస్తామన్నారు. మూసీ నది వీక్షణకు పర్యాటకులు ఇతర దేశాల నుంచి వచ్చేలా అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. దళితులు, గిరిజనులు, మహిళలు అభివృద్ధి చెందితేనే రాష్ట్రం బాగుపడినట్లు అని స్పష్టం చేశారు. అలాగే ప్రభుత్వ పాఠశాలలను కూడా ఎంతో అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. ఎంఎస్ఎంఈలు అభివృద్ధి చెందడం ద్వారానే రాష్ట్రాలు వృద్ధి చెందుతాయని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# మున్సిపాలిటీలో విలీనంపై వివరణ ఇవ్వండి



- 4 వారాల్లో కౌంటర్ దాఖలు చేయండి
- శంషాబాద్ మండలంలోని 51 గ్రామ పంచాయతీలపై హైకోర్టు ఆదేశం

**విశ్వంభర, హైదరాబాద్:** శంషాబాద్ మండలంలో 51 గ్రామ పంచాయతీలను మున్సిపాలిటీలో విలీనం చేయడంపై వివరణ ఇవ్వాలంటూ ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. పూర్తి వివరాలతో 4 వారాల్లో కౌంటర్లు దాఖలు చేయాలంటూ పురపాలకశాఖ, సాధారణ పరిపాలన శాఖ ముఖ్యకార్యదర్శులు, న్యాయశాఖ కార్యదర్శి, జీహెచ్ఎంసీ కమిషనర్లకు నోటీసులు జారీ చేసింది. శంషాబాద్ మండలంలోని 51 పంచాయతీలను శంషాబాద్ మున్సిపాలిటీలో విలీనం చేస్తూ ప్రభుత్వం జారీ చేసిన ఆర్డినెన్స్ ను సవాలు చేస్తూ మాజీ సర్పంచి పద్మావతి, మరో నలుగురు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆలోక్ అరాధే, జస్టిస్ జె శ్రీనివాసరావులతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. చిన్న గోల్కొండ, పెద్దగోల్కొండ, బహదూర్‌గూడ, హమీదుల్లానగర్, రషీద్‌గూడ తదితర గ్రామాల ప్రజలు విలీనాన్ని వ్యతిరేకిస్తున్నారని పిటిషనర్ తరఫు న్యాయవాది సంజన కోర్టుకు తెలిపారు. పట్టణీకరణతో సహజ జీవనానికి ఇబ్బందులు ఎదురవుతాయని, జీవన వ్యయం పెరిగిపోతుందన్నారు. పట్టణీకరణ పేరుతో గ్రామీణ వాతావరణం దెబ్బతింటుందని, పన్నుల పెంపు ఉంటుందన్నారు. పంచాయతీ సర్పంచులు సొంత నిధులతో పంచాయతీలను అభివృద్ధి చేశారని, విలీనం జరిగితే వాటిని రాబట్టుకోవడం కష్టమన్నారు. వాదనలను విన్న ధర్మాసనం కౌంటర్లు దాఖలు చేయాలని ప్రతివాదులను ఆదేశిస్తూ విచారణను 4 వారాలకు వాయిదా వేసింది.

**మేడ్చల్ మల్కాజిగిరిలో హైడ్రాకు హైకోర్టు నోటీసులు**

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బాచుపల్లి మండలం నిజాంపేటలో ఎర్రకుంట ఎఫ్టీఎల్ పరిధిలో అక్రమ నిర్మాణాలు చేపట్టారంటూ మ్యాప్స్ ఇన్‌ఫ్రా పై నమోదు చేసిన క్రిమినల్ కేసుకు సంబంధించి వివరణ ఇవ్వాలంటూ హైడ్రాకు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఆక్రమణలపై నీటిపారుదల శాఖ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బాచుపల్లి పోలీసు స్టేషన్‌లో నమోదైన కేసును కొట్టివేయాలంటూ మ్యాప్స్ ఇన్‌ఫ్రా తరఫున మేనేజింగ్ ఫార్టనర్ సుధాకర్ రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ కె.సుజన విచారణ చేపట్టారు. తాము కొనుగోలు చేసిన భూమిలోనే నిర్మాణాలు చేపట్టామని, తప్పుడు కేసులు నమోదు చేశారని కొట్టివేయాలని పిటిషనర్ తరఫు న్యాయవాది కోరారు. వాదనలను విన్న న్యాయమూర్తి వివరణ ఇవ్వాలంటూ హైడ్రాకు, బాచుపల్లి పోలీసులకు, ఇరిగేషన్ శాఖ ఏఈఈకి నోటీసులు జారీ చేస్తూ విచారణను వాయిదా వేసింది.



# తిరుమలలో శ్రీవారి హుండీకి రూ.4.16 కోట్లు ఆదాయం

**విశ్వంభర, తిరుమల :** తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతుంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో కంపార్టుమెంట్లు నిండిపోయాయి. కృష్ణాతేజ గెస్ట్ హౌజ్ వరకు క్యూలైన్లో నిలబడి యున్నారు. టోకెన్లు లేని భక్తులకు 24 గంటల్లో సర్వదర్శనం కలుగుతుందని టీటీడీ అధికారులు తెలిపారు. నిన్న శ్రీవారిని 72,072 భక్తులు దర్శించుకోగా 30,384 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించుకున్న కానుకల ద్వారా హుండీ ఆదాయం రూ. 4.16 కోట్లు వచ్చిందన్నారు.కూరగాయల దాతలను అభినందించిన అదనపు ఈవో రెండు దశాబ్దాలుగా టీటీడీ అన్నప్రసాదం కార్యకలాపాలకు వివిధ రాష్ట్రాల నుంచి పంపుతున్న కూరగాయల దాతలను అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి అభినందించారు. తిరుమలలోని అన్నమయ్య భవనంలో వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని టీటీడీ అన్నప్రసాద విభాగం ఆధ్వర్యంలో కూరగాయల దాతలతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా అదనపు ఈవో మాట్లాడుతూ, ఏడాది పొడవునా తిరుమలకు వచ్చే లక్షలాది మంది భక్తులకు పరిశుభ్రమైన రీతిలో రుచికరమైన, ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించడమే టీటీడీ నినాదమని అన్నారు. అన్నప్రసాదాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో భుజించే ఆఖరి భక్తునికి కూడా అందేలా మరిన్ని రకాల కూరగాయలను విరివిగా అందించాలని దాతలను కోరారు.












# తెలంగాణ వీరనారి... చాకలి ఐలమ్మ

## కోఠి మహిళా వర్సిటీ ఆమె పేరు పెట్టడం ప్రశంసనీయం




**నిజాం హయాంలోని భూస్వామిక శక్తులు, దొరల పెత్తనాన్ని ఎదిరించిన ధీశాలి చాకలి ఐలమ్మ అలియాస్ చిట్యాల ఐలమ్మ. రజాకార్లను తరిమికొట్టిన వీర వనిత. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి దారి చూపిన వీరమాత. సాయుధ పోరాటానికి ఆమె భూ సమస్యే వేదికైంది. తొలి భూపోరాటానికి నాంది పలికింది. దొరలు ఆక్రమించిన భూమిపై ప్రతిఘటించి విజయం సాధించింది. ఆమె ధీర చరిత్ర ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యం పొంది ప్రజా పోరాటాలకు స్ఫూర్తిగా నిలిచింది. బెదిరింపులకు లొంగలేదు, దెబ్బలకు జడువలేదు. లాటీలు, తూటాలను లెక్క చేయలేదు. భూమి నాది, పంట నాది మధ్యలో నీ పెత్తనమేందని.... దొరల అరాచకాలపై మాటల తూటాలు పేల్చిన వీర వనిత. మహిళల్లో చైతన్యం రగిల్చి... కూలీలు, రైతుల్ని ఏకతాటిపైకి తెచ్చిన మహా యోధురాలు. చాకలి ఐలమ్మ......ఓ చరిత్ర.**

దున్నేవాడిదే భూమని సాగిన తెలంగాణ సాయుధ పోరాటంలో ఐలమ్మ నిప్పురవ్వ. ఈ వీరవనిత పేరు లేకుండా సాయిధ పోరాట చరిత్రే లేదు. ఎంతోమందిలో స్ఫూర్తి నింపి, చైతన్యాన్ని రగిలించింది. రైతులు, కూలీలను ఏకం చేసి ఉద్యమానికి ఊపిరులూదింది. చాకలి ఐలమ్మది వరంగల్ జిల్లా రాయపర్తి మండలం క్రిష్టాపురం. పాలకుర్తికి చెందిన చిట్యాల నర్సయ్యను పెళ్లి చేసుకుంది. నలుగురు కొడుకులు, ఓ కూతురు. భూమినే నమ్ముకున్న ఐలమ్మ... పాలకుర్తిలో మల్లంపల్లి భూస్వామి కొండలరావు దగ్గర 40 ఎకరాల భూమిని కౌలుకు తీసుకుంది. బహుజన కులానికి(రజక) చెందిన ఐలమ్మ... దొరల భూమిని సాగు చేయడం పట్వారీ శేషగిరిరావుకు నచ్చలేదు. దీంతో ఐలమ్మను వేధించసాగాడు. కుటుంబంతో వచ్చి తనపొలంలో కూలీ చేయాలని హుకూం జారీ చేశాడు. పాలకుర్తిలో అప్పటికే ఆంధ్ర మహాసభ ఏర్పడింది. నిజాం అరాచకాలు, దొరల అణచివేతలపై ఆంధ్ర మహాసభ ప్రశ్నిస్తోంది. ఇందులో సభ్యురాలైన ఐలమ్మ పట్వారీ తాటాకు చప్పుళ్లకు బెదరలేదు. విసినూర్ దేశ్ ముఖ్ రామచంద్రారెడ్డి... అరాచకాలకు పెట్టింది పేరు. అన్యాయాన్ని ప్రశ్నిస్తే అంతం చేసేవాడు. పట్వారీ శేషగిరిరావు ఐలమ్మ విషయాన్ని దేశ్‌ముఖ్ కు చేరవేశాడు. విసినూర్ దేశ్‌ముఖ్ ఆగడాలను ఆంధ్రమహాసభ అడ్డుకుంటూ వస్తోంది. ఐలమ్మ కూడా సభలో సభ్యురాలవడంతో.... కక్ష గట్టాడు. ఐలమ్మ కమ్యూనిస్టుల్లో చేరిందని దొంగ కేసులు పెట్టించాడు. ఐలమ్మ కొడుకులను అరెస్ట్ చేయించాడు. బెదిరింపులకు లొంగని ఐలమ్మ న్యాయ పోరాటం చేసిన దొరపై గెలిచింది. మొదటిసారి ఐలమ్మ నుంచి దొరకు సురుకు తగిలింది. సహించలేని విసినూర్ దొర... ఐలమ్మ పొలాన్ని తనపేర రాయించుకున్నాడు. అయితే దొరను గానీ, దొర గుండాలను గానీ తన పొలాన్ని టచ్ చేయనివ్వలేదు ఐలమ్మ. పొలంలోని వడ్లను తీసుకునేందుకు వచ్చిన దొరగుండాలను ఆంధ్రమహాసంఘం సభ్యులతో కలిసి తరిమికొట్టింది. ధాన్యాన్ని ఇంటికి చేర్చింది. ఐలమ్మ చేతిలో రెండోసారి దెబ్బతిన్న విసినూర్ దొర రామచంద్రారెడ్డి ఈసారి మరింత క్రూరమైన పథకంతో వచ్చాడు. ఐలమ్మ చేతిలో ఓటమిని తట్టుకోలేని దేశ్ ముఖ్... రజాకార్లతో పాలకుర్తిలో దాడులు చేయించాడు. ఐలమ్మ ఇంటిని తగలబెట్టించాడు. రజకార్లు ధాన్యం ఎత్తుకెళ్లారు. కూతురిపై లైంగికదాడి చేశారు. అడ్డొచ్చినవారిని చంపేశారు. ఆర్థికంగా దెబ్బతీసినా, కుటుంబాన్ని కూల్చేసినా... ఐలమ్మ అడుగు ముందుకే పడింది. పోరాటంలో ప్రాణాలను సైతం లెక్క చేయకుండా ముందుకు సాగింది ఐలమ్మ. పట్వారీ శేషగిరిరావు ఇంటిని కూల్చేసింది. అక్కడే మక్కలు పండించింది. ఐలమ్మ తెగువ ఎన్నో ఉద్యమాలకు ఊపిరి పోసింది. ఐలమ్మ భూపోరాటం విజయంతో పాలకుర్తి దొర ఇంటిపై కమ్యూనిస్టులు దాడిచేసి ధాన్యాన్ని ప్రజలకు పంచారు. 90 ఎకరాల దొర భూమిని ప్రజలకు పంచారు. ఐలమ్మ భూపోరాటంతో మొదలుకొని సాయుధ పోరాటం చివరి వరకు 4 వేలమంది అమరులయ్యారు. 10 లక్షల ఎకరాల భూపంపకం జరిగింది. చివరకు 1985 సెప్టెంబర్ 10న ఐలమ్మ అనారోగ్యంతో తుది శ్వాస విడిచింది. కాగా, పాలకుర్తిలో ఐలమ్మ స్మారక భవనాన్ని ప్రజలిచ్చిన విరాళంతో సీపీఎం నిర్మించగా, అది నిర్వహణ లేక శిథిలావస్థకు చేరుకుంది. వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో 2015 సెప్టెంబర్ 10న పాలకుర్తిలో ఐలమ్మ కాంస్య విగ్రహాన్ని పొలిట్ బ్యూరో సభ్యురాలు బృందాకారత్, తెలంగాణ పోరాట యోధులు.బండ్రు నర్సింలు , మల్లు స్వరాజ్యం, తమ్మినేని వీరభద్రం, విమలక్క.చాడ వెంకటరెడ్డి, పాశం యాదగిరి, మన్నారం నాగరాజు సినీ హీరో మాదాల రవి. బసవరాజ్ సారయ్య ఎమ్మెల్సీ. జానకి రాములు. పైళ్ళ ఆశయ్య. కవులు కళాకారులు రచయితలు కుల సంఘాలు మేధావులు రాజకీయ నాయకులు కలసి ఆవిష్కరించారు. దాంతోపాటు, హైదరాబాద్ బాగ్ లింగంపల్లిలోని సీపీఎంకు చెందిన ఒక భవనానికి ఐలమ్మ పేరు పెట్టి మంచి నిర్ణయం తీసుకున్నారు. అయితే, ఇంతటి మహా పోరాట యోధురాలికి అటు సమైక్యపాలనలో గానీ, ఇటు ప్రత్యేక రాష్ట్రంలోనూ ప్రభుత్వాల నుంచి గుర్తింపు దక్కలేదు. తెలంగాణ వచ్చిన ఏడేళ్లకు ప్రజా సంఘాలు, కమ్యూనిస్టు పార్టీలు, నేను ప్రాతినిధ్యం వహించే తెలంగాణ లోక్ సత్తా పార్టీ కారణంగా అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వానికి చాకలి ఐలమ్మ గుర్తుకు వచ్చింది. మరుసటి ఏడాది నుంచి ఐలమ్మ, వర్ధంతి అధికారికంగా నిర్వహిస్తామని ప్రకటించింది. కానీ, కొత్తగా వచ్చిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం కోఠిలోని మహిళా యూనివర్సిటీకి ఐలమ్మ పేరు పెట్టడం, ఐలమ్మ మనవ రాలు శ్వేతకు మహిళా కమిషన్‌లో మెంబర్ ఇవ్వడం స్వాగతనీయం. ఇదే స్ఫూర్తితో ముందుకు వెళ్ళాలని సూచనలు ఇస్తున్నాం. వెళుతుందని ఆశిస్తున్నాం.



- మన్నారం నాగరాజు
తెలంగాణ లోక్ సత్తా పార్టీ, రాష్ట్ర అధ్యక్షుడు
ఫోన్: 9550844433



“ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామిక దేశం మనది. ఇక్కడ ఎన్నికల నిర్వహణ కూడా ఎప్పుడూ ప్రత్యేకమే. సాధారణంగా భారత్‌లో కేంద్రానికి, రాష్ట్ర అసెంబ్లీలకు విడివిడిగా ఎన్నికలు జరుగుతుంటాయి. పార్లమెంట్‌కు, రాష్ట్రాల అసెంబ్లీలకూ ప్రతి ఐదేళ్లకు ఓ సారి ఎన్నికలు జరుగుతాయి. అయితే అన్ని రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు ఏకకాలంలో జరగవు. శాసనసభ గడువు ముగిసే ఏడాది మాత్రమే ఎన్నికలు జరుగుతాయి. దీంతో ఏటా ఏదో ఒక చోట ఎన్నికలు జరుగుతూనే ఉంటాయి. ఈ కారణంతో అభివృద్ధి పనులకు విఘాతం కలుగుతోందని, ప్రభుత్వ ఖర్చు పెరిగిపోతోందని కేంద్ర ప్రభుత్వం గత కొన్నేళ్లుగా జమిలీ ఎన్నికలపై ఆలోచిస్తోంది.

# జమిలి ఎన్నికలు సాధ్యమేనా?

ఈనేపథ్యంలో కేంద్ర కేబినెట్ సంచలన నిర్ణయం తీసుకుంది. దేశవ్యాప్తంగా ఒకేసారి పార్లమెంట్ , అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించేలా జమిలి ఎన్నికలకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. వన్ నేషన్.. వన్ ఎలక్షన్‌కు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఇచ్చిన నివేదికకు కేబినెట్ ఆమోదం తెలిపింది. రానున్న శీతాకాల సమావేశాల్లో జమిలి ఎన్నికల బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టబోతోంది. ‘ఒకే దేశం, ఒకే ఎన్నికలు’ ప్రతిపాదనకు కేంద్ర ప్రభుత్వం బుధవారం ఆమోదముద్ర వేసింది.

**ఎన్నికల ప్రక్రియ సులభతరం..**

"ఒక దేశం, ఒకే ఎన్నికలు" విధానాన్ని అమలు చేయడం ద్వారా ఎన్నికల ప్రక్రియ సులభతరం అవుతుందని, తద్వారా వేగవంతమైన ఆర్థికవృద్ధికి దారితీస్తుందని ప్యానల్ పేర్కొంది. లోక్సభ, రాష్ట్ర అసెంబ్లీ, పంచాయతీలకు మూడు స్థాయిల్లో ఎన్నికలు నిర్వహించడం వల్ల వలస కార్మికులు పలుమార్లు ఓటేయడం కోసం సెలవులపై తమ ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని.. దీనివల్ల ఉత్పత్తిలో అంతరాయం కలుగుతుందని వెల్లడించింది. దానిని నివారించాలంటే జమిలి ఎన్నికలే ఏకైక పరిష్కారమని పేర్కొంది.ప్రస్తుత ఎన్డీయే సర్కారు హయాంలోనే జమిలి ఎన్నికలు అమలుచేసి చూపుతామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఇటీవల స్పష్టంచేశారు. గతనెల స్వాతంత్ర్య దినోత్సవం రోజున ప్రధాని మోదీ ఎర్రకోట నుంచి ప్రసంగిస్తూ జమిలి ఎన్నికల గురించి ప్రస్తావించారు. దేశవ్యాప్తంగా ఏటా ఏదోఒక రాష్ట్రంలో ఎన్నికలు జరుగుతున్నాయని, వీటి ప్రభావం దేశ పురోగతిపై పడుతోందని ఆందోళన వ్యక్తంచేశారు. దీనినుంచి బయటపడాలంటే జమిలి ఎన్నికలే పరిష్కారమని అన్నారు. ఈ దిశగా అన్ని రాష్ట్రాలు ముందుకురావాలని పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో ఎన్డీఏ 3.0 సర్కారులోనే జమిలి ఎన్నికలు అమల్లోకి వస్తాయని రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి.

**8మంది సభ్యులతో కమిటీ ఏర్పాటు**

వన్ నేషన్, వన్ ఎలక్షన్ ప్రతిపాదన కోసం మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ కమిటీ వేసింది కేంద్ర ప్రభుత్వం. 8 మంది సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేశారు. ఇందులో లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీలు, స్థానిక సంస్థలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించే అవకాశాలపై మాజీ రాష్ట్రపతి కమిటీ సభ్యులతో చర్చించారు. ఎన్నికలకు సంబంధించి అన్ని పార్టీల అభిప్రాయాలను, రాష్ట్రాల సవాళ్లను కమిటీ పరిశీలించింది. సుదీర్ఘంగా చర్చించిన అనంతరం రామ్‌నాథ్ కోవింద్ కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా కేంద్ర కేబినెట్ ఆమోద ముద్ర వేసింది.

**41 ఏళ్ల క్రితమే జమిలీ ఎన్నికల ఆలోచన..**

సుమారు 41 ఏళ్ల క్రితమే1983లో జమిలి ఎన్నికలు జరపాలని ఎన్నికల సంఘం సూచించింది. 1999లో లా కమిషన్ ఆఫ్ ఇండియా ఎన్నికల చట్ట సంస్కరణలపై 170వ నివేదికను సమర్పించింది. అన్ని రాష్ట్రాల శాసనసభలకు ఒకేసారి ఎన్నికలు జరగాలని అభిప్రాయపడింది. 2018లో లా కమిషన్ ఆఫ్ ఇండియా జమిలీ ఎన్నికలపై నివేదిక విడుదల చేసింది. 15 ఆగస్టు, 2019 నాటి స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో దేశమంతటా ఒకే సమయంలో ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించినట్లు ప్రధాని నరేంద్ర మోదీ ఎర్రకోట సాక్షిగా ప్రకటించారు. 1 సెప్టెంబర్, 2023న మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ అధ్యక్షతన 'ఒక దేశం, ఒకే ఎన్నిక'పై కమిటీ ఏర్పాటైంది. 2 సెప్టెంబర్ 2023న కమిటీ సభ్యులను ప్రకటించారు. హోం శాఖ మంత్రి అమిత్ షా సహా ఏడుగురు సభ్యులు ఇందులో ఉన్నారు. వారిలో రామ్‌నాథ్ కోవింద్ కూడా ఒకరు. 23 సెప్టెంబర్ 2023న కమిటీ మొదటి సమావేశం జరిగింది. ఈ అంశంపై ముందుగా అన్ని రాజకీయ పార్టీల అభిప్రాయం తీసుకోవాలని సమావేశంలో నిర్ణయించారు. రోడ్‌మ్యాప్‌కు సంబంధించి లా కమిషన్‌తో చర్చించి ముందుకు వెళ్లాలని కూడా నిర్ణయించారు. మాజీ రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ అధ్యక్షతన ఓ కమిటీని ఏర్పాటు చేసింది. సుదీర్ఘ కాలంపాటు విచారించి14 మార్చి, 2024న రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు కమిటీ నివేదిక అందించింది. 18,626 పేజీలు ఉన్న ఈ నివేదికలో లోక్‌సభ, అసెంబ్లీ, స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ కోసం ఓటర్లకు ఒకే ఓటరు జాబితా సిద్ధం చేయాలని నివేదికలో సూచించారు. 2023, సెప్టెంబర్ 2 న ఏర్పాటైన ఈ కమిటీ నివేదికను రూపొందించడానికి 191 రోజులు పట్టింది. సెప్టెంబర్ 18, 2024న కేంద్ర కేబినెట్ జమిలీ ఎన్నికలు జరపడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

**32 పార్టీల మద్దతు..**

ముఖ్యంగా, మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలోని ఈ కమిటీ రాజకీయ, సామాజిక రంగాల్లోని వివిధ వ్యక్తుల అభిప్రాయాలను సేకరించేందుకు సమగ్ర సంప్రదింపులు జరిపింది. నివేదిక ప్రకారం, 47 రాజకీయ పార్టీలు తమ అభిప్రాయాలను పంచుకున్నాయి. 32 పార్టీలు ఏకకాల ఎన్నికల భావనకు మద్దతు ఇచ్చాయి. అదనంగా, వార్తాపత్రికలలో ప్రచురించిన పబ్లిక్ నోటీసు పౌరుల నుండి 21,558 ప్రతిస్పందనలు వచ్చాయి. వీరిలో 80% మంది ప్రతిపాదనకు అనుకూలత వ్యక్తం చేశారు.నలుగురు మాజీ ప్రధాన న్యాయమూర్తులు, ప్రధాన హైకోర్టుల నుండి పన్నెండు మంది మాజీ ప్రధాన న్యాయమూర్తులు, నలుగురు మాజీ చీఫ్ ఎలక్షన్ కమిషనర్‌లతో సహా న్యాయ నిపుణులు కూడా తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. ఈ చర్చల్లో భారత ఎన్నికల సంఘం అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకున్నారు. కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ), ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ & ఇండస్ట్రీ (ఎఫ్ఐసీఐఐ), అసోసియేటెడ్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఆఫ్ ఇండియా వంటి అగ్రశ్రేణి వ్యాపార సంస్థలు, ప్రముఖ ఆర్థికవేత్తలతో కలిసి పరిశీలించడానికి సంప్రదించారు. అసమకాలిక ఎన్నికల ఆర్థిక ప్రభావాలు. అస్థిరమైన ఎన్నికలు ద్రవ్యోల్బణ ఒత్తిళ్లకు దారితీస్తాయని, ఆర్థిక వృద్ధి మందగించవచ్చని, ప్రజా వ్యయాలకు, సామాజిక సామరస్యానికి భంగం కలిగిస్తుందని ఈ సంస్థలు స్పష్టం చేశాయి.

దీంతో దేశవ్యాప్తంగా ఒకేసారి ఎన్నికల నిర్వహణకు సంబంధించి మాజీ రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ రూపొందించిన నివేదికను మంత్రివర్గం ఆమోదించింది.సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తులు, హైకోర్టు న్యాయమూర్తులతో సహా 32 పార్టీలు ప్రముఖ న్యాయమూర్తులు దీనిని సమర్థించారు. 18 రాజ్యాంగ సవరణలను ప్యానల్ సిఫార్సు చేసింది.

పాలోక్‌సభలో ఎన్డిఎకు ఉన్న బలం 61 శాతం. రాజ్యసభలో అయితే అది కేవలం 38 శాతమే. అదలా ఉంచితే కాంగ్రెస్ సహా ఇతర విపక్ష పార్టీలు, ప్రాంతీయ పార్టీలు జమిలి ఎన్నికలకు విముఖత చూపించే అవకాశం ఉంది. ఒకేసారి లోక్‌సభకు, శాసనసభకు ఎన్నిక జరిగితే ప్రజలు ఏదో ఒక పార్టీకి లేదా కూటమికే పట్టం కట్టే అవకాశాలు ఉంటాయన్నది ప్రాంతీయ పార్టీల భయం. వేర్వేరుగా జరిగితే ఒకే పార్టీని ఎన్నుకునే అవకాశం చాలా వరకూ తగ్గిపోతుందన్నది గతంలో ఓ సర్వేలో తేలిన వాస్తవం. ఎన్నికల ఖర్చు విషయంలోనూ జాతీయ పార్టీలతో ప్రాంతీయ పార్టీలు పోటీ పడవలసి రావచ్చు. దానివల్ల వాటిపై భారంపడే ప్రమాదం ఉంటుంది. ఇలాంటి కారణాల వల్ల ప్రాంతీయ పార్టీలు కలసి వచ్చే అవకాశం అంతంత మాత్రమే. ఈ నేపథ్యంలో బిజెపి చిరకాలవాంఛ ఎలా నెరవేరుతుందో వేచి చూడవలసిందే.

**దేశవ్యాప్తంగా చర్చ**

ప్రజాధనం ఆదా చేయడంతోపాటు, అభివృద్ధికి ఆటంకం కలగకూడదనే ఉద్దేశంతోనే జమిలీ ఎన్నికలను ప్రతిపాదిస్తున్నట్లు అధికార బీజేపీ చెబుతూ వస్తోంది. అయితే జమిలీ ఎన్నికలు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని కాంగ్రెస్ సహా ప్రధాన విపక్షాలన్నీ ఆరోపిస్తున్నాయి. తాజాగా రామ్ నాథ్ కోవింద్‌తో కూడిన కమిటీ సమర్పించిన నివేదికకు కేంద్ర కేబినెట్ ఆమోదముద్ర వేయడంతో జమిలీ ఎన్నికలపై దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. త్వరలో జరగనున్న పార్లమెంటు సమావేశాల్లో వన్ నేషన్ వన్ ఎలక్షన్ బిల్లును కూడా ప్రవేశపెట్టనున్నట్లు తెలుస్తోంది. దేశవ్యాప్తంగా ఏకకాలంలో ఎన్నికలు నిర్వహిస్తే లాభమా? నష్టమా? తెలుసుకుందాం..

2014 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ మేనిఫెస్టోలో వన్ నేషన్, వన్ ఎలక్షన్ అనే అంశాన్ని చేర్చింది. 2016లో నీతి ఆయోగ్ జమిలీ కాన్సెప్ట్ అమలు కోసం వర్క్‌షాప్‌ను నిర్వహించింది. 2 ఏళ్ల తర్వాత, 2018లో లా కమిషన్ ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించేందుకు ఐదు రాజ్యాంగ సిఫార్సులు అవసరమని సూచించింది. ఈ అంశంపై చర్చించేందుకు 2019లో ప్రధాని మోదీ అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశాన్ని కాంగ్రెస్, బహుజన్ సమాజ్‌వాదీ పార్టీ, సమాజ్ వాదీ పార్టీ, డీఎంకే వంటి విపక్షాలు బహిష్కరించాయి. ఈ సమావేశానికి ఆమ్ ఆద్మీ పార్టీ, టీడీపీ, బీఆర్ఎస్ హాజరయ్యాయి. 2022లో అప్పటి ప్రధాన ఎన్నికల కమిషనర్ సుశీల్ చంద్ర జమిలీకి సంబంధించి కీలక వ్యాఖ్యలు చేశారు. ఒకేసారి ఎన్నికలు నిర్వహించేందుకు ఈసీ సిద్ధంగా ఉన్నప్పటికీ అందుకోసం రాజ్యాంగంలో కొన్ని సవరణలు అవసరమని చెప్పారు.

**లాభాలు..**

కొన్ని నివేదికల ప్రకారం.. 2019 లోక్‌సభ ఎన్నికలకు మొత్తంగా రూ.60 వేల కోట్లు ఖర్చైంది. ఇందులో అభ్యర్థులు, రాజకీయ పార్టీలు, ఎన్నికల సంఘం ఖర్చులు ఉంటాయి. దేశంలో ఏకకాలంలో ఎన్నికలు జరిగితే ఎన్నికల ఖర్చును తగ్గించుకోవచ్చనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ఎన్నికల కోసం అధికారిక సిబ్బందిని నియమించడం రోజువారీ పరిపాలనా విధులు సాఫీగా సాగడంలో ఆటంకం కలుగుతోంది. ఎన్నికలు జరుగుతున్న సమయంలో అధికారుల సంఖ్య పెంచాల్సి ఉంటుంది.దీంతో ఇది సాధారణ పరిపాలనానూ ప్రభావితం చేస్తోంది. ఏకకాలంలో ఎన్నికలు నిర్వహిస్తే పాలనాపరమైన పనులపై ఎలాంటి ప్రభావం పడదని అధికార పక్షం భావిస్తోంది. రాష్ట్రాల్లో ఒక్కోసమయంలో ఎన్నికలు జరుగుతుండటంతో ప్రజాధనం వృథాతోపాటు, సంక్షేమ పథకాల అమలుపై ప్రభావం పడుతోందని చెబుతోంది. భారీ స్థాయిలో ఎన్నికలు నిర్వహించాల్సిన ప్రక్రియ ఉన్నందున అధికారులు సంక్షేమ పథకాలను చేరవేయడంపై దృష్టి పెట్టకపోవచ్చని అంటోంది. మరోవైపు ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించడం వల్ల ఓటింగ్ శాతం పెరుగుతుందని ఇంకొందరు నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

**ప్రతికూలతలు..**

రాష్ట్రాల్లో దశాబ్దాలకొలది వేళ్లూనుకున్న ప్రాంతీయ పార్టీలు జమిలి ఎన్నికలను వ్యతిరేకిస్తున్నాయి. అందుకు కారణమూ లేకపోలేదు. ఏకకాలంలో ఎన్నికలు జరిగితే ప్రాంతీయ పార్టీల మనుగడ ప్రశ్నార్థకం అవుతుందని ఆయా పార్టీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించే ప్రక్రియతో స్థానిక సంస్థల సమస్యలు పరిష్కారం కాకుండా పోయే ప్రమాదం ఉందని మరికొందరు అంటున్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఓటర్లు ఒకే పార్టీకి పట్టం కట్టే అవకాశమూ లేకపోలేదని.. తద్వారా స్థానిక పార్టీలు లేదా ప్రాంతీయ పార్టీల ఉనికే ప్రమాదంలో పడే అవకాశం ఉందని చెబుతున్నారు.ఒకే దేశం ఒకే ఎన్నిక అమల్లోకి వస్తే ప్రచారంలో జాతీయ విషయాలే ప్రాధాన్యతాంశాలుగా మారతాయి. స్థానిక అంశాలు, సమస్యలు కనిపించకుండా పోతాయని ప్రాంతీయ పార్టీలు ఆందోళన చెందుతున్నాయి. ఎన్నికల ఖర్చుల్లోనూప్రాంతీయ పార్టీలు పోటీపడాల్సి వస్తుంది. 2015లో నిర్వహించిన ఓ సర్వే ప్రకారం.. దేశంలో జమిలి ఎన్నికలు నిర్వహిస్తే 77 శాతం మంది ప్రజలు ఒకే పార్టీ లేదా కూటమికి ఓటు వేస్తామని చెప్పారు. పార్లమెంట్, అసెంబ్లీకి వేర్వేరుగా ఎన్నికలు నిర్వహిస్తే ఒకే పార్టీని ఎన్నుకొనే అవకాశాలు 61శాతానికి తగ్గినట్లు తేలింది. మూడో దఫా అధికారంలోకి వచ్చి వంద రోజుల పాలన పూర్తి చేసుకున్న నరేంద్ర మోడీ నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వం ఈ దఫా ‘ఒకే దేశం ఒకే ఎన్నిక’ విధానం అమలుకు కంకణం కట్టుకున్నట్లుగానే కనిపిస్తోంది. పదేళ్ల క్రితం భారతీయ జనతా పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ అవకాశం వచ్చినప్పుడల్లా జమిలి ఎన్నికల ప్రస్తావన తెస్తూనే ఉంది. అయితే గత రెండు దఫాలుగా సంపూర్ణ మెజారిటీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన కమలనాథులు ఈసారి సంకీర్ణ భాగస్వాముల మద్దతుపై ఆధారపడి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయవలసి వచ్చినా, జమిలిపై దూకుడుగానే ఉండటం గమనార్హం.



- డాక్టర్ కాచం సత్యనారాయణ
వీ3 న్యూస్, విశ్వంభర తెలుగు దిన పత్రిక
చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్

## పార్లమెంటు ఉభయ సభల్లో ఆమోదం లభించేనా..?

దేశవ్యాప్తంగా ప్రతి ఏటా ఎక్కడో ఒక చోట ఎన్నికలు జరుగుతూనే ఉన్నాయి. వీటి ప్రభావం దేశ పురోగతిపై పడుతోంది. దీని నుంచి బయటపడాలంటే ఒకే దేశం ఒకే ఎన్నిక విధానమే శరణ్యమన్న ప్రధాని అభిప్రాయం వాస్తవమే అయినా, అమలులో ఎంతవరకూ సాధ్యమవుతుందన్నదే వెయ్యి డాలర్ల ప్రశ్న. పదే పదే ఎన్నికలు నిర్వహించడం వల్ల నిర్వహణ వ్యయం తడిసి మోపెడవుతోంది. ఉదాహరణకు 2009 లోక్‌సభ ఎన్నికలకు 1115 కోట్లు, 2014లో 3870 కోట్లు ఖర్చు కాగా 2019లో ఈ ఖర్చు పది వేల కోట్ల రూపాయలకు పెరిగినట్లు అంచనా. ఇక శాసనసభ ఎన్నికల నిర్వహణను కూడా పరిగణనలోకి తీసుకుంటే ఒక్కొక్క రాష్ట్రానికి రూ. 250 కోట్లు ఖర్చవుతుందనుకుంటే, మొత్తం 28 రాష్ట్రాలకు ఎంత అవుతుందో లెక్క కడితే గుండెలు బేజారవకమానదు.కేవలం ఖర్చు మాత్రమే కాదు, దేశవ్యాప్తంగా ఏడాది పొడుగునా ఎక్కడో ఒక చోట ఎన్నికలు జరుగుతూనే ఉండటం వల్ల ఎన్నికల కోడ్ కారణంగా అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల అమలుకు విఘాతం కలుగుతోందన్న వాదనను కూడా తోసిపుచ్చలేం. జమిలి ఎన్నికల వల్ల ఓటర్లకు కూడా సౌకర్యవంతంగా ఉంటుంది. దీనివల్ల పోలింగ్ శాతం పెరిగే అవకాశం ఉంటుంది. ఒకప్పుడు మన దేశంలో జమిలి ఎన్నికలు జరిగిన మాట వాస్తవం. 1951లో తొలిసారి సాధారణ ఎన్నికలు ఈ తరహాలోనే జరిగాయి. ఆ తరువాత 1967 వరకూ మూడు దఫాలు ఇదే తరహాలో ఎన్నికలు జరిగినా, 1970లో కాలపరిమితి ముగియకుండానే లోక్‌సభ రద్దు కావడంతో జమిలి ఎన్నికలకు బ్రేక్ పడింది.అప్పటినుంచీ అడపాదడపా ఒకేసారి ఎన్నికల నిర్వహణ అంశం తెరపైకి వస్తున్నా, మోదీ నేతృత్వంలో ఎన్‌డిఎ కూటమి కేంద్రంలో అధికారంలోకి వచ్చాక, దీనిపై కసరత్తు మొదలైంది.మూడో దఫా అధికారంలోకి వచ్చి వంద రోజుల పాలన పూర్తి చేసుకున్న నరేంద్ర మోడీ నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వం ఈ దఫా ‘ఒకే దేశం ఒకే ఎన్నిక’ విధానం అమలుకు కంకణం కట్టుకున్నట్లుగానే కనిపిస్తోంది. పదేళ్ల క్రితం భారతీయ జనతా పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ అవకాశం వచ్చినప్పుడల్లా జమిలి ఎన్నికల ప్రస్తావన తెస్తూనే ఉంది. గత నెలలో స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా ఎర్రకోటపై నుంచి ప్రధాని ప్రసంగిస్తూ జమిలి ఎన్నికల ఆవశ్యకత గురించి చెప్పారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలో నియమించిన కమిటీ కూడా జమిలి ఎన్నికలకు జై కొట్టింది. లోక్‌సభ, శాసనసభ ఎన్నికలను కలిపి నిర్వహించిన వంద రోజుల తర్వాత స్థానిక ఎన్నికలు జరపాలని సిఫార్సు చేసింది. ఎన్నికల సంఘం, లా కమిషన్ ఇప్పటికే ఒకేసారి ఎన్నికల నిర్వహణకు సంసిద్ధత వ్యక్తం చేశాయి. అయితే జమిలి ఎన్నికల నిర్వహణ అంత తేలిగ్గా అమలులోకి వచ్చే సూచనలు కనిపించడం లేదు. లోక్‌సభ, శాసనసభ ఎన్నికలు ఒకేసారి జరిపేందుకు రాజ్యాంగ సవరణలు అవసరం. ఇందుకు రాష్ట్రప్రభుత్వాల అనుమతి ఆవశ్యకం. జమిలి బిల్లు పాస్ కావాలంటే పార్లమెంటు ఉభయ సభల్లో చెరో 67 శాతం మంది సభ్యులు ఆమోద ముద్ర వేయాలి. అలాగే సగం రాష్ట్ర ప్రభుత్వాలు సైతం సై అనవలసి ఉంటుంది.





# పారిశుద్ధ్య కార్యక్రమాలు నిరంతరంగా జరగాలి: కలెక్టర్

**విశ్వంభర, భూపాలపల్లి:** గ్రామాల అభివృద్ధిలో గ్రామ పంచాయతి ప్రత్యేక అధికారుల విధులు, బాధ్యతలు చాలా ముఖ్యమైనవని భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. బుధవారం కాటారం మండల పరిషత్ కార్యాలయంలో కాటారం డివిజన్ గ్రామ పంచాయతి ప్రత్యేక అధికారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిరంతరాయంగా జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వర్షాకాలం ముగిసినందున పారిశుధ్య కార్యక్రమాలు చాలా ముఖ్యమని మండల ప్రత్యేక అధికారులు గ్రామాల్లో వారంలో రెండు రోజులు తనిఖీలు చేస్తూ పర్యవేక్షణ చేయాలని తెలిపారు. గ్రామ పంచాయతీ సిబ్బంది విధులను పర్యవేక్షణ చేయటం చాలా ముఖ్యమని తెలిపారు. ప్రత్యేక అధికారులు పర్యటనలో గుర్తించిన అంశాలను పరిశీలించడానికి చర్యలు చేపట్టాలని తెలిపారు. పాఠశాలలు, సబ్ సెంటర్స్, రెసిడెన్సియల్ హాస్టల్స్, గ్రామపంచాయతీ భవనాలు, ప్లాంటేషన్ కంపోస్ట్ షెడ్డు, వైకుంఠధామాలు తనిఖీ చేయాలని, తనిఖీ ఫోటోలను గ్రూపులో పోస్ట్ చేయాలని తెలిపారు. మన గ్రామపంచాయతీ క్లీన్ అండ్ గ్రీన్ గా ఉండాలని అదే మన గోల్ అని తెలిపారు. వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున పారిశుధ్య కార్యక్రమాలను ముమ్మరంగా చేపట్టాలని ఆయన పేర్కొన్నారు. రహదారులు వెంబటి వ్యర్థాలు తొలగించాలని అక్కడ మొక్కలు నాటి పచ్చదనం పెంపొందించే చర్యలు చేపట్టాలని తెలిపారు. ఆరుబయట వ్యర్థాలు కాల్చితే చర్యలు తీసుకోవాలని, కాల్చడం వల్ల శ్వాసకోశ వ్యాధులు వస్తాయని తద్వారా పర్యావరణం దెబ్బతింటుందని తెలిపారు. వ్యర్థాలు కాల్చితే నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ప్రకారం 25 వేల వరకు జరిమానా విధించడానికి అవకాశం




ఉందని తెలిపారు. పంచాయతీరాజ్ చట్టం ప్రకారం చర్యలు తీసు కోవాలని ఆదేశించారు. మీ అధికారాలను, విధులను వినియోగించుకోవాలని ఆయన తెలిపారు. భగీరథ నీటి సరఫరా పర్యవేక్షణ చేయాలన్నారు. మంచినీటి సమస్య ఏర్పడితే తన దృష్టి తీసుకురావాలని సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామని ఆయన పేర్కొన్నారు. వేసవిలో చేపట్టిన చర్యల వల్ల గ్రామాల్లో సమ స్యలు రాకుండా చేశామని, భవిష్యత్తులో ఏదైనా సమస్య వస్తే తక్షణం పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రతి వారంలో రెండు లేదా మూడుసార్లు తప్పనిసరిగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని ఆయన ఆదేశించారు. శిక్షణ కార్యక్రమంలో విదులు అధికారాలపై సమగ్రమైన, స్పష్టమైన అవగాహన పెంపొందించుకోవాలని ఆయన పేర్కొన్నారు. గ్రామాల్లో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని ఆయన పేర్కొన్నారు. వ్యాపార, మాంసాహార వ్యాపారులతో సమావేశాలు నిర్వహించి ప్లాస్టిక్ వినియోగం తగ్గించే విధంగా అవగాహన కల్పించాలని అన్నారు. అమ్మపేరున మొక్కలు నాటేలా చర్యలు చేపట్టాలన్నారు. వనరుల ద్వారా ఆదాయం సమకూరే లా ప్రణాళికలు తయారు చేయాలని తెలిపారు. అనంతరం గ్రామ పంచాయతి కార్మికులను శాలువాతో సత్కరించి సేవలను అభినందించారు. అనంతరం స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంపై ప్రతిజ్ఞ చేపించారు. ఈ సమావేశంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కలెక్టర్ విజయలక్ష్మి, డిపిఓ నారాయణరావు, మండల ప్రత్యేక అధికారి సంజీవరావు, గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాలు

**విశ్వంభర, భద్రాద్రి కొత్తగూడెం:**




భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం జమీందారు బంజర గ్రామం లో తెలంగాణ 76 సాయధ రైతాంగ పోరాట వారోత్సవాలు ముగింపు సభ నిర్వహించారు. ఈసందర్భంగా పోరాట యోధులు సోయం గంగులు స్థూప ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్.కె సబీర్ భాష , జిల్లా నాయకులు దమ్మపేట సిపిఐ మండల నాయకులు ఏఐటిసి మండల నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

# వేలంలో లడ్డూను దక్కించుకున్నమహేందర్

**విశ్వంభర, మహేశ్వరం:**



కందుకూరు మండలం ముచ్చెర్ల లో గణేష్ ఉత్సవ కమిటీ ఏర్పాటు చేసిన వినాయకుని ఉత్సవాల చివరిరోజు లడ్డూ వేలం పాట జరిగింది. గణనాథుని లడ్డూను వేలం పాటలో రూ.1,46,000కు దక్కించుకున్నారు. ఉత్సవ కమిటీ ఛైర్మన్ సిద్ధాల రమణ లడ్డూను మహేంధర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లడ్డూను వేలంపాటలో పొందడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు చేగురి బీరప్ప, మోగిళ్ళ కిషన్,తల్లోజి నందీశ్వర్, ఇంజమూరి రామ చంద్రారెడ్డి, బక్క మల్లేష్ సిద్దాల శ్రీనివాస్, చేగురి మల్లేష్, బండ నరసింహ,బండ వెంకటేష్ కుమ్మరి వెంకటేష్, మేదరి ఆంజనేయులు, శ్రీశైలం, కుమార్, శ్రీకాంత్, యూత్ సభ్యులు , గ్రామ భక్తజన బృందం పాల్గొన్నారు.

# గురుకులాల పతనానికి సీఎం రేవంత్ రెడ్డే బాధ్యుడు : మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్



**విశ్వంభర, నల్లగొండ :** గురుకులాల నిర్వహణలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని నల్లగొండ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్ ఆరోపించారు. దేవరకొండ మైనార్టీ గురుకుల పాఠశాలలో మంగళవారం ముగ్గురు విద్యార్థులు తప్పిపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. గురుకుల పాఠశాలను సందర్శించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల గురుకుల పాఠశాలలు అధ్వానంగా మారుతున్నాయి. కలుషిత ఆహారం తిని విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని మండి పడ్డారు. గురుకులాల అధ్వాన పరిస్థితికి, విద్యార్థుల మరణాలకు విద్యాశాఖ మంత్రిగా ఉన్న సీఎం రేవంత్ రెడ్డినే బాధ్యుడన్నారు. మీ పాలన ఎట్లుందో చెప్పడానికి సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్న గురు కులాలే నిదర్శనం అన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో వెలుగొందిన గురుకులాలు మీ అసమర్థత కారణంగా మసకబారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిపక్షాల మీద నోరు పారేసుకోవడం మానేసి ఇప్పటికైనా పాలన మీద దృష్టి పెట్టాలని హితవు పలికారు. మొద్దు నిద్రను వీడి గురుకులాల్లో విద్య, భోజనం, వసతులు కల్పించేందుకు తక్షణం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ముగ్గురు విద్యార్థులను సురక్షితంగా తీసుకొచ్చి తల్లితండ్రులకు అప్పగించాలన్నారు.

# కాంగ్రెస్ హయాంలో పేదలకు అన్యాయం జరగదు

**విశ్వంభర, మహేశ్వరం:**



నిరుపేదలకు నాడు ఇందిరమ్మ హయాంలో ఇచ్చిన ఇళ్ల స్థలాలకు తప్పకుండా కాంగ్రెస్ ప్రభుత్వంలో న్యాయం చేస్తామని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి, మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి హామీ ఇచ్చారు. మీర్పేట్ కార్పొరేషన్ జిల్లెలగూడ స్థానికులు కేఎల్ఆర్ తో తుక్కుగూడ కార్యాలయంలో భేటీ అయ్యారు. జిల్లెలగూడ గ్రామపంచాయతీగా ఉన్నప్పుడు 1986లో ఇంటి జాగలు ఇచ్చారని నాటి భూమి కోర్టు పరిధిలో ఉండటం వల్ల పోజిషన్ ఇవ్వ లేదని కేఎల్ఆర్‌దృష్టికి తెచ్చారు. సమస్యపై స్పందించిన కే. లక్ష్మారెడ్డి తప్పకుండా కోర్టు కేసు పూర్వాపరాలు పరిశీలించి న్యాయ నిపు ణులతో చర్చించి పేదలను ఆదుకుంటామన్నారు. అవసరమైతే కోర్టు కేసులకు అయ్యే ఖర్చును భరిస్తానని కేఎల్ఆర్ చెప్పారు. ప్రస్తుత ఇందిరమ్మ రాజ్యంలో ఎవరికీ అన్యాయం జరగదని భరోసా ఇచ్చారు. ఈకార్యక్రమంలో మీర్పేట్ ప్రజాప్రతినిధులు భాస్కర్‌రెడ్డి, రామచంద్ర, మదన్ పాల్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# ప్రతి ఇంటికి తిరుగుతూ ఓటరు జాబితాను సరిచేయాలి

## రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి

**విశ్వంభర, మహబూబాబాద్:**

కలెక్టరేట్ మీనీ సమావేశ మందిరంలో రెవెన్యూ డివిజన్ అధికారులు, తహశీల్దార్స్, ఎన్నికల విభాగం సిబ్బందితో జిల్లాలో జరుగుతున్న ఎలక్ట్రోల్ నమోదు, ఇంటింటి సర్వే, పోలింగ్ స్టేషన్ నిర్వహణ ఏర్పాటు, స్వీప్ ఆక్టివిటీస్, ఓటరు జాబితా మార్పులు, చేర్పులు, పరిశీలన తదితర అంశాలపై బుధవారం జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్తో కలిసి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇంటింటి సర్వే నిర్వహించి ఓటరు జాబితా ప్రకారం స్థానికంగా క్షేత్రస్థాయిలో ప్రతి ఇంటికి తిరుగుతూ జాబితానుసరిచేయాలని, మరణించిన వారి పేర్లు తొలగించి, అడ్రస్ చేంజ్, ఆన్లైన్లో వచ్చిన ఫామ్స్ ని విచారణ చేసి ఐటి టూల్స్ ద్వారా సరి చేయాలని,15 వందలు ఓటర్లు దాటిన పోలింగ్ కేంద్రాలు గుర్తించి మరొక పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలన్నారు.ఓటరు జాబితాలోమార్పులు, చేర్పులు బిఎల్ఓ లు యాప్ ను వినియోగించి పూర్తి ఆన్లైన్ లో మాత్రమే సరిచేయాలన్నారు.జాబితాలో ఫోటో,అడ్రస్, సరిగా ఉందా లేదా, క్రాస్ చెక్ చేసుకోవాలని, ఒకే కుటుంబానికి సంబంధించిన ఓటర్లు ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసి వసతులు, త్రాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్, కాంపౌండ్ వాల్, తదితర వసతులు సరిగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.జిల్లాలో ప్రతి ఓటర్లులో చైతన్యం కల్పించడానికి స్వీప్ ఆక్టివిటీస్ ద్వారా విద్యాసంస్థలు, సామాజిక మాధ్యమాలు, బస్టాండులు తదితర రద్దీ ప్రదేశాలలో విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. బూతు లెవెల్ ఆఫీసర్స్, సూపర్వైజర్స్, ఎన్నికల విభాగం కు సంబంధించిన రిజిస్టర్లు మెయింటైన్ చేస్తూ షెడ్యూల్ ప్రకారం ఎన్నికల కమిషన్ సూచించిన విధంగా కార్యకలాపాలు నిర్వ హించాలని, అన్ని రాజకీయ పార్టీలు ప్రతినిధులతో సమావేశాలు ఏర్పాటు చేయాలన్నారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ (ఈవిఎం) గోడౌన్ తనిఖీ చేసి, సీసీ కెమెరాలు, పరిసరాలను, పరిశీలించారు. అనంతరం పట్టణంలోని లెనిన్ నగర్, ఎన్జీవోస్ కాలనీ,ఇందిరా నగర్ కాలనీ, కంకర బోర్డ్, రామచంద్రపురం, గుమ్ముడూర్ ,కాలనీలలో జరుగుతున్న ఇంటింటి ఓటరు జాబితా పరిశీలన కార్యక్రమాన్ని స్వయంగా పరిశీలించారు. సర్వే చేస్తున్న బిఎల్ఓస్ స్నేహ, సాబీరా, రోజాలను వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి, ఓటరు జాబితా, స్వీప్ ఆక్టివిటీస్, పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు, తదితర అంశాలపై జిల్లాలో తీసుకుంటున్న చర్యల గురించి వివరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్, మహబూబాబాద్, తొర్రూర్ ఆర్డీఓలు ఎల్.అలివేలు, జి .నరసింహారావు, కలెక్టరేట్ ఏ.ఓ పవన్ కుమార్, మహబూబాబాద్ తాసిల్దార్ భగవాన్ రెడ్డి, జిల్లాలోని అన్ని మండలాల తహసిల్దార్, ఎన్నికల విభాగం సిబ్బంది పాల్గొన్నారు.



# గ్రామాల స్వచ్చతలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి



**విశ్వంభర, భూపాలపల్లి :** గ్రామాల స్వచ్ఛతలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పిలుపునిచ్చారు. బుధవారం కాటారం మండలం గిరిజన రెసిడెన్షియల్ పాఠశాలలో గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛత ఈ సేవా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి మొక్కలు నాటి పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరు బాధ్యత ఆయన పేర్కొన్నారు. గ్రామాలు స్వచ్ఛత సాధించుటకు వచ్చే నెల 2వ తేదీ వరకు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు జరుగనున్నాయని ఇట్టి కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రతి రోజు ఒక కార్యక్రమం ఉంటుందని, అట్టి కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించాలని పేర్కొన్నారు. అంతకుముందు కాటారం సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని పరిశీలించారు. సబ్ కలెక్టర్ ఛాంబర్, రికార్డు రూము, సిబ్బంది గదులను పరిశీలించారు. కార్యాలయం నిర్వహణ పరిసరాలు బాగున్నాయని అభినందించారు. ఈ కార్యక్రమాల్లో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డిపిఓ నారాయణరావు, మండల ప్రత్యేక అధికారి సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.



డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పరిశీలన కోసం షాద్ నగర్ నియోజకవర్గం కొత్తూరు విచ్చేసిన కలెక్టర్ శశాంక్‌కు స్వాగతం పలికిన స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, కొత్తూరు నందిగామ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు..**విశ్వంభర, షాద్ నగర్**

# కళ్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ

**విశ్వంభర, మెట్‌పల్లి:**



మెట్‌పల్లి పట్టణానికి చెందిన 46 మంది లబ్ధిదారులకు రూ. 46,05,336/- విలువగల కళ్యాణ లక్ష్మి చెక్కులను కోరుట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బోయినపల్లి చంద్రశేఖర రావు. కౌన్సిలర్లు బి ఆర్ ఎస్ నాయకులు.తదితరులు పాల్గొన్నారు.



చేవెళ్ల మాజీ ఎంపీ గడ్డం రంజిత్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి మాజీ ఎమ్మెల్యే కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి, దేప భాస్కర్ రెడ్డి.. మహేశ్వరం, విశ్వంభర

# విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవు

**నిరుపేదల ఆరోగ్యానికి అండగా కాంగ్రెస్ ప్రభుత్వం**

**ఎంజీఎం ఆస్పత్రిలో ఫార్మసీ విభాగాన్ని**

**ఆకస్మిక తనిఖీ చేసిన ఎంపీ డా. కడియం కావ్య**

**నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఫార్మసీ సిబ్బందిపై ఎంపీ ఆగ్రహం**



విశ్వంభర, వరంగల్: వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో ఫార్మసీ విభాగాన్ని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ఆకస్మిక తనిఖీ చేశారు. మంగళవారం పలు అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కొండ సురేఖ లతో కలిసి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ఎంజీఎం ఆసుపత్రికి చేరుకున్నారు. అక్కడ ఓ రోగి బంధువు తనకు మందులు ఇవ్వడం లేదన్న విషయాన్ని మంత్రులు, ఎంపీ దృష్టికి తీసుకు వచ్చారు. తక్షణమే స్పందించిన వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కావ్య రోగిని తీసుకుని నేరుగా ఎంజీఎం ఆస్పత్రిలోని ఫార్మసీ కేంద్రానికి చెరుకుని పేషెంట్లకు ఇస్తున్న మందులను పరిశీలించారు. మందుల స్టాక్ వివరాలను రిజిస్టర్ ను పరిశీలించారు. ఎన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయో ఎంపీ స్వయంగా పరిశీలించారు. అందుబాటులో ఉన్న మందుల వివరాలను సేకరించారు. స్వతహాగా డాక్టర్ అవ్వడం వలన క్షుణంగా మెడిసిన్స్ గురించి, సీడిఎస్ నుండి రావలసిన మందుల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. దాదాపు మూడు నెలలుగా మెడిసిన్స్ అందుబాటులో లేకపోయినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఫార్మసీ సిబ్బందిపై ఎంపీ కావ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరుపేదలకు పెద్దదిక్కుగా ఉన్న ఎంజీఎం ఆసుపత్రిలో కనీసం పెయిన్ కిల్లర్స్ కూడా అందుబాటులో లేకపోవడం ఏంటని ప్రశ్నించారు. మందులు అందుబాటులో లేవు అంటూ బయటకు రాయడం సరికాదని, మరోసారి ఇలాంటి తప్పులు పునరావృతం అయితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆసుపత్రి సిబ్బంది నిర్లక్ష్యం విషయాన్ని ఎంపీ కావ్య మంత్రి పోగులేటి శ్రీనివాస్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. ఎంపీ డా.కడియం కావ్య అందించిన వివరాలతో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వైద్య అధికారులను మరోసారి ఇలాంటి తప్పులు జరగకుండా చూడాలని అన్నారు. ముఖ్యంగా పేద ప్రజలకు అందాల్సిన విద్యా, వైద్యంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

# పోషకాహారం ప్రాముఖ్యతపై తల్లులకు అవగాహన కార్యక్రమం



**విశ్వంభర, రామన్నపేట:**

రామన్నపేట మండల కేంద్రంలోని అంగన్ వాడీ కేంద్రం-5 లో పోషకాహారం ప్రాముఖ్యత పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 6 నెలలు నిండిన పిల్లలకు అన్నప్రాసన నిర్వహించారు. పిల్లల బరువు విషయంలో తల్లులకు అవగాహన కల్పించారు. ఈకార్యక్రమనికి ఏడీసీపీఓ సమీరా ఐసీడీఎస్ సూపర్ వైజర్లు, హేమలత, బాలమణీ, ఎంఎల్‌హెచ్పీ అనిత, ఏఎన్ఎం మంజుల, ఆశా వర్కర్ శోభ, అంగన్ వాడీ టిచరు పుష్ప, తల్లులు పాల్గొన్నారు.

# మహిళలు స్వశక్తితో ఎదగాలి

**విశ్వంభర, భూపాలపల్లి :**

మహిళలు స్వశక్తితో ఎదగాలని భూపాలపల్లి



ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. భూపాలపల్లి నియోజకవర్గం శాయంపేట మండలం కొత్తగట్టుసింగారం గ్రామంలో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్, భవన నిర్మాణ కార్మిక సంక్షేమ మండలి వారి సౌజన్యంతో కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న గ్రామంలోని మహిళలకు సర్టిఫికెట్స్ , కుట్టు మిషన్ల కుట్టు మిషన్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మహిళల సంక్షేమం కొరకు ప్రజాప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు.

# ఓటరు జాబితాలో అభ్యంతరాలు తెలపాలి

**విశ్వంభర, భూపాలపల్లి:** గ్రామపంచాయతీ ఓటరు జాబితాలో అభ్యంతరాలుంటే తెలియచేయాలని భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు.బుధవారం ఐడిఓసి కార్యాలయ సమావేశపు హాలులో గ్రామ పంచాయతీ ఓటరు జాబితాలో అభ్యంతరాలు, పోలింగ్ కేంద్రాలలో మౌలిక సదుపాయాలు కల్పన, నూతన పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు తదితర అంశాలపై గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 13వ తేదీన గ్రామ పంచాయతీ ఓటర్ల జాబితా విడుదల చేసినట్లు తెలిపారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు శాసనసభ ఎన్నికల ఓటరు జాబితాను ప్రామాణికంగా తీసుకుని గ్రామపంచాయతీ ఓటరు జాబితా ప్రకటించినట్లు తెలిపారు. జిల్లాలో 240 గ్రామపంచాయతీలున్నాయని వాటి పరిధిలో 2044 వార్డులు ఉన్నట్లు తెలిపారు. 240 గ్రామ. పంచాయతిల పరిధిలో పురుషులు142217 మంది, మహిళలు 148432 మంది, ఇతరులు 14 మంది మొత్తం 290663 మంది గ్రామ పంచాయతీ ఓటరులున్నట్లు తెలిపారు. ఎన్నికల సంగం షెడ్యూల్ ప్రకారం జిల్లా స్థాయిలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించామని, 19.09.2024న మండల స్థాయిలో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశాలు ఏర్పాటు చేయాలని సూచించారు. అన్ని పార్టీల ప్రతినిధులు మండల, గ్రామస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించి తమ ఓటు ఉన్నదో లేదో పరిశీలన చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలు తమ ఓటు లేదని, ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి మారిందని, ఒక వార్డు నుంచి మరొక వార్డుకు మారిందని, ఓటరు జాబితాలో తప్పులు న్నాయని ఆందోళన పడకుండా ముందుగానే తమ ఓటును పరిశీలించుకుని అభ్యంతరాలుంటే తెలియచేయాలని ఆయన తెలిపారు. ఈ నెల 14 నుంచి 21 వరకు ఓటరు జాబితాలపై అభ్యంతరాలు స్వీకరిస్తామని అన్నారు. సెప్టెంబర్ 28వ తేదీన ఓటర్ల తుది జాబితా విడుదల చేస్తామని, తరువాత ఎలాంటి మార్పులు చేర్పులకు అవకాశం ఉండదని పేర్కొన్నారు. ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులకు మంథని నియోజకవర్గ రిటర్నింగ్ అధికారికి, భూపాలపల్లి నియోజకవర్గ పరిధిలో నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఆర్డిఓకు దరఖాస్తు చేయాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డిపిఓ నారాయణరావు, వివిధ పార్టీల రాజకీయ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## ఉత్సాహంగా జరిగిన లడ్డూల వేలం పాట



**విశ్వంభర, సంగారెడ్డి:** సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు మండలం రుద్రారం గ్రామం గణేష్ గడ్డ స్వయంభుగా వెలసిన శ్రీ సిద్ధి వినాయక ఆలయంలో గణేష్ నవరాత్రులు ఘనంగా ముగిశాయి. ఉత్సవాల భాగంగా చివరిరోజైనా మంగళవారం వినాయకుడి మూడు లడ్డులను వేలం పాట ఉత్సాహంగా నిర్వహించారు. వేలంపాటలో మూడు లడ్డులకు గాను రూ.3 లక్షల 35వేలకు భక్తులు దక్కించుకున్నారు. మొదటి లడ్డు గడ్డమీది నవీన్ రూ.1 లక్ష 75 వేలు, రెండవ లడ్డు రాయచూరు శ్రీవాణి వేణుగోపాల్, ఓడిఎఫ్ వెంకటేశం, రూ.1 లక్ష 10వేలు, మూడవ లడ్డు గడ్డమీది కుమార్ రూ.50 వేలకు వేలం పాటలో దక్కించుకున్నారు. వేలంపాటలో వినాయకుడి లడ్డులను దక్కించుకున్న ముగ్గురు భక్తులకు ఆలయ సిబ్బంది సన్మానించి లడ్డూలను అందజేశారు. స్వామివారి లడ్డూను దక్కించుకోవడం ఎంతో సంతోషంగా ఉందని భక్తులు తెలిపారు. మాజీ సర్పంచ్ సుధీర్ రెడ్డి, ఆలయ ఇంచార్జి ఈవో శశిధర్, జూనియర్ అసిస్టెంట్లు ఈశ్వర్, సోమేశ్వర్, సిబ్బంది, అర్చకులు, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన గణేశ్ నవరాత్రి వేడుకలు



**విశ్వంభర, సికింద్రాబాద్:** సికింద్రాబాద్ పార్సిగుట్టలో సంజీవపురం వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణేష్ మండప నిర్వాహకు లు మాట్లాడుతూ మా అసోసియేషన్ మెంబర్స్ బస్తీవాసులు వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ అన్నదాన కార్యక్రమం నిర్వహించా రు. లడ్డూ వేలం పాటలో ఒక్క లక్ష 35వేలు పలికిన లడ్డు సొంతం చేసుకున్న సివిల్ కాంట్రాక్టర్ పద్మారావుని సన్మానించారు. ఈ కార్యక్రమంలో జగదీష్, సూర్య ప్రకాష్, నారా నర్సింగ్, బస్తీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## క్రీడాశిక్షణ తీరును పరిశీలించిన బృందం





**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రంలో ఏర్పాటు చేయనున్న స్పోర్ట్స్ యూనివర్సిటీ, భవిష్యత్తులో ప్రతిలోకసభ నియోజకవర్గానికి ఏర్పాటు చేయనున్న క్రీడా పాఠశాలల ఏర్పాటు నిమిత్తం వివిధ అంశాలను పర్యవేక్షిం చడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్ర అధికార బృందం ఒడిశా భువనేశ్వర్‌లోని కళింగ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను సందర్శి ంచింది. స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో వివిధ క్రీడ అంశాల్లో ఇస్తున్న క్రీడా శిక్షణతీ రును ఈ బృందం పరిశీలి ంచింది. ఈ ప్రాంగణంలోనిక్రీడా సదుపా యాల్ని, శిక్షణలో అమలుపరుస్తున్న నూతన పద్ధ తుల్ని క్రీడాకారుల ఎంపిక ప్రక్రియను, క్రీడాకారులకు కల్పిస్తున్న వివిధ వసతుల్ని ఈ పరిశీలిం చారు .తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ కే శివసేనారెడ్డి, అధ్యక్షతన పర్యటించిన ఈ బృందంలో వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీమతి ఏ సోనీ బాలాదేవి రతన్ కుమార్ బోస్, రవి కుమార్ లు ఉన్నారు. తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ నిర్వహించే అన్ని క్రీడా శిక్షణ సంస్థల పనితీరు మెరుగు పరచడానికి ప్రణాళిక రూపొం దిస్తామని స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ కే శివసేన రెడ్డి తెలిపారు.

## మాధవశేషు స్వామికి కానుకగా రూ.లక్ష



**విశ్వంభర, సంతోష్‌నగర్:** ఈస్ట్ మారుతీనగర్‌లో నెలకొల్పిన వినాయక నవరాత్రులు పూజలు చేయించిన మంగళగిరి మాధవ శేషు స్వామికి మండప నిర్వాహకులు దీపిక నరసింహా రెడ్డి లక్ష రూపాయలు నగదును కానుకగా సమర్పించారు. 2000 సంవత్సరంలో రూ. 1116/- సంభా వనతో మొదలైన అర్చకుడికి 25 సంవత్సరాల వార్షి కోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు అనంత పద్మ నాభ స్వామి కళ్యాణం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేశారు. అందుకుగానూ లక్ష రూపాయల నగదు సమర్పించారు. దీపికా నరసింహా రెడ్డి మాట్లాడుతూ మా శేషు స్వామి నిష్ఠతో, శ్రద్ధతో పూజలు జరిపిస్తారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో దీపికా నరసింహా రెడ్డి తో పాటు, శ్రీ రామ శర్మ, హరీష్ రెడ్డి, సతీష్ రెడ్డి, ఇరీష్ రెడ్డి, సుదీర్, డాక్టర్ మనీష్ రెడ్డి, శేఖర్ రెడ్డి, సాయిరాం, కాలనీవాసులు పాల్గొన్నారు.

## ఓటరు జాబితా అభ్యంతరాలపై సమావేశం



**విశ్వంభర, చింతపల్లి:** రాబోయే సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ముసాయిదా ఓటర్ల జాబితా పై అభ్యంతరాలు, సలహాలు ఏమైనా ఉంటే తెలియజేయాలని రాజకీయ పార్టీ ప్రతినిధు లకు చింతపల్లి ఎంపీడీఓ సుజాత బుధవారం ఒక ప్రకటనను విడుదల చేసారు. రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ ప్రకారము ఈ నెల 13న గ్రామపంచాయతీల వారీగా ప్రదర్శింపబడిన గ్రామపంచాయతీ, వార్డుల వారి ఓటర్ల జాబితా పై అభ్యంతరములు తెలియపరచుటకు మండల స్థాయి రాజకీయ పార్టీల ప్రతినిధులచే మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం సమావేశము ఏర్పాటు చేయుచున్నట్టు తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రతి పార్టీ నుండి ఒకరికి మించకుండా సకాలంలో హాజరై రెండవ గ్రామపంచాయతీ సాధారణ ఎన్నికల గ్రామపంచాయతీ వారిగ ప్రదర్శింపబడిన ఓటర్ జాబితా పై తగు సూచనలు సలహాలు ఇవ్వాలని కోరారు. ఏవైనా అభ్యంతరాలు ఉన్న ఎడల సదరు అభ్యంతరాలను రాతపూర్వకంగా అందజేయాలని కోరారు.

## నూతన తహసీల్దార్‌గా రమాకాంత్ శర్మ



**విశ్వంభర, చింతపల్లి:** చింతపల్లి మండల నూతన తహసీల్దార్‌గా రమాకాంత్ శర్మ బుధవారం బాధ్యతలను చేపట్టారు. ఆయన యాదాద్రి జిల్లా సివిల్ సప్లైస్ నుండి ప్రమోషన్ పైన మండలానికి వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహించిన తహసీల్దార్ విజయ కుమార్ హైడ్రాకు బదిలీ పై వెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మార్వో రమాకాంత్ శర్మ మాట్లాడుతూ మండలంలోని రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, కులం ఆదాయ ధ్రువ పత్రాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరువ చేసి మండలాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తానన్నారు.. సిబ్బంది అందరూ తమ విధుల పట్ల బాధ్యతగా వ్యవహరిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరించాలన్నారు. రెవెన్యూ సిబ్బంది తహసీల్దార్‌కు స్వాగతం పలికి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రమాద బాధితులకు అండగా ఉంటాం



**విశ్వంభర,ములకలపల్లి:** ములకలపల్లి మండలం మోర్రేడు బ్రిడ్జి వద్ద జరిగిన ప్రమాదంలో తీవ్ర గాయాలై హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న బాధితులు ప్రమాదానికి కారణమైన వ్యక్తులపై చర్య తీసుకోవాలని ధర్నా చేశారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు బత్తుల అంజి బాధితులను సముదాయించి అండగా ఉంటామని ధర్నా విరమింప జేశారు. కార్యక్రమంలోతహసీల్దార్ పుల్లారావు, పాల్వంచ రూరల్ ఎస్ఐ సురేష్, సురభి రాజే శ్, సయ్యద్ సర్దార్ తదితరులున్నారు.

## అన్నప్రసాద వితరణ



**విశ్వంభర, చింతపల్లి** :చింతపల్లి మండల పరిధిలోని ఘడియ గౌరరం గ్రామంలో శ్రీ బాల గణేష్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గణనాథుని వద్ద నవ రాత్రి ఉత్సవాలలో భాగంగా ప్రముఖ వ్యాపారవేత్త వరికుప్పల వెంకట్ రాములు మమత దంపతులు గణనాథునికి పూజలు నిర్వహించి అనంతరం మహాఅన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అన్నదానం చేసిన వరికుప్పల వెంకట్ రాములు దంపతులను కమిటీసభ్యులు శాలువాతో సత్కరించారు.

## జాతీయ లోక్ అదాలత్ను సద్వినియోగంచేసుకోవాలి

**విశ్వంభర, ఆమనగల్లు:** ఈనెల సెప్టెంబర్ 28న ఆమనగల్ కోర్టులో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నారు. సివిల్, క్రిమినల్ కేసులను రాజీమార్గం ద్వారా పరిష్కరించుకో వాలనుకు నేవారు ఈనెల 18 నుంచి 28వరకు కోర్టులో రాజీపడొచ్చని ఎస్ఐ బి.వెంకటేశ్ తెలిపారు.

## అమరవీరులకు నివాళులు



**విశ్వంభర, సికింద్రాబాద్:** సికింద్రాబాద్ క్లాక్ టవర్ వద్ద అమరవీరుల స్థూపంవద్ద తెలంగాణ ఉద్యమకారుల జేఏసి రాష్ట్రకమిటీ చైర్మన్ సుల్తాన్ యాదగిరి ఆధ్వర్యంలో తెలంగాణ దినోత్సవ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు, అమరవీరులకు ఉద్యమ నాయకులు నివాళులర్పించారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



**విశ్వంభర, తలకొండపల్లి:** తలకొండపల్లి మండలం దేవుని పడకల్ గ్రామంలో బుధవారం నాడు బక్కి యాదయ్య మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఆగ్రామ మాజీ సర్పంచ్ శ్రీశైలం మృతుని ఇంటికి వెళ్లి నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం తన వంతుగా 3 వేల రూపాయలు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్ రెడ్డి రూ.3 వేల, శతాబ్ది టౌన్ షిప్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి రూ. 5 వేల మొత్తం రూ. 11 వేల రూపాయలను వారి కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో మృతుడి కుమారులు శ్రీను, వేణు, మేస్త్రీ కృష్ణయ్య, పాండు, సత్యం, శంకర్, శ్రీను, జంగయ్య, రవి, శ్రీను,స్వామి తదితరులు పాల్గొన్నారు.

## లడ్డూను వేలంలో దక్కించుకున్న శరత్‌రెడ్డి



**విశ్వంభర, ఆమనగల్లు:** ఆమనగల్లు పట్టణంలోని పోస్ట్ ఆఫీస్ కాలనీలో భజరంగ్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడు తొమ్మిది రోజులు పాటు విశేష పూజలందుకున్నారు. నిమజ్జనం సందర్భంగా నిర్వహించిన లడ్డు వేలంలో కాలనీ వాసులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన లడ్డు వేలం పాటలో పట్టణానికి చెందిన కౌకుంట్ల శరత్ రెడ్డి 1.70 లక్షలకు లడ్డును దక్కించుకున్నారు. ధనలక్ష్మి మాలను మంచుకొండ చంద్రశేఖర్ 1,02,116 రూపాయలకు దక్కించుకున్నారు. ఆపిల్ కలశం శాలువాను పసునూరి విష్ణుమూర్తి 55,116 కు దక్కించుకున్నారు. వేలం దక్కించుకున్నవారికి శాలువాతో సన్మానించారు.ం

## గణనాథునికి ప్రత్యేక పూజలు



**విశ్వంభర, సికింద్రాబాద్:** నామాల గుండు ఉప్పరబస్తీలో టీం భగత్ సేన అసోసియేషన్ ఆర్గనైజర్ అరుణ్, అఖిల్, దేవాన్ష్, భగత్ చరణ్, ఆధ్వర్యంలో వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గణేష్ మండప నిర్వాహకులు మాట్లాడుతూ మా అసోసియేషన్ మెంబర్స్ బస్తీ వాసులు వినాయకుడికి ప్రత్యేక పూజలు చేసి అనంతరం అన్నదానం నిర్వహించారు ఈ సందర్భంగా, కాలనీవాసులు యువత వివిద సాంస్కృత కార్యక్రమాలతో ఎంతో ఘనంగా ఊరేగింపుగా ఆటపాటలతో, ట్యాంక్ బండ్, నిమర్జనానికి బయలుదేరిన మా అసోసియేషన్ వినాయకుడు అని తెలిపారు, ఈ కార్యక్రమానికి సంతోష్ యాదవ్, కార్తీక్ శివగణేష్, అంకిత్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థి ఆత్మ హత్యాయత్నం



**విశ్వంభర,మహేశ్వరం:** హాస్టల్‌లో ఉండడం ఇష్టం లేక విద్యా ర్థి ఆత్మహత్య యత్నం చేసుకున్నాడు. హైదరాబాద్ సంతోష్ నగర్‌లోని జ్యోతిరావు పూలే బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ హాస్టల్లో ఇంటర్మీడియట్ బైపీసీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. బుధవారం సిద్దు హాస్టల్ మొదటి అంతస్తుపై నుండి దూకుడంతో తీవ్ర గాయాలయ్యాయి వెంటనే గమనించిన హాస్టల్ ప్రిన్సిపల్ ఉపాధ్యాయులు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు హాస్టల్లో ఉండడం సిద్దుకు ఇష్టం లేక కుటుంబ సభ్యులు బలవంతంగా హాస్టల్లో చేర్పించడంతో సిద్దు ఆత్మహత్య చేసుకోవాలని భావించినట్టు తెలిసింది ప్రస్తుతం ప్రాణప్రాయం నుంచి బయటపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మహేశ్వరం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## భక్తులకు ప్రసాద వితరణ



**విశ్వంభర, వారాసిగూడ:** వారాసిగూడ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కురాకుల సుధాకర్ గుప్త ఆధ్వర్యంలో వినాయక నిమజ్జనం సందర్భంగా భారీగా వచ్చే భక్తులకు ప్రసాద వితరణ నిర్వహించారు ఈ కార్యక్రమానికి ప్రధాన కార్యదర్శి బొగుదుల రాజేష్ గుప్తా, కోశాధికారి యోధ వీరశేఖర్ రెడ్డి, ఎర్రమల్ల వీరయ్య గుప్తా, మునుగొంటి విజయ్ కుమార్ గుప్తా,ఉప్పల బాలకృష్ణ గుప్తా వాసా రాజేంద్రప్రసాద్ గుప్తా, కుటుంబ సభ్య పలువురు ప్రముఖు పాల్గొన్నారు.

# అర్హులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు: ఎమ్మెల్యే వీరపల్లి శంకర్

**విశ్వంభర,షాద్‌నగర్:** షాద్ నగర్ నియోజకవర్గంలో ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను అర్హులకు అందించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారని మరో రెండు నెలల్లో ఈ ప్రక్రియను పూర్తి చేస్తామని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్పష్టం చేశారు. బుధవారం బుధవారం రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గంలోని కొత్తూరు, షాద్ నగర్ మున్సిపాలిటీలలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను జిల్లా కలెక్టర్ శశాంకతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా షాద్ నగర్ పట్టణంలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ గృహ సముదాయాలను స్వయంగా పరిశీలించి స్థానిక ఆర్డిఓ వెంకట మాధవరావు తదితర శాఖల అధికారులతో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణాలు కొన్ని అసంపూర్తిగా ఉన్నాయని వాటిని వెంటనే పూర్తి చేసే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. అదేవిధంగా ఆయా ఇళ్లలో విద్యు విద్యుత్తు, మంచినీరు, ఇతర మౌలిక సదుపాయాల రూపకల్పనకు సంబంధించి వెంటనే పనులు ప్రారంభించాలని కలెక్టర్ ను కోరారు. అర్హులైన లబ్ధిదారులను పార్టీలకు రాజకీయాలకు అతీతంగా ఎంపిక చేసి వారికి అందజేస్తామని భరోసా ఇచ్చారు. షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కృషి అభినందనీయమని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక అభినందించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే శంకర్, మున్సిపల్ చైర్మన్ నరేందర్, కమిషనర్ చీమ వెంకన్న, ఆర్డిఓ వెంకట మాధవరావు, తాసిల్దార్ పార్థసారథి, కాంగ్రెస్ నాయకులు మహమ్మద్ అలీ ఖాన్ బాబర్, పి.వెంకటరామిరెడ్డి, కొంకల్ల చెన్నయ్య, పిరఘు, చెంది తిరుపతి రెడ్డి, మహమ్మద్ ఇబ్రహీం, సయ్యద్ ఖదీర్, సీతారాం, సుదర్శన్ గౌడ్,కొమ్ముకృష్ణ, ముబారక్ అలీ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



# మచ్చలేని నాయకుడు కూన శ్రీశైలం గౌడ్



**విశ్వంభర, కుత్బుల్లాపూర్:** కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ సీనియర్ నేత కూన శ్రీశైలం గౌడ్‌పై విలేకర్ల సమావేశంలో బీఆర్ఎస్ కార్పొరేటర్లు చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ బుధవారం గాజులరామారంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, డివిజన్ అధ్యక్షులు, విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మా సీఎం రేవంత్ రెడ్డి పైన, మా నాయకుడు కూన శ్రీశైలం గౌడ్ పైన మరోసారి నోటికొచ్చినట్టు మాట్లాడితే ఊరుకునేది లేదన్నారు. కూన శ్రీశైలం గౌడ్ మచ్చలేనినాయకుడన్నారు. ఇప్పుడున్న కార్పొరేటర్లంతా శ్రీశైలం గౌడ్ పెట్టిన రాజకీయ భిక్షతో బతికి, ఇవాళ ఆయననే విమర్శిస్తారా.. అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ లక్ష్మారెడ్డి, మాజీ కార్పొరేటర్లు బొడ్డు వెంకటేశ్వరరావు, పాలకృష్ణ, టిపిసిసి ప్రధాన కార్యదర్శి పున్నారెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గుంజ శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ బొబ్బా రంగారావు, డిసిసి ఉపాధ్యక్షులు శ్రవణ్, బండి శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఓరుగంటి కృష్ణా గౌడ్, బుచ్చిరెడ్డి, కూన రఘు గౌడ్, మోతే శ్రీనివాస్ యాదవ్, జయరాం, రషీద్, డివిజన్ అధ్యక్షులు శ్రీధర్ రెడ్డి, బేకు శ్రీనివాస్, పండరి, శివ కుమార్, రాధా కృష్ణ, రహ్మతుల్లా, నాయకులు బాలప్ప, చాంద్ పాషా, రషీద్ బేగ్, కృష్ణ యాదవ్, లాల్ మహ్మద్, మధు సూదన్, తదితర నాయకులు పాల్గొన్నారు.

## నాగార్జున విద్యాలయంలో వ్యాసరచన పోటీలు..



**విశ్వంభర,మహబూబాబాద్:** మహబూబ్‌బాద్ జిల్లా కురవి మండల కేంద్రంలోశ్రీ సత్యసాయి సేవాసమితి ఆద్వర్యంలో నాగార్జున విద్యాలయం (నేహాశ్రీ కాన్సెప్ట్ స్కూల్) లో బుధవారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సత్యసాయిసేవాసమితి కురవి మండల కన్వీనర్ సిహెచ్ శ్రీనివాస్ పాల్గొని ప్రసంగించారు. విద్యార్థులు విద్యతోపాటు విశ్వజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. పుస్తకాలతోపాటు సమాజాన్ని చదవాలనే ఆకాంక్షను విద్యార్థులలో పెంపొందించే విధంగా బోదన జరగాలన్నారు. సాటిమనిషికి సహాయం చేయాలనే స్వభావం అలవర్చుకోవాలని సూచించారు. ఈ..కార్యక్రమంలో నాగార్జున విద్యాసంస్థల కరస్పాండెంట్ రవి, సత్యసాయిసేవాసంస్థల బాద్యులు తిరుమలరావు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## దిష్టిబొమ్మ దహనం



**విశ్వంభర, భూపాలపల్లి:** లోక్‌సభ ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ పై బిజెపి నాయకుడు తన్వీందర్ చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా భూపాలపల్లి పట్టణ అధ్యక్షులు ఇస్లావత్ దేవన్ ఆధ్వర్యంలో భూపాలపల్లి మండల కేంద్రం లో అంబేద్కర్ విగ్రహం వద్ద తన్వీందర్ సింగ్ దిష్టిబొమ్మను కాంగ్రెస్ పార్టీ నాయకులు దహనం చేశారు.ఈ సందర్భంగా ఇస్లావత్ దేవన్ మాట్లాడుతూ రాహుల్ గాంధీ బయటకు వస్తే చంపేస్తామని మీ నానమ్మ ఇందిరా గాంధీకి పట్టిన గతి నీకు పడుతుందని తన్వీందర్ సింగ్ బహిరంగంగా మాట్లాడినా కూడా ఇప్పటి వరకు బీజేపీ ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేక పోవడం నిజంగా బాధాకరం అన్నారు. ప్రధాన మంత్రి మోడీ, హోమ్ శాఖ మంత్రి అమిత్ షా వెంటనే స్పందించి తన్వీందర్ సింగ్ నీ వెంటనే అరెస్ట్ చేయాలని, ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తన్వీందర్ సింగ్ పై చర్యలు తీసుకోకపోతే దేశవ్యాప్తంగా ఆందోళనలు తీవ్రతరం చేస్తామని ఆయన హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పట్టణ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజేందర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చల్లూరి సమ్మయ్య, బుర్ర కొమురయ్య,సాంబమూర్తి,విన్నపురెడ్డి మహేష్ రెడ్డి,కౌన్సిలర్ దాట్ల శ్రీనివాస్, పొనగంటి శ్రీనివాస్, కంచర్ల సదానందం, రమణాచారి, హఫీజ్,గోమాస భూమయ్య, బైరెడ్డి లక్ష్మారెడ్డి, నాగపురి సమ్మయ్య, రేళ్ళ కుమార్, పెట్రోల్ శ్రీనివాస్,ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరం



**విశ్వంభర, తలకొండపల్లి:** తలకొండపల్లి మండలం చుక్కాపూర్ గ్రామంలో ఉప్పల చారిట బుల్ ట్రస్ట్ చైర్మన్ మాజీ జెడ్పీటీసీ ఉప్పల వెంకటేష్ ఉచిత వైద్య ఆరోగ్య శిబిరం ఏర్పా టు చేయించారు. డాక్టర్ అఖిల్ డాక్టర్ అనిల్, కామినేని హాస్పిటల్ ఆధ్వర్యంలో 261మందికి డెంగ్యూ మలేరియా టైఫాయిడ్ బిపి షుగర్ జలుబు దగ్గు వైరల్ ఫీవర్ వంటి వ్యాధులకు చికిత్సలు నిర్వ హించారు. సూచనలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్య క్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ నాలపురం శ్రీనివాస్ రెడ్డి సర్పం చ్ల సంఘం మాజీ అధ్య క్షులు గోపాల్ నాయక్, మాజీ సర్పంచ్ లలిత జోతయ్య, లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ లక్ష్మారెడ్డి, జూలూరు రమేష్, కొండల్ రెడ్డి, శేఖర్ రెడ్డి దేవుల నాయక్ మల్లేష్ రమేష్ నరేష్ ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## దేవుని ఆశీస్సులతో అందరూ బాగుండాలి

### సామాజిక సేవా కార్యకర్త భాస్కర్ గౌడ్



**విశ్వంభర, వికారాబాద్ :** గణనాథుని ఆశీస్సులతో గ్రామ ప్రజలంతా సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించినట్లు సామజిక సేవా కార్యకర్త భాస్కర్ గౌడ్ తెలిపారు. దోమ మండల పరిధిలోని ఐనాపూర్ గ్రామంలో ఊరడమ్మ గుడి వద్ద ఏర్పాటుచేసిన గణనాథుని నిమజ్జన ఊరేగింపు కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. భాస్కర్ గౌడ్ నిమజ్జన ఊరేగింపు కార్యక్రమంలో పాల్గొని గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ పెద్దలు జనార్దన్ గౌడ్, యాదయ్య, శ్రీను, సాయిలు, వినాయక మండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## వాల్ పోస్టర్ ఆవిష్కరణ



**విశ్వంభర, బషీర్ బాగ్:** తెలంగాణ క్రిస్టియన్ జేఏసీ ఆధ్వర్యంలో ఈనెల 26న బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో నిర్వహించే రాష్ట్ర సదస్సు వాల్ పోస్టర్ ను తెలంగాణ రాష్ట్ర మంత్రి కొండా సురేఖ, తెలంగాణ క్రిస్టియన్ జేఏసీ చైర్మన్ జిలకర రవికుమార్ ల చేతుల మీదుగా రాష్ట్ర సచివాలయంలోని మంత్రి చాంబర్‌లో ఆవిష్కరించారు. రాష్ట్ర చైర్మన్ జిలుకర రవికుమార్ మాట్లా డుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కొరకు పోరాడిన ఉద్యమకారులకు ప్రతి ఒక్కరికి 250 గజాల ఇంటి స్థలాన్ని కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం కేటాయించిన ఇంటి స్థానంలో ఇల్లు కట్టుకోవడానికి రూ.12 లక్షల వరకు ఆర్థిక సాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర సాధనలో పాల్గొన్న ఉద్యమకారునికి ప్రతి నెల పదివేల పెన్షన్ ఇవ్వాలని కోరారు.జేఏసీ నాయకులు డాక్టర్ బి.విద్యా కుమార్, బొట్టు మంచి సుధాకర్, సోమయ్య, గోలి ప్రకాష్ పాల్గొన్నారు.

## టాస్క్ సీఓఓగా బాధ్యతలు స్వీకరించిన రాఘవేందర్ రెడ్డి



విశ్వంభర, ఆమనగల్లు:టాస్క్ (తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్) చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్‌గా సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబులకు కృతజ్ఞతలు తెలిపారు. నా మీద నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహిస్తానన్నారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాల కల్పనకు కృషి చేస్తానన్నారు. టాస్క్ సి.ఇ.ఓ. శ్రీకాంత్ సిన్హా, ఐక్యత ఫౌండేషన్ గౌరవ అధ్యక్షులు సుంకిరెడ్డి కృష్ణా రెడ్డి,కల్వకుర్తి నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉత్సాహంగా గణేష్ నిమజ్జనం



**విశ్వంభర, రామన్నపేట:** రామన్నపేట మండల కేంద్రంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గణేశుని మహిళలు, చిన్నారులు, పెద్దలు, భక్తిశ్రద్ధలతో తొమ్మిది రోజులు పూజ చేసి, చివరిరోజు ఆటపాటలతో, నృత్యాలు చేసుకుంటూ,గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. ఆకుతోట శ్రీనివాసు 32 వేల రూపాయలకు వేలంపాటలో లడ్డూను దక్కించుకున్నాడు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు ఉప్పు ఈశ్వరయ్య, మండల ఆర్యవైశ్య సంఘం భవన కమిటీ గౌరవ అధ్యక్షులు విజయానందం, వాసవి భవన్ అధ్యక్షులు కొంపల్లి సురేష్, పట్టణ కమిటీ అధ్యక్షులు తమ్మిశెట్టి సందీప్ కుమార్, లక్ష్మాపురం తాజా మాజీ సర్పంచ్ ఉప్పు ప్రకాష్, ఉప్పు వెంకన్న, కొత్తమాసు మధుసూదన్, నవీన్ కుమార్, శ్రీనివాస్, రంగా రవీందర్, రోహిపర్తి సుభాష్, కొత్తమాసు కైలాసం, కృష్ణమూర్తి, సుధాకర్, కొంపల్లి వెంకటేశం, కొంపల్లి సత్తయ్య, రాంప్రసాద్, కొంపల్లి సుమలత, తమ్మిశెట్టి జ్యోతి, విజయ నిర్మల పాల్గొన్నారు. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి




**విశ్వంభర, పెద్ద శంకరంపేట:** విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోను రాణించాలని మెదక్ జిల్లా విద్యాధికారి రాధా కిషన్ అన్నారు. బుధవారం పెద్ద శంకరంపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎస్ జి ఎఫ్ మండల స్థాయి క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల వల్ల శారీరక మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థుల్లో దాగివున్న నైపుణ్యతను క్రీడల ద్వారా వెలికి తీయవచ్చు అన్నారు. విద్యార్థులు క్రీడల్లో ప్రతిభ కనబరిచి మండల స్థాయిలో జిల్లా స్థాయిలో రాష్ట్రస్థాయిలో జాతీయస్థాయిలో రాణించాలన్నారు. జాతీయస్థాయిలో రాణించిన విద్యార్థులు ఒలంపిక్స్ క్రీడల్లోనూ రాణించేలా కృషి చేయాలి అన్నారు. క్రీడలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రభుత్వం మంచి ప్రోత్సాహాన్ని అందజేస్తుందన్నారు. విద్యార్థులు మంచి క్రీడాకారులుగా రాణించాలని పేర్కొన్నారు.. ఎంఈఓ బుచ్చ నాయక్.. పిఆర్టియు జిల్లా గౌరవ అధ్యక్షులు రామచంద్ర చారి నోడల్ అధికారి వెంకటేశం.. ప్రధానోపాధ్యాయులు విట్టల్ రాజేశ్వరరావు విజయ్ కుమార్. ఉపాధ్యాయులు బి శ్రీనివాస్ ఆనంద్ కుమార్ శ్రీనివాస్ సంగమేశ్వర్.. సిద్ధి రాములు ప్రసన్న శేఖర్ మారుతి ఆయా పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైనది

### ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించిన మెదక్ జిల్లా విద్యాధికారి రాధా కిషన్



**విశ్వంభర,పెద్ద శంకరంపేట:** ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైనదని సమాజంలో కౌరవుపదమైన వృత్తి ఏదైనా ఉండదంటే అది ఉపాధ్యాయ వృత్తిని మెదక్ జిల్లా విద్యాధికారి రాధాకృష్ణ అన్నారు పెద్ద శంకరంపేట లోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పెద్ద శంకరంపేట మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులను మెదక్ జిల్లా విద్యాధికారి రాధా కిషన్ బుధవారం ఘనంగా సన్మానించారు. మండల స్థాయి 11 మంది ఉత్తమ ఉపాధ్యాయులను డిఇఓ రాధా కిషన్ ఎంఈఓ బుచ్చా నాయకులు చేతుల మీదుగా శాలువాలతో మెమెంటులతో ప్రశంసా పత్రాలతో ఘనంగా సన్మానించారు.. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి బుచ్చా నాయక్.. నోడల్ అధికారి వెంకటేశం.. ప్రధానోపాధ్యాయులు విట్టల్ రాజేశ్వరరావు విజయకుమార్ ఆయా ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు బి శ్రీనివాస్.. రామచంద్ర చారి మారుతి సంగమేశ్వర్ ప్రసన్న రవి నందయ్యగారి శ్రీనివాస్ సిద్ధిరాములు పాల్గొన్నారు.

## బీజేపీ నేతల అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా ధర్నా



**విశ్వంభర, మహబూబాబాద్:** రాహుల్ గాంధీపై బీజేపీ మాజీ ఎమ్మెల్యే అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా మహబూబాబాద్ పట్టణంలో ధర్నా నిర్వహించారు. దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ధర్నా సందర్భంగా తెలంగాణ శిశు సంక్షేమశాఖ, పంచాయితీ రాజ్ మంత్రి సీతక్క, మహబూబాబాద్ శాసనసభ్యులుడాక్టర్ భూక్యా మురళి నాయక్, డిసిసి అధ్యక్షులు జెన్నారెడ్డి భరత్ చందర్ రెడ్డి, ఎంపీ పోరిక బలరాం నాయక్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు అంజయ్య, మండల పార్టీ అధ్యక్షులు,రాంరెడ్డి, వెంకన్న, సతీష్, ప్రభాకర్, నాగేశ్వర్ రావు,సీనియర్ నాయకులు, జిల్లా నాయకులు, బ్లాక్ కాంగ్రెస్ నాయకులు, మాజీ సర్పంచ్లు, మాజీ ఎంపీటీసీలు, మాజీ వార్డు సభ్యులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, మహిళా కాంగ్రెస్ నాయకులు, ఎన్. యు. ఎస్. ఐ. నాయకులు, పట్టణ పలు వార్డుల కౌన్సిలర్లు అనుబంధ సంఘ పార్టీ నాయకులు పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## దరఖాస్తుల ఆహ్వానం



**విశ్వంభర, వికారాబాద్:** ప్రభుత్వ వైద్య కళాశాలలో సీనియర్ రెసిడెంట్ లకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మల్లికార్జున్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 23వ తేదీన ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించే ఇంటర్వ్యూలకు నేరుగా సంబంధిత ఒరిజినల్ ధ్రువ పత్రాలతో పాటు జిరాక్స్ నఖల్ కాపీలతో హాజరు కావలసిందిగా ఆయన తెలిపారు. వివిధ విభాగాల్లో (57) సీనియర్ రెసిడెంట్స్ పోస్టులకు సంబంధించి https://gmcvikarabad.org వెబ్ సైట్ ద్వారా తెలుసుకోవచ్చని ఆయన తెలిపారు. పైన తెలిపిన ఉద్యోగాలకు గౌరవ వేతనం కింద చెల్లించబడుతుందని ఆ ప్రకటనలో తెలిపారు.

# పాలు కింద పోసి పాడి రైతుల ధర్నా



**విశ్వంభర, ఆమనగల్లు:** ఆమనగల్లు మండల కేంద్రంలో కడ్తాల్, ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి రైతులకు విజయ డైరీ పాల రైతులు 3నెలల బిల్లులు రాక పోవడంతో వారికి మద్దతుగా అమనగల్ BRS పార్టీ ఆధ్వర్యంలో అమనగల్ చౌరస్తాలో ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమనగల్లు డిసిసి జిల్లా డైరెక్టర్ గంప వెంకటేష్, మాజీ జెడ్పిటిసి అనురాధ పత్య నాయక్ మాట్లాడుతూ రైతుల పెండింగ్ బిల్లులు వెంటనే మంజూరు చేయాలని గత ప్రభుత్వంలో ఇచ్చిన మాదిరిగా 15 రోజులకు ఒకసారి వారి బిల్లు వారికి ఇచ్చి రైతులను ఆదుకోవాలని లేనిపక్షంలో ఆమనగల్లు నుండి అసెంబ్లీ వరకు ట్రాక్టర్ ర్యాలీ నిర్వహించి తెలంగాణ ప్రభుత్వానికి ఇది చెప్పే విధంగా ట్రాక్టర్ లతో అసెంబ్లీ ముట్టడిస్తామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎన్నడు రైతులు రోడ్డు ఎక్కిన పరిస్థితి రాలేదని ఈ తొమ్మిది నెలల కాలంలోనే రైతులు రోడ్డు ఎక్కవలసిన పరిస్థితికి రేవంత్ రెడ్డి తీసుకొచ్చారని రైతుబంధు రాకపోయే రుణమాఫీ కాకపోయే వాళ్లు కష్టపడి పోసిన పాల బిల్లుని సకాలంలో చెల్లించాలని డిమాండ్ చేశారు అనంతరం తాసిల్దార్ కార్యాలయానికి ర్యాలీగా బయలుదేరి తాసిల్దార్ లలితకు వినతి పత్రం అందజేశారు ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కుమార్, సరిత పంతు నాయక్, సోనా శ్రీను నాయక్, ఎంగళి రఘు, బాలస్వామి, చుక్క నిరంజన్ గౌడ్, పరమేష్, రమేష్ నాయక్, వెంకటేష్, రమేష్ నాయక్, బద్దు,మల్లేష్,మాల్యానాయక్, శివ,గణేష్, బాలస్వామి, భీమయ్య, భాస్కర్, రవీందర్, ప్రశాంత్, రైతులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా గణనాథుడి శోభాయాత్ర



**విశ్వంభర, వనస్థలిపురం:** రైసింగ్ స్టార్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హయత్‌నగర్ డివిజన్లో నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల చివరిరోజు లడ్డూ వేలం, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. వైభవంగా శోభాయాత్ర నిర్వహించి, గణనాథున్ని నిమజ్జనం చేశారు. ఈకార్ర్యకమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# నియోజకవర్గ సమగ్రాభివృద్దే లక్ష్యం..



**విశ్వంభర, భూపాలపల్లి:** నియోజకవర్గ సమగ్రాభివృద్దే లక్ష్యమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు తెలిపారు. బుధవారం భూపాలపల్లి నియోజకవర్గ పరిధిలోని కొత్తపల్లిగోరి మండలంలో రూ.3 కోట్లతో నిర్మించనున్న తహసీల్దార్, ఎంపీడీవో భవనాల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల సమగ్రాభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా కొత్తగా ఏర్పాటైన ఈ కొత్తపల్లిగోరి మండలాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మండలంలోని కొత్తపల్లిగోరి, జమ్ షెడ్ బేగ్ పేట, సుల్తాన్ పూర్, నిజాంపల్లి, కొత్తపల్లి, కోనరావుపేట గ్రామాల్లో సులేమాన్ గోరిసాహెబ్ భూములకు పట్టాలు ఇవ్వకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, త్వరలోనే ఇట్టి సమస్యకు శాశ్వత పరిష్కార మార్గం చూపుతానని ఎమ్మెల్యే అన్నారు. అదేవిధంగా, రూ.8 కోట్లతో పాండవుల గుట్టలను, బుగులోని గుట్టలను అభివృద్ధి చేయాలని మంత్రి జూపల్లి కృష్ణారావు పాండవులగుట్ట పర్యటనలో కోరినట్లు తెలిపారు. మంత్రి సానుకూలంగా స్పందించారని, అట్టి పనులను త్వరలోనే ప్రారంభిస్తామని తెలిపారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తున్నట్లు ఆయన తెలిపారు.

## పోటాపోటీగా లడ్డూ వేలం పాట



**విశ్వంభర, వనస్థలిపురం:** సూర్య నగర్ కాలనీ ఫేస్ టు వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గణేష్ నవరాత్రి ఉత్సవాల ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల చివరిరోజు ముఖ్య అతిథిగా హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి పాల్గొన్నారు. లడ్డూ వేలం పాట నిర్వహించారు. వేలంలో లడ్డూను రూ. 611116కు మద్దెలవెంకటేష్ గౌడ్ పద్మ దక్కించుకున్నారు. కలశం వేలంలో రూ. 101116కు ఆర్ల ఐలయ్య సుజాత దక్కించుకున్నారు. శేష వస్త్రాలు రూ. 53116కు దేప వెంకట్ రెడ్డి అనూషా దక్కించుకున్నారు. కమిటీ సభ్యులు గౌరవ అధ్యక్షులు జి వెంకట్ రెడ్డి వైస్ ప్రెసిడెంట్ దొండ నర్సిరెడ్డి జనరల్ సెక్రెటరీ బద్దం మహేందర్ రెడ్డి ట్రెజరర్ ఎం వంశీధర్ రెడ్డి పాల్గొన్నారు.

## కాలనీలో సమస్యలను పరిష్కరించిన కార్పొరేటర్



**విశ్వంభర, కమలానగర్:** గణేష్ ఉత్సవాల కారణంగా కమలానగర్ ప్రధాన రహదారి వద్ద వివిధ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అన్నప్రసాద కార్యక్రమం చేయడంతో రోడ్లపై పూర్తిగా చెత్త పేరుకు పోయి స్థానిక నివాసకులకు, వ్యాపారులకు దుర్వాసనతో ఇబ్బందిగా ఉండని వెంటనే స్పందించిన స్థానిక కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి పర్యటించి, వెంటనే శానిటేషన్ సిబ్బందితో మాట్లాడి కాలనీ పరిసరాలు మొత్తం శుభ్రం చేయించడం జరిగింది. అదేవిధంగా కాలనీలో ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని కాలనీ వాసులకు కార్పొరేటర్ సూచించారు. రాంకీ సిబ్బందిగడ్డం దయాకర్,జిహెచ్ఎంసి ఎస్ఎఫ్ఏ పాండురంగారావు, వీధి వ్యాపారులు పాల్గొన్నారు.

## గణనాథుని ఆశీస్సులతో అందరూ బాగుండాలి



**విశ్వంభర, వికారాబాద్:** గణనాథుని ఆశీస్సులతో గ్రామ ప్రజలంతా సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించినట్లు సామజిక సేవా కార్యకర్త భాస్కర్ గౌడ్ తెలిపారు. దోమ మండల పరిధిలోని ఐనాపూర్ గ్రామంలో ఊరడమ్మ గుడి వద్ద ఏర్పాటుచేసిన గణనాథుని నిమజ్జన ఊరేగింపు కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. భాస్కర్ గౌడ్ నిమజ్జన ఊరేగింపు కార్యక్రమంలో పాల్గొని గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ పెద్దలు జనార్దన్ గౌడ్, యాదయ్య, శ్రీను, సాయిలు, వినాయక మండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## అన్న ప్రసాద వితరణ



**విశ్వంభర, హైద్రాబాద్ :** గ్రేటర్ వారసిగూడ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో వినాయక చవితి ఉత్స వాలలో భాగంగా వినాయక నిమజ్జోత్సవం సందర్భంగా వారాసిగూడ కూడలిలో అన్న ప్రసాద వితరణ పెద్దఎత్తున ఏర్పాటు చేసారు. సంఘ అధ్యక్షులు బొమ్మ నరేందర్, కడియాల బలరాం, ప్రధాన కార్యదర్శి అల్లి గోవిందు, కోశాధికారి గోలి జనార్ధన్, యువజన అధ్యక్షులు కల్లేపల్లి రాజు నేత, నాయకులు మారుతి ,మహిళా అధ్యక్షురాలు బిళ్ళ దీపిక, యువజన ప్రధాన కార్యదర్శి పిండం సంతోష్, అంబర్ నగర్ పద్మశాలి సంఘం అధ్యక్షులు వల్లపు కృష్ణమూర్తి, మంద మురళి , మంద వెంకటస్వామి, చెరుపల్లి శ్రీకాంత్, జక్కా శ్రీహరి,వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు. స్థానిక నాయకులు మేకల సారంగపాణి, రవి ప్రసాద్ గౌడ్ పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఘనంగా గణనాథుని నిమజ్జనం



**విశ్వంభర, వికారాబాద్:** వికారాబాద్ మునిసిపల్ పరిధిలోని ఆలంపల్లి 14వ వార్డులో గౌడ సంఘం ఆధ్వర్యంలో నిమజ్జన వేడుకలు ఘనంగా నిర్వహించారు. గణనాథుని ఊరేగింపులో పెద్ద ఎత్తున స్థానికులు, ప్రజలు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు. డప్పు చప్పుల్లు , కోలాటాల నడమ, చిన్నారుల నృత్యాలతో నిమజ్జన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.

## వినాయకుని పూజల్లో చేపూరి శంకరయ్య



**విశ్వంభర, వనస్థలిపురం:** శాతావాహన నగర్ కాలనీలో వి4యు యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండప పూజలో మదర్ థెరీసా చారిటబుల్ సొసైటీ ప్రెసిడెంట్ చేపూరి శంకరయ్య, పాల్గొన్నారు. ఉత్సవాలలో ఓవిఆర్ కుమార్, సత్యాసాగర్ కాలనీ ప్రెసిడెంట్, విక్రమ్, మనీశ్, రాహుల్,మనోహర్,రామకృష్ణ,సిహెచ్.చైతన్యనాగరాజ్,శివ,అభి,రఫత్,మహిళలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే పరామర్శ

**విశ్వంభర, మూసాపేట:** ముసాపేట మండ లం జానంపేట గ్రామంలో బీఆర్ఎస్ గ్రామ పార్టీ ప్రెసిడెంట్ రామకృష్ణ ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి చికిత్సకు సహాయం చేశారు.డిశ్చార్జి అయి గ్రామానికి వచ్చిన రామకృష్ణని ఎమ్మె ల్యే పరామర్శించారు.



## విద్యార్థులకు మెరుగైన విద్య, భోజనం అందించాలి



**విశ్వంభర, భూపాలపల్లి:** విద్యార్థులకు మెరుగైన విద్య నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. బుధవారం మహా ముత్తారం మండలంలోని మోడల్ పాఠశాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. భోజనం, కూరలను పరిశీలించారు. ఆకుకూర పప్పు, గుడ్డు వడ్డిస్తున్నట్లు తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ 6వ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు నిర్వహించనున్న ఈ కళాశాలలో 302 మంది నుండి 9 వరకు, 97 మంది ఇంటర్మీడియట్ విద్యార్థులు విద్యానభ్యసిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల, ఉపాధ్యాయులు హాజరు రిజిస్టర్లు పరిశీలించారు. 272 విద్యార్థులు హాజరయ్యారని ప్రిన్సిపల్ తెలుపగా గైర్హాజరు చాలా మంది ఉన్నారని ఏదేని ఆరోగ్య సమస్యలున్నాయా అడిగి తెలుసుకున్నారు. భూపాలపల్లి నుంచి విద్యార్థులు వస్తుంటారని బస్సు సౌకర్యం లేకపోవడం వల్ల తరచూ గైర్హాజరు అవుతున్నారని, బస్సు సౌకర్యం కల్పించాలని కోరగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. మధ్యాహ్న భోజన కార్మికులు వేతనాలు సక్రమంగా ఇవ్వడం లేదని చాలా రోజులు నుండి పెండింగులో ఉన్నాయని తెలుపగా డీఈవోతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ప్రిన్సిపల్ అహ్మద్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

## రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి



**విశ్వంభర, భూపాలపల్లి:** రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ వైద్యులను ఆదేశించారు.బుధవారం మహా ముత్తారంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. క్యాజువాలిటి, డ్రగ్ స్టోర్, వాక్సిన్లు భద్రపరచు గది, ఫ్రిజ్, రక్త పరీక్షలు నిర్వహించు గదిని, ఓపి రిజిస్టర్ పరిశీలించారు. డెంగీ వ్యాధి నిర్ధారణ కిట్లు అందుబాటులో ఉంచాలని అన్నారు. ఎలాంటి వ్యాధులతో బాధపడే వారు వైద్య సేవలకు వస్తున్నారని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు ఎన్ని డెంగీ కేసులు నమోదు అయ్యాయని వైద్యులను అడుగగా ఒకటి వచ్చినట్లు తెలిపారు. జనరల్ వార్డులో చికిత్స పొందుతున్న వ్యాధి గ్రస్థులతో మాట్లాడి సమస్యలు, వైద్య సేవలు అడిగి తెలుసుకున్నారు. వైరల్ జ్వరాలతో వైద్య సేవలకు వస్తున్న వారి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. వైద్యులు, సిబ్బంది సమయ పాలన పాటిస్తూ మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. వ్యాధులు ప్రబలిన ప్రాంతాలలో జ్వర సర్వే నిర్వహించాలని తెలిపారు. పాము, కుక్క కాటు తదితర వ్యాక్సిన్లు అందుబాటులో ఉంచుకోవాలని వైద్యులను ఆదేశించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, వైద్యులు సుధీర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## దేవాలయ పునర్నిర్మాణానికి సహకారం అందిస్తా



**విశ్వంభర, రామన్నపేట:** రామన్నపేట మండలం ఎన్నారం గ్రామంలో పునర్నిర్మాణంలో ఉన్న ఆంజనేయస్వామి దేవాలయంను అభివృద్ధి చేసేందుకు తనవంతు సహకారం అందిస్తానని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం తెలిపారు. బుధవారం నాడు ఆయన ఆంజనేయస్వామి ఆలయ చైర్మన్ గా ఏకగ్రీవంగా ఎన్నుకున్న ఏనుగు దామోదర్ రెడ్డిని దేవాదాయ శాఖ అధికారిని వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకారం చేయించారు. దేవాలయ కమిటీ మెంబర్లుగా ఈరెల్లి యాదయ్య, బండమీది దివ్య, సింగారం నరసింహ, లోడంగ సురేష్ లతో ప్రమాణ స్వీకారం చేయించారు. చైర్మన్ గా ఎన్నికైన ఏనుగు దామోదర్ రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే వేముల వీరేశం సహకారంతో ఆలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సింగిరెడ్డి మల్లారెడ్డి, సీనియర్ నాయకులు లక్ష్మీ కాంతారావు, నల్ల భాస్కర్ రెడ్డి, జినుకల ప్రభాకర్, కక్కిరేణి విజయ్ కుమార్, బొక్క పురుషోత్తం రెడ్డి, సామ సుధాకర్ రెడ్డి, బండమీది సుధాకర్, ఆవనగంటి అంజయ్య, మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఉచిత మెడికల్ క్యాంపు



**విశ్వంభర, వనస్థలిపురం:** ఆరోగ్యమే మహాభాగ్యం అను నినాదంతో మన నీలాద్రి సూపర్ స్పెషలిటీ హాస్పిటల్(మాక్సికేర్) వారి సౌజన్యంతో హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని కాస్బాగ్ లో రైజింగ్ స్టార్స్ యూత్ అసోసియేషన్ వారి సహకారంతో ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించడం జరిగినది. 200 మంది కి వైద్య సేవలు ఉచితంగా అందించారు. బీపీ షుగర్ టెస్టులు ఉచితంగా చేసి, మందుల పంపిణీ కూడా ఉచితంగా అందించారు. యూత్ సభ్యులను నీలాద్రి హాస్పిటల్ యాజమాన్యాన్ని ఉచిత సేవలను అందించినందుకు పలువురు అభినందించారు ఈ కార్యక్రమంలో హాస్పిటల్ చైర్మన్ పి జితేందర్ రెడ్డి ఉపేందర్ రెడ్డి శ్రీకాంత్ యాదవ్ సందీప్ ముదిరాజ్ డాక్టర్ ఆర్ శివ( జనరల్ ఫిజీషియన్) తదితరులు పాల్గొన్నారు.

# కలుషితమవుతున్న మిషన్ భగీరథ తాగునీరు

### రోగాల బారిన పడుతున్న గ్రామ ప్రజలు

### పట్టించుకోని అధికారులు

**విశ్వంభర, మూసాపేట:** మహబూబ్‌నగర్ జిల్లా మూసాపేట మండల పరిధిలోని జానంపేట గ్రామంలో మిషన్ భగీరథ తాగునీరు కలుషితమై గ్రామస్తులు రోగాల బారిన పడుతున్న పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. గ్రామస్తుల కథనం ప్రకారం ఎస్సీ కాలంలో మిషన్ భగీరథ పైప్లైన్ డ్రైనేజీలో ఉండటంతో గ్రామంలో నీటి సరఫరా అవుతున్నప్పుడు డ్రైనేజీ లోనే వృధాగా నీరు పోవడమే కాకుండా డ్రైనేజీలో ఉన్న మురుగునీరు మళ్ళీ అదే పైపులోకి వెళ్లడంతో తాగునీరు కలుషితమవుతుంది ఇదంతా కళ్ళకు కట్టినట్లు కనిపించిన సంబంధిత అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించడంపై ఎస్సీ కాలనీవాసులు అగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు గ్రామంలో ఎక్కడ డ్రైనేజీలు ఉన్నాయో అక్కడ నల్ల ఏర్పాటు చేశారు కానీ వాటికి ట్యాపులు బిగించకపోవడంతో గ్రామంలో నీటి సరఫరా అవుతున్నప్పుడు వృధాగా డ్రైనేజీ లోనే పోవడం సరఫరా బందు అయినప్పుడు మురుగునీరు పైపుల ద్వారా పోవడం జరుగుతుందని గ్రామస్తులు తెలిపారు ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా నల్లాలు ఏర్పాటు చేసినప్పటికీ చుట్టూ ముళ్ళ కంపలు దుర్గంధం వాసన వస్తున్నదని ఇప్పటికైనా సంబంధిత అధికారులు డ్రైనేజీలో ఉన్న నల్లాలను తొలగించి అనువైన ప్రదేశాల్లో



నల్లాలను ఏర్పాటు చేసి వాటికి ట్యాపులు బిగించాలని గ్రామస్తులు కోరుతున్నారు

# వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఇతర శాఖల్లో విలీనం

## అవకాశాలపై నివేదిక రూపొందించాలి
## భోగాపురం విమానాశ్రయానికి అల్లూరి పేరు
## నూతన మద్యం విధానానికి ఆమోదం
## ఏపీ కేబినెట్ కీలక నిర్ణయాలు



**విశ్వంభర, అమరావతి** : ఏపీ కేబినెట్ కీలక నిర్ణయాలు తీసుకుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన బుధవారం జరిగిన మంత్రి వర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను మంత్రి పార్థసారథి వెల్లడించారు. వాలెంటర్లను, గ్రామ సచివాలయ సిబ్బందిని ఇతన శాఖల్లో విలీనం చేసేందుకు ఉన్న అవకాశాలపై సమగ్రంగా చర్చించి నివేదికను ప్రభుత్వానికి అందజేయాలని సమావేశం నిర్ణయించిందని పేర్కొన్నారు. రాష్ట్రంలో 2 లక్షల 63 వేల మంది వాలంటీర్లు ఉండగా వారిలో లక్షా 07వేల మంది రాజీనామా చేయగా లక్షా 10 వేల మంది ఉన్నారని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వం వాలంటీర్ల ను 15 ఆగస్టు 2023 నుంచి రెన్యూవల్ చేయక మోసం చేసిందని దుయ్యబట్టారు. విశాఖపట్నం జిల్లాలోని భోగాపురం విమానాశ్రయానికి అల్లూరి సీతారామరాజు విమానాశ్రయంగా నామకరణం చేస్తూ ఏపీ కేబినెట్ నిర్ణయించింది.నూతన మద్యం విధానానికి కేబినెట్ ఆమోదం తెలిపింది. నాణ్యమైన మద్యం బ్రాండ్లు, సగటు మద్యం ధర రూ. 99 నుంచి అందుబాటులో ఉంచాలని నిర్ణయం తీసుకుంది. వాలంటీర్ల వ్యవస్థపై సమావేశంలో సుదీర్ఘ చర్చ జరిగింది. 18 అంశాలకు ఆమోదం తెలిపిన రాష్ట్ర మంత్రివర్గం.. ఇటీవల ఏపీలో వరదల వల్ల పంటలకు జరిగిన నష్టంపై కౌలు రైతులకు పరిహారం దక్కేలా చూడాలని నిర్ణయించారు. వాలంటీర్లు సచివాలయాలకు దినపత్రికల కొనుగోలుకు నెలనెలా ఇచ్చే రూ.200 రద్దు.. 2023లో వాలంటీర్ల పదవీకాలం ముగిసినా రెన్యూవల్ చేయలేదని మంత్రులు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. పోలవరం డయాఫ్రమ్ వాల్ నిర్మాణం పనులు పాత ఏజెన్సీకే ఇవ్వాలని, మాజీ సైనికుల సంక్షేమానికి కార్పొరేషన్ ఏర్పాటుకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. వర్షాలతో దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులకు నిధులు విడుదల చేసింది.

## చంద్ర శేఖర్ గుప్తకు ఘన సన్మానం



**విశ్వంభర, ఎల్బీనగర్:** ఆర్కే పురం డివిజన్ వాసవీ కాలనీ నివాసుల సంక్షేమ సంఘం మహా గణపతి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. సుదీర్ఘకాలంగా వాసవీ కాలనీ అభివృద్ధికి నిర్విరామంగా కృషి చేసిన కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, అష్టలక్ష్మీ దేవాలయ ట్రస్ట్ ఫౌండర్ ఛైర్మన్ గౌరిశెట్టి చంద్రశేఖర్ గుప్తని గణేష్ ఉత్సవ కమిటీ ఛైర్మన్ చిలుక ఉపేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఉత్సవ కమిటీ, కాలనీ అసోసియేషన్ సభ్యులు వారిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ గుప్త మాట్లాడుతూ సత్కారాలతో మరింత బాధ్యత పెరిగిందన్నారు. సమాజ, ఆధ్యాత్మిక సేవకు వయస్సుతో సంబంధం లేకుండా అందరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. గణేష్ ఉత్సవ కమిటీ, కాలనీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## రికార్డ్ స్థాయిలో గణేష్ లడ్డూ వేలం పాట




**విశ్వంభర, సరూర్ నగర్:** వినాయక చవితి నవరాత్రులలో భాగంగా ఐకానిక్ ఫార్మ్స్ ఆఫీస్ లో శ్రీ దివ్య గణేష్ లడ్డూ వేలం పాట కార్యక్రమంలో సంజనా గైక్వాడ్ పాల్గొని స్వామివారి లడ్డూని రూ.6,11,100 సొంతం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఐకానిక్ ఫార్మ్స్ మేనేజిమెంట్, మార్కెటింగ్ టీం,కస్టమర్స్, ఆమెకు అభినందనలు తెలిపారు. సంజనా గైక్వాడ్ మాట్లాడుతూ స్వామి వారి లడ్డూను స్వంతం చేసుకున్నందుకు చాలా సంతోషంగా ఉందన్నారు.

## వినాయకుని పూజల్లో పాల్గొన్న ఉప్పల



**విశ్వంభర,కొత్తపేట:** కొత్తపేటలోని శ్రీలక్ష్మి నరసింహస్వామీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన గణేష్ మండపాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నప్రసాదం చేయించిన టి పీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ ,అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూబుద్ధికి, సిద్ధికి నాధుడని, సకలవిఘ్నాలకు వినాయకుడు అధినాయకుడని, చదువు, జ్ఞానానికి, విజయానికి ప్రతీకగా, సకల కార్యాలను నెరవేర్చే వరసిద్ధి ప్రదాత వినాయకుడన్నారు. వినాయకుని ఆశీస్సులతో ప్రజలందరూ సుఖ సంతోషాలుతో, ఆరోగ్యాలుతో జీవించాలని, పండుగను భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. తొట్ల శ్రీనివాస్ యాదవ్, బంటి, శ్రీకాంత్, నితిన్, కిరణ్ ,గౌతమ్,కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## లడ్డూ ,పులిహోర పంపిణీ



**విశ్వంభర,ఎల్బీనగర్:** ఆర్కే పురం డివిజన్ పరిధిలోని గ్రీన్ హిల్స్ కాలనీలో ఏర్పాటు చేసిన వినాయకుని దగ్గర కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, షాబాద్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నెంటూరి రవీందర్ రెడ్డి భక్తుల కోసం దాదాపు క్వింటా 25 కిలోల లడ్డును, రెండు క్వింటాల పులిహోర, 50 కేజీ ల శనిగేలు ఏర్పాటు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వినాయకుని ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని అన్నారు. కార్యక్రమంలో నెంటూరి ప్రత్యూష రెడ్డి, నెంటూరి ప్రషూల్ రెడ్డి, బిక్షం రెడ్డి, లింగస్వామి గౌడ్, పగిళ్ల భూపాల్ రెడ్డి, పెంబర్తి శ్రీనివాస్, మధుసూదన్ రావు పాల్గొన్నారు.

## వరద సహాయం కోసం ఖమ్మంలో బారులు తీరిన బాధితులు



**విశ్వంభర, ఖమ్మం:** ఖమ్మంలో వర్షాలు తగ్గినా ప్రజల కష్టాలు మాత్రం తీరడం లేదు. భారీ వర్షాలకు సర్వం కోల్పోయి వీధిన పడ్డ ప్రజలు ప్రభుత్వ సాయం కోసం కండ్లు కాయలు కాచేలా ఎదురు చూస్తున్నారు. వరద బాధితులను అన్ని విధాలా ఆదుకుంటామని ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా చెప్పింది. కానీ, క్షేత్ర స్థాయిలో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి.ఖమ్మం మున్సిపల్ ఆఫీసు దగ్గర వరద సాయం అందలేదని ఫిర్యాదు చేయడానికి పెద్ద ఎత్తున బాధితులు తరలి వచ్చారు. వరదల్లో తాము పూర్తిగా నష్టపోయామని.. తమకు వరద సహాయం అందలేదంటూ కన్నీళ్లుపెట్టుకున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమను ఆదుకోవాలని వరద బాధితులు కోరుతున్నారు.

## తిరుమలలో గరుడ సేవ రోజున అన్ని సేవలు రద్దు



**విశ్వంభర, తిరుమల:** శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా అక్టోబర్ 8వ తేదీన జరగనున్న గరుడసేవ కోసం అన్ని విభాగాల ఏర్పాట్లపై అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి బుధవారం అధికారులతో సమీక్షా నిర్వహించారు. తిరుమలలోని గోకులం విశ్రాంతి భవనంలో బుధవారం సాయంత్రం అదనపు ఈవో సమీక్ష నిర్వహించారు.ఆయన మాట్లాడుతూ గరుడ సేవ రోజులన భక్తుల సౌకర్యార్థం వయోవృద్ధులు దివ్యాంగులు, చిన్నపిల్లల తల్లిదండ్రులతో సహా అన్ని ప్రత్యేక దర్శనాలను రద్దు చేయడంతో పాటు, అన్ని ఆర్జిత సేవలను టీటీడీ రద్దు చేసిందని చెప్పారు. అక్టోబర్ 7వ తేదీ రాత్రి 9 గంటల నుంచి అక్టోబర్ 9 ఉదయం 6 గంటల వరకు రెండు ఘాట్ రోడ్లలో ద్విచక్ర వాహనాల రాకపోకలను నిషేధించినట్లు తెలిపారు.గ్యాలరీలలోనికి ప్రవేశం, నిష్క్రమణ, హోల్డింగ్ పాయింట్లు, అన్నప్రసాద వితరణ, యాత్రికుల రద్దీ నిర్వహణపై చర్చించారు. పోలీసుల భద్రత, శ్రీవారి సేవకుల సేవలు, అంబులెన్స్‌లను సిద్ధంగా ఉంచడం, భక్తుల రవాణా, పార్కింగ్, బారికేడింగ్ తదితర అంశాలపై అదనపు ఈవో సుదీర్ఘంగా సమీక్షించారు. ఈ సమావేశంలో టీటీడీ సీఇ సత్యనారాయణ, తిరుమలలోని వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## అమరావతికి పూర్వవైభవం తీసుకొస్తాం : చంద్రబాబు



**విశ్వంభర, అమరావతి:** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి పూర్వవైభవం తీసుకొస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. అమరావతి అభివృద్ధికి కేంద్రం రూ.15 వేల కోట్ల ఆర్థికసాయం ప్రకటించిందని పేర్కొన్నారు. బుధవారం మంగళగిరిలో ఎన్డీయే శాసనసభాపక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ అమరావతికి ఇంకా నిధులు ఇస్తామని కేంద్రం హామీ ఇచ్చిందని తెలిపారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వందరోజుల్లో శ్రీసిటీలో 16 సంస్థలను ప్రారంభించామని, 6 సంస్థలకు శంకుస్థాపన చేశామని అన్నారు. బీపీఎల్ సంస్థ రాష్టంలో రూ. 75 వేల కోట్లతో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చిందని వెల్లడించారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు కూడా నియోజకవర్గాల వారీగా విజన్ డాక్యుమెంట్లు రూపొందించుకోవాలని సూచించారు. గత ప్రభుత్వ హయాంలో వైసీపీకి 151 మంది సీట్లు ఉన్నాయని విర్రవీగిన వారు 11 సీట్లకే పరిమితమయ్యారని విమర్శించారు.జనసేన అధ్యక్షుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ చంద్రబాబు చేసే మంచి పనులను గుర్తించి అండగా ఉంటామన్నారు. సంక్షేమంలో తిరుగులేని చరిత్ర సృష్టించామని తెలిపారు. సమావేశంలో బీజేపీ ఏపీశాఖ అధ్యక్షురాలు, ఎంపీ పురందేశ్వరి, మూడు పార్టీలకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.

## చంద్రబాబు ఓపిక నన్ను ఆశ్చర్యపరుస్తోంది: డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్



విశ్వంభర, మంగళగిరి: సీఎం చంద్రబాబు దార్శనికుడు.. అను నిత్యం తనను ఆశ్చర్యపరుస్తూనే ఉంటారని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. మంగళగిరిలోని సీ కన్వెన్షన్ సెంటర్లో ఏర్పాటుచేసిన ఎన్డీయే శాసనసభాపక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు నాయకత్వంలో పనిచేయడం సంతోషంగా ఉందన్నారు."100 రోజుల్లో చాలా హామీలు నెరవేర్చాం. పింఛన్ పెంచేందుకు ఖజానాలో డబ్బులు లేవు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ పింఛన్లు పెంచాం. సంక్షేమంలో తిరుగులేని చరిత్ర సృష్టించాం. గతంలో ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు సరైన సమయానికి వచ్చేవి కావు. నిర్జీవమవుతున్న పంచాయతీలకు సీఎం రూ.1,452 కోట్లు ఇచ్చారు. వైకాపా సర్పంచ్లు ఉన్న పంచాయతీలకు కూడా నిధులు ఇస్తాం. అన్న క్యాంటీన్ల వల్ల పేదలు, కార్మికులకు లాభం జరుగుతుంది. గత ప్రభుత్వానికి అన్న క్యాంటీన్లను ఎలా మూసివేయాలనిపించింది? ల్యాండ్ టైట్లింగ్ చట్టాన్ని రద్దు చేసి పేదల భూములను రక్షించిన సీఎంకు కృతజ్ఞతలు. చంద్రబాబు ఓపిక నన్ను ఆశ్చర్యపరుస్తుంది. పాతికేళ్ల యువకుడు కూడా చంద్రబాబులా కష్టపడలేరు. సీఎం బురదలో దిగి నడుస్తుంటే.. వైకాపా విమర్శలు చేస్తుంది. ఆయన చేసే మంచి పనులను గుర్తించి అండగా ఉంటాం" అని పవన్ కల్యాణ్ అన్నారు.

## కూటమి ప్రభుత్వం వందరోజుల పాలన అట్టర్‌ఫ్లాప్




**విశ్వంభర, అమరావతి** : ఏపీలో కూటమి ప్రభుత్వం వందరోజుల పాలన అట్టర్‌ఫ్లాప్ అని వైసీపీ నాయకుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డివిమర్శించారు. తాడేపల్లి వైసీపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఇటీవల విజయవాడను ముంచెత్తిన వరదల వల్ల ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారని పేర్కొన్నారు. బాధితులకు ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఆరోపించారు. సుమారు మూడు లక్షల మంది వరద ప్రభావానికి గురికాగా వారికి సహాయ, సహకారాలు అందించలేక పోయారని వెల్లడించారు. చంద్రబాబు నివాసం నీటిలో మునిగిపోవడంతో అక్కడికి వెళ్లలేక కలెక్టరేట్‌లో ఉండి సమీక్షల పేరిట కాలయాపన చేశారని ఆరోపించారు. చంద్రబాబు, మంత్రులు వరద ప్రాంతాల్లో పర్యటించినా బాధితులకు ఎలాంటి మేలు జరుగలేదని తెలిపారు. వరద నుంచి ప్రజల దృష్టిని మరల్చడానికి ప్రకాశం బ్యారేజీలో కొట్టుకువచ్చిన బోట్లు వైసీపీ నాయకులవంటూ తప్పుదోవ పట్టించారని విమర్శించారు. అబద్దాలకు అలవాటు పడ్డ చంద్రబాబు ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడం లేదని దుయ్యబట్టారు. డీఎస్సీపై తొలి సంతకం పెట్టి వంద రోజులు కావస్తున్న దాని పురోగతి గురించి ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు.

# మోదీ అద్భుతమైన వ్యక్తి

## ఆయనతో త్వరలో భేటీ అవుతా వెల్లడించిన: ట్రంప్



**ఢిల్లీ:** ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకు భారత ప్రధాని నరేంద్ర మోదీ అమెరికా పర్యటనకు వెళ్లనున్నారు. అయితే ఆ సమయంలో మోదీతో తాను భేటీ కానున్నట్లు అమెరికా మాజీ అధ్యక్షుడు, రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ తెలిపారు. వచ్చే వారంలో ఆయనతో భేటీ ఉంటుందని ఓ సభలో పేర్కొన్నారు. మోదీ అద్భుతమైన వ్యక్తి అని కొనియాడారు. మిచిగాన్‌లోని ఫ్లింట్ నగరంలో భారత్–అమెరికా వాణిజ్య సంబంధాలపై మాట్లాడుతూ ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. కాగా, అమెరికాలో అధ్యక్ష ఎన్నికల వేళ ట్రంప్, ప్రధాని మోదీతో భేటీ అవుతానని ప్రకటించటంపై ప్రస్తుతం ప్రాధాన్యత సంతరించుకుంది. "మోదీ వచ్చే వారం వస్తున్నారు. నేను ఆయన్ను కలవబోతున్నాను. ఆయన ఓ అద్భుతం. ఓ అద్భుతమైన వ్యక్తి." అంటూ మోదీపై ప్రశంసలు కురిపించారు ట్రంప్. అయితే ఎక్కడ కలుస్తారనే విషయంపై మాత్రం స్పష్టత ఇవ్వలేదు. భారత్–అమెరికా వాణిజ్య సంబం ధాలపై కూడా కీలక వ్యాఖ్యలు చేశారు ట్రంప్?. దిగుమతులపై భారత్ భారీ?సుంకాలను విధిస్తోం దని పేర్కొన్నారు. "వారు(సుంకాలు విధించే దేశాలు) ఎంతో తెలివైన వారు. మాకు వ్యతిరేకంగా వారు వ్యవహరిస్తున్నారు. భారత్ ఎంతో కఠినమైనది. బ్రెజిల్ కూడా కఠినమైనది. చైనా అన్నింటికంటే కఠినమైనది. కానీ మేము సుంకాల విషయంలో చైనాను జాగ్రత్తగా ఉంటాం." అని పేర్కొన్నారు.

***అమెరికా పర్యటనలో మోదీ షెడ్యూల్ ఇదే:*** సెప్టెంబరు 21న అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఆధ్వర్యంలో విల్మింగ్టన్ వేదికగా నిర్వహించనున్న నాలుగో "క్వాడ్" సదస్సులో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొననున్నారు. సెప్టెంబరు 22న న్యూయా ర్క్‌లో ప్రవాస భారతీయులను ఉద్దేశించి మోదీ ప్రసంగించనున్నారు. కృత్రిమ మేధ, బయోటె క్నాలజీ, సెమీకండక్టర్లు తదితర రంగాల్లో సహకారాన్ని పెంపొందించేందుకు ప్రముఖ సంస్థల సీఈవోలతోనూ భేటీ కానున్నారు. భారత్–అమెరికా సంబంధాల్లో కీలకంగా వ్యవహరిస్తున్న ప్రముఖులతోనూ సంభాషించనున్నారు. సెప్టెంబరు 23న న్యూయార్క్‌లోని ఐరాస ప్రధాన కార్యాలయంలో "సమ్మిట్ ఆఫ్ ది ఫ్యూచర్"ను ఉద్దేశించి కూడా ప్రధాని మోదీ ప్రసంగించనున్నారు.

## పంట కోసం తెచ్చిన అప్పులు తీర్చలేక.. పురుగుల మందు తాగి కానిస్టేబుల్ ఆత్మహత్య

**విశ్వంభర, అమరావతి:** పంట పెట్టుబడి కోసం చేసిన అప్పు తీర్చాలని వేధింపులు భరించలేక ఓ కానిస్టేబుల్ ఆత్మహత్య చేసుకున్న ఘటన నెల్లూర్ జిల్లాలో చోటు చేసుకుంది . ఏఎస్‌పేట మండల పీఎస్‌లో విధులు నిర్వహిస్తున్న రమేశ్అనే కానిస్టేబుల్ పంట వేసుకునేందుకు వైసీపీ జడ్పీటీసీ భర్త ప్రసాద్‌గౌడ్ వద్ద అప్పు తీసుకున్నాడు.ఇటీవల కురిసిన వర్షాలకు పంట నష్టపోవడం తో తీవ్ర ఆందోళనకు గురయ్యాడు. దీంతో పాటు అప్పు ఇచ్చిన ప్రసాద్‌గౌడ్ నుంచి ఒత్తిళ్లు రావడంతో సొంత నివాసమైన సంగం మండలం పడమటిపాలెంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ప్రసాద్‌గౌడ్ వేధింపులు తాళలేక ఆత్మహత్య చేసుకుంటున్నానని లేఖ రాశాడు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# చోటా నేతలను రాహుల్ గాంధీపై ఉసిగొల్పుతున్నారు

**సిమ్లా:** రాహుల్ గాంధీపై కేంద్ర మంత్రి, బీజేపీ నేత రవ్‌నీత్ సింగ్ బిట్టూ ప్రకటనను హిమాచల్ ప్రదేశ్ సీఎం సుఖ్వీందర్ సింగ్ సుఖు తీవ్రంగా ఖండించారు. రాహుల్ గాంధీపై బీజేపీ తమ చోటా నాయకులచే అనుచిత వ్యాఖ్యలు చేయిస్తోందని ఆరోపించారు. సుఖ్వీందర్ బుధవారం సిమ్లాలో మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. పంజాబ్ నుంచి కాంగ్రెస్ ఎంపీగా ఉండగా రవ్‌నీత్ సింగ్ రాహుల్ గాంధీని పొగుడుతూ పాటలు పాడేవారని గుర్తుచేశారు. ఎంపీ కాకుండానే ఇప్పుడు ఆయన బీజేపీ ప్రభుత్వంలో మంత్రి కాగానే రాజ్యసభ సభ్యత్వం కోసం బీజేపీ దృష్టిని ఆకర్షించేందుకు జాతీయ నేతపై విమర్శలు గుప్పిస్తున్నారని మండిపడ్డారు. ఇలాంటి నేతలను బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా అదుపులో పెట్టాలని హితవు పలికారు. ఉత్తరాదిలో కొన్ని రాష్ట్రాల ఎన్నికలు జరుగుతున్న క్రమంలో ప్రభుత్వ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని, ఇది కాషాయ పార్టీ రాజకీయ ఎత్తుగడలో భాగమే నని దుయ్యబట్టారు. కాగా, కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీపై కేంద్ర మంత్రి రవ్‌నీత్ సింగ్ బిట్టూ చేసిన వ్యాఖ్యలపై యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు భగ్గుమన్నారు. కేంద్ర మంత్రి ఇంటి ఎదుట యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు బుధవారం ఆందోళన చేపట్టారు.మంత్రి ఇంటి ముట్టడికి ప్రయత్నించిన కాంగ్రెస్ కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బీజేపీ నేతలు రాహుల్ గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని కాంగ్రెస్ శ్రేణులు ఆందోళన వ్యక్తం చేశాయి. బీజేపీ నేతలు క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. కాగా, రాహుల్ గాంధీ భారతీయుడు కాదని, తన జీవితకాలంలో అధిక సమయం విదేశాల్లోనే గడుపుతారని కేంద్ర మంత్రి రవనీత్ సింగ్ బిట్టూ అన్నారు. విదేశీ పర్యటనల్లో భారత్ గురించి తప్పుగా మాట్లాడతారని, దేశం పట్ల ప్రేమ లేదని దుయ్యబట్టారు.



# ఈ నెల 21న ఢిల్లీ ముఖ్యమంత్రిగా ఆతిశీ ప్రమాణం..!



**దిల్లీ:** దిల్లీ ముఖ్యమంత్రిగా నియామకమయైన ఆమ్ ఆద్మీ పార్టీ నాయకురాలు అతిషి ఈ నెల 21న ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా ప్రమాణస్వీకారంపై భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు సమాచారం ఇచ్చారు. అరవింద్ కేజ్రీవాల్ మంగళవారం సీఎం పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఆతిశీ కొత్తగా సీఎంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. అయితే, ప్రమాణస్వీకారం తేదీని మాత్రం ఆమ్ ఆద్మీ పార్టీ ప్రకటించలేదు. మరో వైపు కొత్త ప్రభుత్వంలో ఎవరికి కేబినెట్‌లో చోటు దక్కుతుందనే చర్చ జోరుగా సాగుతున్నది. కేబినెట్‌లో పాత మంత్రులతో పాటు మరో కొత్త ముఖాలకు సైతం ఛాన్స్ దక్కే అవకాశం ఉందని భావిస్తున్నారు. కేబినెట్‌లో ఖాళీగా ఉన్న పదవులపై ప్రాంతీయ, కుల సమీకరణాలు సమతూకంపై పార్టీ కసరత్తు చేస్తున్నది. షెడ్యూల్డ్ కులానికి చెందిన ఒకరికి మరొకరికి అవకాశం దక్కే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుత మంత్రివర్గాన్ని మార్చేందుకు సీఎం సానుకూలంగా లేరని సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ప్రస్తుత మంత్రులకు మంత్రివర్గంలో చోటు దక్కవచ్చని భావిస్తున్నారు. రెండుబెర్తుల కేబినెట్ బెర్తుల కోసం పలువురు ఎమ్మెల్యేలు రేసులో ఉన్నారు. సోమనాథ్ భారతి, దుర్గేష్ పాఠక్, సంజీవ్ ఝా, దిలీప్ పాండే, మహేంద్ర గోయల్ జనరల్ కేటగిరిలో పోటీలో ఉన్నారు. ఎస్టీ కోటా నుంచి కులదీప్ కుమార్, విశేశ్ రవి, గిరీశ్ సోనీ బరిలో ఉన్నారు. గురువారం నాటికి మంత్రివర్గంపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తున్నది. రాష్ట్రపతి నుంచి గ్రీన్ సిగ్నల్ లభించడంతో శుక్రవారం నాటికి కొత్త ప్రభుత్వం ప్రమాణస్వీకారం చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ సారి లెఫ్టినెంట్ గవర్నర్ సెక్రటేరియట్‌లోనే ప్రభుత్వం ప్రమాణస్వీకారం చేస్తుందని భావిస్తున్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ నుంచి శాసనసభా పక్ష నేతగా ఎన్నికైన అతిషి నేతృత్వంలో ఢిల్లీ ప్రభుత్వ తొలి మంత్రివర్గంలో ఢిల్లీ ముఖ్యమంత్రి మహిళా సమ్మాన్ యోజన ఆమోదం తెలిపే అవకాశం ఉన్నట్లు తెలుస్తున్నది. అక్టోబర్ తొలివారంలో ప్రభుత్వం తొలి కేబినెట్ సమావేశం నిర్వహించనున్నట్లు తెలుస్తున్నది. భేటీలో పలు అంశాలపై చర్చించనున్నారు. ప్రముఖంగా మహిళా సమ్మాన్ యోజనపై చర్చించనున్నారు. పథకం కోసం ఢిల్లీ సర్కారు బడ్జెట్‌లో రూ. 2వేలకోట్లు కేటాయించింది. ఈ పథకంలో ఢిల్లీలో 18 సంవత్సరాలు దాటిన ప్రతి మహిళకు నెలకు రూ. 1000 ఇవ్వాలని నిర్ణయించారు. ఉద్యోగం చేస్తున్నా.. ఇతర ఆర్థిక ప్రయోజనాలు పొందుతున్న వారికి పథకం వర్తించదు. అలాగే, ఢిల్లీ జల్‌బోర్డు బిల్లు మాఫీ సహా ఇతర అంశాలపై చర్చించనున్నారు. ఆప్ పదేళ్ల పాలన తర్వాత సీఎంకు సైతం శాఖలు ఉండనున్నాయి. విద్య, పబ్లిక్ వర్క్స్‌తో పాటు పలు కీలకమైన శాఖలను తనవద్దే ఉంచుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తున్నది. ఇంతకు సీఎంగా ఉన్న కేజ్రీవాల్ తన వద్ద ఏ ఒక్కశాఖను ఉంచుకోలేదు. కొంతకాలం జలమండలి బాధ్యతలు చూసినా.. ఆ తర్వాత మరొకరికి అప్పగించారు.

## అజిత్ పవార్ వల్లే మహారాష్ట్ర కేబినెట్‌లో మా పార్టీకి చోటు దక్కలేదు: కేంద్ర మంత్రి



**ముంబై:** కేంద్ర మంత్రి రాందాస్ అథవాలే కీలక వ్యాఖ్యలు చేశారు. మహారాష్ట్రలోని మహాయుతి ప్రభుత్వంలో అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్సీ పీని చేర్చుకోవడం వల్ల తమ పార్టీ ఆర్పీఐ (ఏ)కు చోటు దక్కలేదని అన్నారు. సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి రాందాస్ అథవాలే, పాల్ఘఢ్ జిల్లాలోని దహానులో మీడి యాతో మాట్లాడారు. 'మహాయుతి ప్రభుత్వంలో అజిత్ పవార్ చేరిన తర్వాత మహారాష్ట్ర కేబినెట్‌లో ఆర్పీఐ (ఏ)కు మంత్రి పదవి రాలేదు. మా పార్టీకి క్యాబినెట్ పదవులు, రెండు కార్పొరేషన్ల ఛైర్మన్‌లు, జిల్లా స్థాయి కమిటీ పోస్టులు ఇస్తామని హామీ ఇచ్చారు. కానీ అజిత్ పవార్ చేరికతో ఇవే మీ జరుగలేదు' అని అన్నారు. అయితే రానున్న మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఆర్పీఐ(ఏ)కు 12 సీట్లు కేటాయించాలని రాందాస్ అథవాలే డిమాండ్ చేశారు. అలాగే రాష్ట్ర మంత్రివర్గంలో కూడా ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు.కాగా, మరాఠా రిజర్వేషన్ అంశాన్ని మొదట లేవనెత్తింది తమ పార్టీనే అని అథవాలే తెలిపారు. ప్రత్యేక కేటగిరీ కింద మరాఠాలకు రిజర్వేషన్ కల్పించాలని సూచించారు. ఇతర వెనుకబడిన తరగతుల (ఓబీసీ) కింద వారిని చేర్చడం వల్ల ఆవర్గం నుంచి వ్యతిరేకత వస్తుందని అన్నారు. 'తమిళనాడు రిజర్వేషన్ విధానాన్ని మహారాష్ట్ర ప్రభుత్వం అధ్యయనం చేయాలి. ప్రతి ఏటా రూ. 8 లక్షల కంటే తక్కువ సంపాదిస్తున్న ఆర్థికంగా బలహీనంగా ఉన్న వర్గాలకు చెందిన మరాఠాలకు రిజర్వేషన్లు కల్పించాలి' అన్నారు. వక్ఫ్ (సవరణ) బిల్లు 2024కు తమ పార్టీ మద్దతు ఇచ్చిందని వెల్లడించారు.

## రాష్ట్రాలను అస్థిరపరిచే ఎత్తుగడ: ఎంపీ సందీప్ పాఠక్



**దిల్లీ:** ఒక దేశం ఒకే ఎన్నికకు కేంద్ర క్యాబినెట్ గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంపై ఆప్ ఎంపీ సందీప్ పాఠక్ కీలక వ్యాఖ్యలు చేశారు. కొద్ది రోజుల కిందట నాలుగు రాష్ట్రాలకు ఎన్నికలు ప్రకటించారని, కానీ కాషాయ పార్టీ మహారాష్ట్ర, జార?ండ్‌లను పక్కనపెట్టి కేవలం హరియాణ, జమ్ము కశ్మీర్ ఎన్నికలకే మొగ్గుచూపిందని అన్నారు. నాలుగు రాష్ట్రాల్లోనే వారు ఒకేసారి ఎన్నికలు జరిపించలేకుంటే దేశం మొత్తం మీద ఒకేసారి ఎన్నికలను వారు ఎలా నిర్వహిస్తారని చెప్పారు. ఓ రాష్ట్ర ప్రభుత్వం పూర్తి పదవీకాలం మనుగడ సాధించలేకపోతే ఏం చేయాలని ప్రశ్నించారు.ఆ రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధిస్తారా అని ఆప్ ఎంపీ ప్రశ్నించారు. రాష్ట్రాలను అస్థిరపరిచే ఎత్తుగడ కాక ఇది మరేంటని ఆయన నిలదీశారు. కాగా, జమిలి ఎన్నికల నిర్వహణకు లైన్ క్లియర్ అవుతోంది. వన్ నేషన్-వన్ ఎలక్షన్ ప్రక్రియకు ఇవాళ కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. శీతాకాల పార్లమెంట్ సమావే శాల్లో వన్ నేషన్-వన్ ఎలక్షన్ బిల్లును ప్రవేశపెట్టనున్నారు. మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ కమిటీ అందజేసిన రిపోర్టుకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఎట్టి పరిస్థితుల్లోనైనా జమిలి ఎన్నికలు నిర్వహించి తీరుతామని ఇటీవల కేంద్ర మంత్రి అమిత్ షా పేర్కొన్న విషయం తెలిసిందే. రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలోని కమిటీ వన్ నేషన్-వన్ ఎలక్షన్ ప్రతిపాదన చేసింది. సెప్టెంబర్ లో ఆ ప్యానెల్ ఏర్పాటైంది. లోక్‌సభ ఎన్నికలకు ముందే కోవింద్ ప్యానెల్ తన నివేదికను కేంద్ర ప్రభుత్వానికి అందజేసింది. న్యాయశాఖ ఆ రిపోర్టును ఇవాళ కేంద్ర క్యాబినెట్ ముందు ప్రవేశ పెట్టింది. వంద రోజుల మోదీసర్కార్ పాలనసందర్భంగా ఈ రిపోర్టును ముందుకు తీసుకువచ్చారు.

## హరియాణ ఎన్నికల్లో బీజేపీకి భంగపాటు తప్పదు




**దిల్లీ:** హరియాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి భంగపాటు తప్పదని కాంగ్రెస్ పార్టీ విజయం సాధించి ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని హరియాణ మాజీ సీఎం భూపీందర్ సింగ్ హుడా పేర్కొన్నారు. హరియాణ ప్రజలు కాషాయ సర్కార్‌ను సాగనంపి కాంగ్రెస్ సర్కార్‌కు పట్టం కట్టనున్నారని విశ్వాసం వ్యక్తం చేశారు. భూపీందర్ హుడా బుధవారం దిల్లీలో మీడియా ప్రతినిధులతో మాట్లాడారు.హరియాణ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం ఖాయమని, ప్రజలు మార్పు కోరుతున్నారని స్పష్టం చేశారు. కాగా, హరియాణ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఆ రాష్ట్ర ప్రజలపై కాంగ్రెస్ వరాల జల్లు కురిపించింది. ఏడు గ్యారంటీలతో మేనిఫెస్టోను రిలీజ్ చేసింది. కనీస మద్దతు ధరకు చట్టబద్దత సహా కులగణన చేపడతామని హామీ ఇచ్చింది. ఏడు గ్యారంటీలను కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే ప్రకటించారు.మహిళా సాధికారత కింద 18 నుంచి 60 ఏళ్ల వయసు ఉన్న ప్రతి మహిళకు నెలకు రూ. 2 వేలతో పాటు రూ. 500కే గ్యాస్ సిలిండర్లను ఇస్తామని ప్రకటించింది. అదేవిధంగా వృద్ధులు, వికలాంగులు, ఒంటరి మహిళలకు నెలకు రూ. 6 వేలు పింఛన్ ఇస్తామని తెలిపింది. 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, కుటుంబానికి రూ. 25 లక్షల వరకు ఉచితంగా వైద్య చికిత్సను అందిస్తామని హామీ ఇచ్చింది.

## గగన్‌యాన్, శుక్రయాన్ విస్తరణకు కేంద్ర కేబినెట్ ఆమోదం..




**దిల్లీ:** భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థకు కేంద్రం శుభవార్త చెప్పింది. ఇస్రో పంపిన ప్రతిపాదలకు కేంద్ర కేబినెట్ ఆమోదముద్ర వేసింది. చంద్రయాన్-4 మిషన్, గగన్‌యాన్, వీనస్ ఆర్బిటర్ మిషన్, ఎన్‌జీఎల్‌వీ వాహకనౌక ప్రాజెక్టులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ సందర్భంగా పలు ప్రాజెక్టులకు నిధులు సైతం కేటాయించింది. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన బుధవారం కేంద్ర కేబినెట్ సమావేశం జరిగింది. సమావేశం అనంతరం కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ మీడియాకు వివరాలు వెల్లడించారు. కేబినెట్ చంద్రయాన్-4 మిషన్‌కు ఆమోదం తెలిపిందని చెప్పారు. ఈ ప్రాజెక్టులు చంద్రుడి నుంచి రాళ్లు, మట్టిని భూమిపైకి తీసుకురానున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టు ఇస్రో 2026 నాటికి చేపట్టాలని భావిస్తున్నది. రెండు దశల్లో చంద్రయాన్-4 మిషన్‌ను నిర్వహిస్తుంది.రెండుదశల్లో భాగాలను నింగిలోకి పంపి.. ఆ తర్వాత స్పేస్‌లోనే కనెక్ట్ చేయనున్నారు. ల్యాండర్‌ను ఇస్రో నిర్మిస్తుండగా.. రోవర్‌ను జపాన్‌లో సిద్ధం చేస్తున్నారు. మిషన్‌లో భాగంగా చంద్రుడిపై మట్టి నమూనాలను సేకరించి.. తిరిగి భూమిపైకి చేరుకుంటుంది. ప్రాజెక్టు విజయవంతమైతే అంతరిక్షంలోనే స్పేస్ షటిల్‌ను రూపొందించిన దేశంగా భారత్ చరిత్ర లిఖించనున్నది. ఇక భారత్ గగన్ యాన్ ప్రాజెక్టును సైతం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నది. ఇందులో భాగంగా వ్యోమగాములను నింగిలోకి పంపేందుకు ప్లాన్ చేస్తున్నది. ఇందు కోసం వ్యోమగాములను సైతం ఎంపిక చేసిన శిక్షణ ఇస్తున్న విషయం తెలిసిందే. దాంతో పాటు వీనస్ ఆర్బిటర్ మిషన్‌కు సైతం కేంద్రం ఆమోదం తెలిపింది. భూమికి దగ్గరలో ఉన్న వీనస్‌పై అధ్యయనం చేయనున్నది. ఇందులో వీనస్ వాతావరణంపై పరిశోధనలు జరుపనున్నది. తర్వాతి తరం లాంచ్ వెహికల్‌కు సైతం కేబినెట్ ఆమోదం తెలిపింది. తక్కువ భూకక్ష్యలో 30 టన్నుల పేలోడ్‌ను ప్రవేశపెట్టడం దీని లక్ష్యం.

## జమ్ముకశ్మీర్ తొలిదశ పోలింగ్‌లో 58.85 శాతం ఓటింగ్.. కిష్త్వార్‌లో అత్యధికం, పుల్వామాలో అత్యల్పం



**శ్రీనగర్:** కేంద్ర పాలిత ప్రాంతం జమ్ముకశ్మీర్‌లో బుధవారం జరిగిన తొలి విడత పోలింగ్‌లో 58.85 శాతం ఓటింగ్ నమోదైంది. కిష్త్వార్‌లో అత్యధికం, పుల్వామాలో అత్యల్పంగా పోలింగ్ జరిగింది. కశ్మీర్‌లోని నాలుగు జిల్లాలైన అనంత్‌నాగ్, పుల్వామా, షోపియాన్, కుల్గామ్‌లోని 16 స్థానాలు, జమ్ములోని మూడు జిల్లాలైన దోడా, రాంబన్, కిష్త్వార్‌లోని 8 స్థానాల్లో బుధవారం తొలి దశ కింద పోలింగ్ జరిగింది. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన ఓటింగ్ సాయంత్రం 6 గంటల వరకు కొనసాగింది. తొలి దశలో 58.85 శాతం ఓటింగ్ నమోదైనట్లు ఎన్నికల సంఘం (ఈసీ) తెలిపింది. కిష్త్వార్ జిల్లాలో అత్యధికం, పుల్వామాలో అత్యల్పంగా ఓటింగ్ నమోదైనట్లు తెలిపింది. సాయంత్రం 5 గంటల వరకు జిల్లాల వారీగా ఓటింగ్ శాతాన్ని ఈసీ పేర్కొంది. కిష్త్వార్‌లో 77.23 శాతం, దోడాలో 69.33 శాతం, రాంబన్‌లో 67.71 శాతం, కుల్గామ్‌లో 59.62 శాతం, అనంతనాగ్‌లో 54.17శాతం, షోపియాన్‌లో 53.64 శాతం, పుల్వామాలో 43.87 శాతం ఓటింగ్ నమోదైనట్లు వివరించింది.కాగా, జమ్ము కశ్మీర్‌కు స్వయంప్రతిపత్తిని కల్పించిన ఆర్టికల్ 370ను 2019 ఆగస్టులో కేంద్ర ప్రభుత్వం రద్దు చేసింది. అలాగే ఆ రాష్ట్రాన్ని జమ్ముకశ్మీర్, లధక్ కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజించింది. డీలిమిటేషన్ కసరత్తు తర్వాత కశ్మీర్‌కు 47, జమ్ముకు 43 అసెంబ్లీ స్థానాలు కేటాయించారు. పదేళ్ల తర్వాత మొత్తం 90 అసెంబ్లీ నియోజక వర్గాలకుగాను తొలి దశలో 24 నియోజక వర్గాల్లో బుధవారం పోలింగ్ నిర్వహించారు.

## కేరళ వ్యక్తికి మంకీ పాక్స్.. దేశంలో రెండో కేసు





**తిరువనంతపురం:** దేశంలో మంకీ పాక్స్ రెండో కేసు నమోదైంది. కేరళ వ్యక్తికి ఈ వైరస్ సోకినట్లు బుధవారం నిర్ధారణ అయ్యింది. ఆ రోగిని ఐసొలేషన్‌లో ఉంచి చికిత్స అందిస్తున్నారు. ఎం పాక్స్‌కు సంబంధించిన ప్రోటోకాల్స్‌ను పాటిస్తున్నట్లు కేరళ ప్రభు త్వం తెలిపింది. మలప్పురానికి చెందిన 38 ఏళ్ల వ్యక్తి యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) నుంచి తిరిగి వచ్చిన తర్వాత ఎంపాక్స్ లక్షణాలు కనిపించాయని ఆరోగ్య మంత్రి వీణా జార్జ్ తెలిపారు. ఆ వ్యక్తి ఇంట్లోనే ఐసొలేషన్‌లో ఉన్నట్లు చెప్పారు. ఆ తర్వాత ప్రభుత్వ మంజేరి మెడికల్ కాలేజీ ఆసుపత్రిలో అడ్మిట్ అయ్యాడని అన్నారు. అతడికి వైద్య పరీక్షలు నిర్వ హించగా ఎంపాక్స్ పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యిందని వెల్లడించారు. ఈ లక్షణాలు గమనించిన వారు ఆరోగ్య శాఖకు తెలియజేయడంతోపాటు వెంటనే చికిత్స పొందాలని ప్రజలను కోరారు. కాగా, తొమ్మిది రోజుల కిందట దేశంలో మంకీ పాక్స్ తొలి కేసు నమోదైంది. పశ్చిమ ఆఫ్రికా నుంచి తిరిగి వచ్చిన ఢిల్లీ యువకుడికి ఈ వైరస్ సోకింది. దీంతో అతడ్ని ప్రత్యేక ఐసొలేషన్‌లో ఉంచి చికిత్స అందిస్తున్నారు.మరోవైపు ప్రజలు ఎలాంటి భయాందోళన చెందాల్సిన అవసరం లేదని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. ఈ వైరస్ విస్తృతంగా వ్యాపించే సూచనలు లేవని పేర్కొంది. మంకీ పాక్స్ వైరస్ 'క్లాడ్ 2' ఉనికిని దేశంలో గుర్తించినట్లు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ తెలిపింది. 2022 జూలైలో దేశంలో నమోదైన 30కేసులు మాదిరిగానే ప్రస్తుతం వైరస్ ఉనికి ఉందని పేర్కొంది.

## జమిలి ఎన్నికలపై యూటర్న్ తీసుకోక తప్పదు




**దిల్లీ:** జమిలీ ఎన్నికల నిర్వహణపై కాంగ్రెస్ నేత సచిన్ పైలట్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఉత్తరాది రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా వాస్తవ అంశాల నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకే జమిలి ఎన్నికలను తెరపైకి తీసుకొచ్చారని ఆరోపించారు. ఎన్నో అంశాలను కేంద్ర ప్రభుత్వం చేపట్టాల్సి ఉన్నా పార్లమెంట్‌లో తగినంత సంఖ్యాబలం లేకపోవడంతో యూటర్న్ తీసుకోవాల్సి వచ్చిందని అన్నారు. జమ్ము కశ్మీర్‌లో ఈరోజు అసెంబ్లీ ఎన్నికల తొలి దశ పోలింగ్ జరిగిందని, ఇక్కడ బీజేపీ పూర్తిగా వెనుకబడిందని, హరియాణలో సైతం కాషాయ పార్టీది ఇదే పరిస్థితని పేర్కొన్నారు. ప్రస్తుత పార్లమెంటరీ వ్యవస్థలో జమిలి ఎన్నికలు సాధ్యమయ్యే పని కాదని, క్యాబినెట్‌లో ఆమోదించినంత మాత్రాన అమలు అంత సులభం కాదని వ్యాఖ్యానించారు. వీరు గత నిర్ణయాలపై యూటర్న్ తీసుకున్న తరహాలోనే జమిలి ఎన్నికలపైనా యూటర్న్ తీసుకుంటారని అన్నారు. కాగా, జమిలి ఎన్నికల నిర్వహణకు లైన్ క్లియర్ అవుతోంది. వన్ నేషన్-వన్ ఎలక్షన్ ప్రక్రియకు ఇవాళ కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లో వన్ నేషన్-వన్ ఎలక్షన్ బిల్లును ప్రవేశపెట్టనున్నారు.మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ కమిటీ అందజేసిన రిపోర్టుకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఎట్టి పరిస్థితుల్లోనైనా జమిలి ఎన్నికలు నిర్వహించి తీరుతామని ఇటీవల కేంద్ర మంత్రి అమిత్ షా పేర్కొన్న విషయం తెలిసిందే.రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలోని కమిటీ వన్ నేషన్-వన్ ఎలక్షన్ ప్రతిపాదన చేసింది. సెప్టెంబర్‌లో ఆ ప్యానెల్ ఏర్పాటైంది. లోక్‌సభ ఎన్నికలకు ముందే కోవింద్ ప్యానెల్ తన నివేదికను కేంద్ర ప్రభుత్వానికి అందజేసింది. న్యాయశాఖ ఆ రిపోర్టును ఇవాళ కేంద్ర క్యాబినెట్ ముందు ప్రవేశపెట్టింది.

# రూ.31,000 కోట్లతో.. భారత్- మయన్మార్ సరిహద్దుకు కంచె




**న్యూదిల్లీ:** కేంద్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకున్నది. 1,643 కిలోమీటర్ల మేర విస్తరించిన భారత్- మయన్మార్ మధ్య ఉన్న అంతర్జాతీయ సరిహద్దుకు కంచె వేయనున్నది. దీని కోసం రూ. 31,000 కోట్లు ఖర్చు చేయనున్నది. ఆయుధాలు, మందుగుండు సామాగ్రి, మాదక ద్రవ్యాల అక్రమ రవాణాతోపాటు చొరబాట్లకు ఈ సరిహద్దు పరిపాటిగా మారింది. ఈ నేపథ్యంలో వీటిని నియంత్రించేందుకు 1,643 కిలోమీటర్ల భారత్- మయన్మార్ సరిహద్దులో ఫెన్సింగ్, రోడ్ల నిర్మాణానికి క్యాబినెట్ భద్రతా కమిటీ ఆమోదం తెలిపినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. మణిపూర్‌లో భద్రతా పరిస్థితిని కేంద్ర హోంమంత్రి అమిత్ షా క్రమం తప్పకుండా సమీక్షిస్తున్నారని, అవసరమైన చర్యలు తీసుకుంటున్నారని ఆ వర్గాలు వెల్లడించాయి.కాగా, మణిపూర్, మిజోరాం, నాగాలాండ్, అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రాల బోర్డర్‌లో భారత్-మయన్మార్ సరిహద్దు ఉంది. 2018లో అమలు చేసిన భారత్ ఈస్ట్ పాలసీలో భాగంగా సరిహద్దుకు సమీపంలో నివసించే ప్రజలు ఎలాంటి పత్రాలు లేకుండా ఒకరి భూభాగంలోకి మరొకరు 16 కిలోమీటర్ల పరిధి వరకు వెళ్లవచ్చు. అయితే మయన్మార్‌లో ఆర్మీ పాలన, సంఘర్షణల వల్ల ఆ దేశ ప్రజలు, గత ప్రభుత్వ అనుకూల సైనికులు, అధికారులు భారత్‌లోకి చొరబడుతున్నారు. ఈ నేపథ్యంలో భారత్-మయన్మార్ ఫ్రీ మూవ్‌మెంట్ రెజీమ్ (ఎఫ్ఎంఆర్)ను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసింది.మరోవైపు మణిపూర్‌లో జాతి హింసకు ఈ చొరబాట్లు మూల కారణమని కేంద్ర హోంమంత్రి అమిత్ తెలిపారు. ఈ నేపథ్యంలో ఈ ప్రాంతంలోని సరిహద్దులో 30 కిలోమీటర్ల మేర కంచె నిర్మాణం పూర్తి చేసినట్లు మంగళవారం చెప్పారు. మోరే సమీపంలో ఇప్పటికే దాదాపు 10 కిలోమీటర్ల ఫెన్సింగ్ పూర్తైందని అన్నారు. మణిపూర్‌లోని ఇతర ప్రాంతాల సరిహద్దులో మరో 21 కిలోమీటర్ల మేర కంచె నిర్మాణ పనులు జరుగుతున్నాయని భద్రతా సమీక్ష అనంతరం వివరించారు.



# గంగూలీకి ఆన్‌లైన్ వేధింపులు.. యూట్యూబర్‌పై కేసు

**విశ్వంభర (క్రీడావిభాగం):** భారత పురుషుల జట్టు మాజీ కెప్టెన్ సౌరభ్ గంగూలీ ఆన్‌లైన్ వేధింపుల బారిన పడ్డాడు. ఓ యూట్యూబర్ దాదాను టార్గెట్ చేస్తూ సోషల్ మీడియాలో అభ్యంతరకర వీడియోలు పెట్టాడు. దాంతో, గంగూలీ సదరు యూట్యూబర్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బీసీసీఐ మాజీ అధ్యక్షుడు అయిన గంగూలీపై చెత్త వాగుతున్న ఆ యూట్యూబర్ పేరు మృణ్‌మోయ్ దాస్. దేశవ్యాప్తంగా సంచనం సృష్టించిన కోల్‌కతా ట్రైనీ డాక్టర్ హత్య కేసుపై తాను చేసిన కామెంట్లను మృణయ్‌మోయ్ వక్రీకరించాడని పేర్కొన్న గంగూలీ అతడిపై చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరాడు. 'సౌరభ్ గంగూలీ లక్ష్యంగా ఈ యూట్యూబర్ సోషల్ మీడియా ఖాతాల్లో అభ్యంతరకర పోస్ట్‌లు పెట్టాడు. దాదా గౌరవానికి, ప్రతిష్ఠకు భంగం కలిగించే విధంగా అసభ్యకరమైన భాషను ఉపయోగించాడు. అంతేకాదు గంగూలీపై దారుణమైన కామెంట్లు చేశాడు. అతడి వీడియోల్లోని కంటెంట్ వ్యక్తిగత గౌరవానికి భంగం కలిగించేలా ఉంది' అని ఫిర్యాదులో పోలీసులు వెల్లడించారు. అసలేం జరిగిందంటే..? ఆర్జీకార్ వైద్య కళాశాలకు చెందిన 22 ఏండ్ల ట్రైనీ డాక్టర్ హత్యాచారం కేసు దేశాన్ని కదిలించిన విషయం తెలిసిందే. ఈ కేసు గురించి గంగూలీ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. 'ఇలాంటి సంఘటనలుఎక్కడైనా జరుగుతాయి. దురదృష్టవశాత్తూ దవాఖానలో ఈ సంఘటన జరిగింది. కాబట్టి ప్రతిచోట ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం చాలా అవసరం' అని దాదా అన్నాడు.అంతే.. సోషల్ మీడియాలో గంగూలీపై తీవ్ర విమర్శలు వచ్చాయి. ఆ దెబ్బతో భారత సారథి నాలుక కరుచుకున్నాడు. తన వ్యాఖ్యల్ని మీడియా, పత్రికలు తప్పుగా అర్థం చేసుకున్నాయంటూ వివరణ ఇచ్చాడు. అయితే.. వైద్యురాలి హత్యపై గంగూలీ పోస్ట్‌ను ఆయుధంగా చేసుకున్న యూట్యూబర్ మృణయ్‌మోయ్ ఇక రెచ్చిపోయాడు. గంగూలీ బతికి ఉండగానే అతడి జీవితచరిత్రను తెరకెక్కించడం అవసరమా?

## ఆస్ట్రేలియాపై ఊచకోతతో టీ20ల్లో లివింగ్‌స్టోన్ కు
# నంబర్ 1 ర్యాంక్



**విశ్వంభర (క్రీడావిభాగం):** ఆస్ట్రేలియాపై చితక్కొట్టిన ఇంగ్లండ్ ఆల్‌రౌండర్ లియామ్ లివింగ్‌స్టోన్ ఐసీసీ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానం కైవసం చేసుకున్నాడు. స్వదేశంలో ఆసీస్ బౌలర్లను ఊచకోత కోసిన లివింగ్‌స్టోన్ బంతితోనూ మ్యాజిక్ చేశాడు. 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డు గెలుపొందిన అతడు టీ20 ఆల్‌రౌండర్ల జాబితాలో రాకెట్‌లా దూసుకొచ్చాడు. నంబర్ 1 స్థానంలో ఉన్న 'హల్క్' మార్కస్ స్టోయినిస్ ను రెండో స్థానంలోకి నెట్టేశాడు. ఇంగ్లండ్, ఆస్ట్రేలియా మధ్య ముగిసిన మూడు టీ20ల సిరీస్‌లో లివింగ్‌స్టోన్ రెచ్చిపోయాడు. మొదటి టీ20లో మొదట 27 బంతుల్లో 37 రన్స్ కొట్టిన అతడు.. అనంతరం బంతితోనూ చెలరేగాడు. ఆసీస్ బ్యాటర్లను బుట్టలో వేసుకొని 322 గణాంకాలతో ఆకట్టుకున్నాడు. ఇక రెండో టీ20లోనూ ఈ ఆల్‌రౌండర్ కంగారూలను వణికించాడు. తొలుత 47 బంతుల్లోనే 87 పరుగులు రాబట్టిన అతడు ఆ తర్వాత రెండు కీలక వికెట్లు తీసి 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డుకి ఎంపికయ్యాడు. నిర్ణయాత్మక మూడో టీ20 వర్షం కారణంగా రద్దు కావడంతో ఇరుజట్లు సిరీస్‌ను పంచుకున్నాయి. టీ20ల్లో విధ్వంసక ఇన్నింగ్స్‌లు పెట్టింది పేరైన లివింగ్‌స్టోన్ 2017లో జట్టులోకి వచ్చాడు. అప్పటి నుంచి ఇప్పటివరకూ అతడు 49 టీ20లు ఆడాడంతే. పొట్టి ఫార్మాట్‌లో విజయవంతం కావడంతో ఆ తర్వాత వన్డేల్లో అవకాశం దక్కించుకున్నాడు. ఇంగ్లండ్ తరఫున టీ20ల్లో రాణిస్తున్న లివింగ్‌స్టోన్ ఫ్రాంచైజీ క్రికెట్‌లో అదరగొడుతున్నాడు.

**11.50 కోట్ల భారీ ధర..**

సుడిగాలి ఇన్నింగ్స్‌లతో మ్యాచ్ స్వరూపాన్నే మార్చేయగల లివింగ్‌స్టోన్ ఐపీఎల్‌లో పాపులర్ అయ్యాడు. 2021లో రాజస్థాన్ రాయల్స్ కు ఆడిన ఈ ఆల్‌రౌండర్ ఆ తర్వాత పంజాబ్ కింగ్స్‌కు మారాడు. 2022 వేలంలో పంజాబ్ అతడిని రూ.11.50 కోట్ల భారీ ధరకు కొన్నది. అయితే.. లివింగ్‌స్టోన్ ఒకటి రెండు మ్యాచుల్లో మినహా పెద్దగ రాణించలేదు.

# పంజాబ్ కింగ్స్ కోచ్‌గా పాంటింగ్..




**విశ్వంభర (క్రీడావిభాగం):** ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో రికీ పాంటింగ్ మళ్లీ హెడ్‌కోచ్‌గా కనిపించనున్నాడు. ఆస్ట్రేలియాకు మూడు వరల్డ్ కప్‌లు అందించిన ఈ దిగ్గజ కెప్టెన్ పంజాబ్ కింగ్స్ ఫ్రాంచైజీకి కోచ్‌గా నియమితులయ్యాడు. 17వ సీజన్ చాంపియన్ తర్వాత ఢిల్లీ క్యాపిటల్స్ ను వీడిన పాంటింగ్ ఇప్పుడు పంజాబ్ ఐపీఎల్ ట్రోఫీ కలను నిజం చేసే పనిలో నిమగ్నం కానున్నాడు. కొత్త ఫ్రాంచైజీకి కోచ్‌గా వెళ్తున్న పాంటింగ్ ఎంతో సంతోషంగా ఉందంటున్నాడు.'నన్ను కొత్త హెడ్‌కోచ్‌గా తీసుకున్న పంజాబ్ కింగ్స్ ఫ్రాంచైజీకి కృతజ్ఞతలు. ఈ కొత్త సవాల్‌ను స్వీకరించేందుకు నేను ఎంతో ఉత్సాహంతో ఉన్నా. పంజాబ్ జట్టు ప్రణాళికల గురించి యాజయాన్యంతో జరిపిన చర్చలు చాలా సంతృప్తినిచ్చాయి. ఫ్రాంచైజీపై నమ్మకం పెట్టుకున్న అభిమానుల నమ్మకాన్ని నిజం చేయాల్సిన సమయం వచ్చేసింది. ఇకపై పంజాబ్ కింగ్స్ ఆటలో మార్పు చూస్తారని మేము మీకు ప్రామిస్ చేస్తున్నాం' అని పాంటింగ్ తెలిపాడు.ఐపీఎల్ ట్రోఫీ కోసం ఏండ్లుగా నిరీక్షిస్తున్న పంజాబ్ కింగ్స్‌కు పాంటింగ్ అనుభవం బలం కానుంది. ఏడు సీజన్లలో ఓసారి ఢిల్లీని ఫైనల్ చేర్చిన ఈ ఆసీస్ మాజీ సారథి ప్రీతి జింటా టీమ్ రాత మార్చేందుకు రెడీ అవుతున్నాడు. తొలుత అతడు కోల్‌కతా నైట్ రైడర్స్ కొత్త మెంటార్‌గా వెళ్తాడనే వార్తలు వినిపించాయి.కానీ, పంజాబ్ యాజమాన్యం జూలై 25వ తేదీనే పాంటింగ్‌ను సంప్రందించింది. ఢిల్లీ క్యాపిటల్స్ తనపై వేటు వేశాక 'నేను మళ్లీ ఐపీఎల్‌లో కోచింగ్ చేసేందుకు సిద్ధంగా ఉన్నానని ఈ ఆసీస్ లెజెండ్ ప్రకటించాడు. అనుకున్నట్టుగానే పాంటింగ్ మళ్లీ ఐపీఎల్‌లో కోచ్‌గా తన ముద్ర వేసేందుకు సిద్ధమవుతున్నాడు.

# నిప్పులు చెరిగిన ఫారూఖీ.. వరల్డ్ కప్ రన్నరప్ విలవిల



**విశ్వంభర (క్రీడావిభాగం):** టీ20 వరల్డ్ కప్‌లో మాజీ చాంపియన్లకు షాకిచ్చిన అఫ్గనిస్థాన్ మరో సంచలనం నమోదు చేసింది. అదే జోరును కొనసాగిస్తూ వన్డేల్లో తొలిసారి దక్షిణాఫ్రికాను ఆలౌట్ చేసింది. షార్జా వేదికగా జరుగుతున్న తొలి వన్డేలో పేసర్ ఫజల్ హక్ ఫారూఖీ(4/35), స్పిన్నర్ అల్లాహ్ ఘజన్‌ఫర్(3/20), విజృంభణతో వరల్డ్ కప్ రన్నరప్ అయిన సఫారీ జట్టు 106 పరుగులకే కుప్పకూలింది. టాప్ ఆటగాళ్లంతా బ్యాట్లు ఎత్తేసిన చోట వియాన్ మల్డర్(52) అర్ధ శతకంతో ఒంటరి పోరాటం చేసి జట్టు పరువు కాపాడాడు. లేదంటే ప్రొటిస్ జట్టు వంద లోపే ఆలౌటయ్యేది. తాత్కాలికంగా వన్డే కెప్టెన్సీ పగ్గాలు అందుకున్న ఎడెన్ మర్క్‌రమ్ కు పెద్ద షాక్. షార్జా క్రికెట్ స్టేడియంలో అఫ్గనిస్థాన్ బౌలర్లు రెచ్చిపోయారు. పవర్ ప్లేలోనే ఫారూఖీ తాను ఎంత ప్రమాదకరమో మరోసారి చాటాడు. డేంజరస్ రీజా హెండ్రిక్స్(9)తో పాటు టోనీ డి జోర్జి(11), ఎడెన్ మర్క్‌రమ్(2)లను చకాచకా పెవిలియన్ పంపాడు. యువ స్పిన్నర్ అల్లాహ్ ఘజన్‌ఫర్(3/20) సైతం వికెట్ల వేట కొనసాగించడంతో సఫారీ జట్టు పేకమేడను తలపించింది.ఫారూఖీ, అల్లాహ్‌లు నిప్పులు చెరగగా 29-4 నుంచి 75 కే 8 వికెట్లు పడడంతో మర్క్‌రమ్ సేన కోలుకోలేకపోయింది. అయితే.. వియన్ మల్డర్(52) అసమాన పోరాటంతో స్కోర్‌బోర్డును కదిలించాడు. తొందరపడి వికెట్ పారేసుకోకుడా హాఫ్ సెంచరీతో దక్షిణాఫ్రికాకు గౌరవ ప్రదమైన స్కోర్ అందించాడు. సఫారీ ఇన్నింగ్స్‌కు ఇరుసులా మారిన మల్డర్‌ను ఫారూఖీ బౌల్డ్ చేసి అఫ్గన్ జట్టుకు మరోసారి పెద్ద బ్రేకిచ్చాడు. మిస్టరీ స్పిన్నర్ రషీద్ ఖాన్(2/30) సైతం ఓ చేయి వేయగా దక్షిణాఫ్రికా ఆలౌటయ్యింది.

# సొంతగడ్డపై మెండిస్ తొలి శతకం



**విశ్వంభర (క్రీడావిభాగం):** సుదీర్ఘ ఫార్మాట్‌లో ప్రకంపనలు సృష్టిస్తున్న కమిందు మెండిస్(114) మరో సెంచరీ బాదేశాడు. స్వదేశంలో న్యూజిలాండ్ బౌలర్లను చీల్చి చెండాడుతూ టెస్టుల్లో శతకంతో మెరిశాడు. బ్యాటింగ్ ఆర్డర్‌లో రెండు స్థానాలు ముందు వచ్చినా తన విధ్వంసంలో తేడా లేదంటూ మెండిస్ వీరకొట్టుడు కొట్టాడు. తద్వారా సొంతగడ్డపై మూడంకెల స్కోర్ కలను నిజం చేసుకున్నాడు.గాలే మైదానంలో ఆట ఆరంభంలోనే షాక్ తిన్న శ్రీలంకను కుశాల్ మెండిస్(50)తో కలిసి కమిందు ఆదుకున్నాడు. సెంచరీ భాగస్వామ్యంతో పర్యాటక జట్టు బౌలర్లను విసిగించాడు. 145 బంతుల్లోనే సెంచరీకి చేరువైన మెండిస్‌కు సొంత ప్రేక్షకులు అభినందనలు తెలిపారు. ఈ ఫీట్‌తో అత్యంత వేగంగా నాలుగు శతకాలు బాదిన లంక ఆటగాడిగా మెండిస్ రికార్డు నెలకొల్పాడు. ఈ యంగ్‌స్టర్ 11వ ఇన్నింగ్స్‌లోనే 4వ టెస్టు సెంచరీతో ఔరా అనిపించాడు.

**తొలి సెషన్‌లోనే ఆవిరి**

ఇంగ్లండ్‌పై చారిత్రాత్మక విజయం నమోదు చేసిన శ్రీలంక సొంతగడ్డపై మాత్రం తడబడింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న లంక ఆనందం తొలి సెషన్‌లోనే ఆవిరైంది. కివీ యువ పేసర్ విలియం ఓరూర్కే ధాటికి ఓవల్ శతక హీరో పథుమ్ నిశాంక(27)తో పాటు దిముత్ కరుణరత్నే(2), దినేశ్ చండీమాల్(30), ఆంజెలో మాథ్యూస్(36)లు చేతులెత్తేసిన చోట కమిందు మెండిస్(114) ఖతర్నాక్ ఇన్నింగ్స్ ఆడాడు.క్రీజులో కుదురుకున్నాక తనదైన షాట్లతో అలరించిన ఈ యువకెరటం అద్భుత శతకంతో చెలరేగాడు. ఒకదశలో 178కే సగం కోల్పోయి ఆలౌట్ ప్రమాదంలో పడిన లంకను ఒడ్డున పడేశాడు. కుశాల్ మెండిస్(50)తో కలిసి పట్టుదలగా ఆడి సెంచరీ భాగస్వామ్యంతో జట్టు స్కోర్ 300 దాటించాడు. ఈ ఇద్దరి పోరాటంతో మొదటి రోజు ఆట ముగిసే సరికి లంక మొదటి ఇన్నింగ్స్‌లో 7 వికెట్ల నష్టానికి 302 పరుగులు చేసింది.

# పాకిస్తాన్‌ను వైట్ వాష్ చేసిన బంగ్లాదేశ్


**విశ్వంభర (క్రీడావిభాగం):** పసికూనగా అంతర్జాతీయ క్రికెట్‌లో అడుగుపెట్టిన బంగ్లాదేశ్ ఇప్పుడు అనామక జట్టు కాదు. ఒకప్పుడు అడపాదడపా వన్డేలు, టీ20ల్లో సంచలన విజయాలకే పరిమితమైన బంగ్లా ఈ మధ్య నిలకడగా రాణిస్తోంది. పెద్ద జట్లకు సైతం షాకిస్తూ తమను తక్కువ అంచనా వేయొద్దని హెచ్చరికలు పంపుతోంది. ఇక సుదీర్ఘ ఫార్మాట్‌లో ఆసియా జట్టు పులిలా గాండ్రిస్తోంది. న్యూజిలాండ్ ను వాళ్ల సొంతగడ్డపైనే మట్టికరిపించి చరిత్ర సృష్టించిన బంగ్లాదేశ్.. తాజాగా పాకిస్థాన్ ను వైట్‌వాష్ చేసేసింది. అందకనే నజ్ముల్ హుసేన్ శాంటో నేతృత్వంలోని బంగ్లా ఇప్పుడు ఎంతో ప్రమాదకారి.పాక్‌పై విజయోత్సాహంతో భారత పర్యటనకు వచ్చిన శాంటో సేన సంచలన విజయంపై కన్నేసింది. అందుకనే టెస్టు సిరీస్‌లో బంగ్లాదేశ్‌ను లైట్ తీసుకోమని, బహు పరాకుగా ఉంటామని భారత సారథి రోహిత్ శర్మ ఇప్పటికే చెప్పేశాడు. ఎందుకంటే రెండేండ్ల క్రితం టీమిండియాను ఓటమి అంచున నిలిపిన బంగ్లాదేశ్‌ను అతడు మర్చిపోలేదు.



# అక్టోబర్‌లో బ్యాంకులకు 12 రోజులు మూసివేత..

**విశ్వంభర (బిజినెస్):** రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అక్టోబర్ మాసానికి సంబంధించిన సెలవుల జాబితాను విడుదల చేసింది. దాదాపు 12 రోజులపాటు బ్యాంకులు మూతపడనున్నాయి. బ్యాంకుల్లో ఏవైనా పనులు ఉంటే ముందస్తుగా చేసుకోవడం మంచిది. లేకపోతే ఇబ్బందులుపడే ఛాన్స్ ఉంటుంది. అక్టోబర్‌లో గాంధీ జయంతి, బతుకమ్మ పండుగ, దసరా శరన్నవరాత్రులు, కర్వాచౌత్, ధన్‌తేరాస్, దీపావళి పండుగల సందర్భంగా సెలవులు రానున్నాయి. పండుగలు, ప్రత్యేక రోజులు, శనివారాలు.. ఆదివారాల్లో కలిపి 12 రోజులు బ్యాంకులకు సెలవులు పడనున్నాయి. అయితే, రాష్ట్రాల వారీగా సెలవుల్లో మార్పులు ఉంటాయి. ఆయా రాష్ట్రాల్లో పండుగలకు సెలవులు ఉంటాయి. అలాగే, రెండు, నాల్గో శనివారాలతో పాటు ఆదివారాలు దేశవ్యాప్తంగా బ్యాంకులు మూతపడే విషయం తెలిసిందే.




## టికెట్ బుకింగ్, ట్రాకింగ్ కోసం త్వరలో
# సూపర్ యాప్!

**విశ్వంభర (బిజినెస్):** రైలులో ప్రయాణానికి తప్పనిసరిగా టికెట్ కావాల్సిందే. టికెట్ల బుకింగ్ కోసం ఐఆర్‌సీటీసీకి ఉపయోగిస్తున్నారు. అయితే, రైల్వే ప్రయాణికులకు కోసం పలు రకాల యాప్స్‌ను ఉపయోగిస్తున్నది. అయితే, రైల్వే అన్నిరకాల సేవలు అందించేందుకు సరికొత్త సూపర్ యాప్‌ను కేంద్రం తీసుకువస్తుంది. ఇందులో అన్ని రైల్వేసేవలు అందుబాటులోకి రానున్నాయి. రైలు ప్రయాణాన్ని సులభతరం చేసేందుకు కేంద్ర కసరత్తు చేస్తున్నది. ఇందులో భాగంగా సరికొత్తగా సూపర్ యాప్‌ని రూపొందిస్తున్నట్లు కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ గతంలో ప్రకటించాయి. ఇందులోని అన్ని సేవలు ఈ యాప్‌లో ఉంటాయని చెప్పారు. రైలు టికెట్ బుకింగ్ కోసం ఐఆర్‌సీటీసీ యాప్, వెబ్‌సైట్‌ని ఉపయోగిస్తున్నారు. అలాగే, రైలు స్టేటస్‌ని ట్రాక్ చేసేందుకు, పీఎన్‌ఆర్ స్టేటస్‌ని చూసేందుకు వివిధ రకాల యాప్‌ని ఉపయోగిస్తున్న విషయం తెలిసిందే. అయితే, రైల్వేశాఖకు సంబంధించి టికెట్స్ బుకింగ్, పీఎన్‌ఆర్ స్టేటస్, ట్రాకింగ్ స్టేటస్ కోసం యాప్స్‌ని ఉపయోగించడం ఇబ్బందికరంగా మారింది.ఈ సమస్యను అధిగమించేందుకు ప్రభుత్వం సరికొత్త సూపర్ యాప్‌ని తీసుకురాబోతున్నది. ఇకపై ఈ యాప్‌లోనే టికెట్స్ బుకింగ్, పీఎన్‌ఆర్ స్టేటస్, ట్రెయిన్ ట్రాకింగ్ చేసేందుకు వీలుంటుంది. అయితే, రైల్వే మౌలిక సదుపాయాలను మెరుగుపరిచేందుకు కృషి చేస్తున్నట్లు ఇటీవల రైల్వేశాఖ మంత్రి పేర్కొన్నారు. గత దశాబ్దల కాలంగా రైల్వేలను అత్యాధునికంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం దృష్టి సారిస్తోందన్నారు. అలాగే, సాంకేతికంగా అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. ఇక ప్లాట్‌ఫారమ్ నుంచి జనరల్ టికెట్ వరకు ఆన్‌లైన్ మోడ్‌లో కొనుగోలు చేసే వీలుంటుంది. అదే సమయంలో రైల్వే భద్రతపై ప్రభుత్వం పూర్తిగా దృష్టి సారిస్తోంది. దీంతో రైలు ప్రమాదాల సంఖ్య తగ్గుముఖం పట్టిందని మంత్రి చెప్పారు. ప్రభుత్వం స్వదేశీ ఆటోమేటిక్ ట్రైన్ ప్రొటెక్షన్ (ATP) వ్యవస్థను అమలు చేస్తున్నది. దీన్ని 'కవచ్'గా పిలుస్తుంటారు. ప్రస్తుతం 10వేలు కవచ్ సిస్టమ్‌లను ఏర్పాటు చేసింది రైల్వేశాఖ.

# మదుపరుల అప్రమత్తత..
## గరిష్ఠాలకు పెరిగి.. నష్టాల్లోకి జారుకున్న స్టాక్ మార్కెట్లు



**విశ్వంభర (బిజినెస్):** దేశీయ ఈక్విటీ మార్కెట్లు స్వల్ప నష్టాల్లో ముగిశాయి. యూఎస్ ఫెడ్ రిజర్వ్ సమావేశం నేపథ్యంలో మదుపరులు అప్రమత్తంగా వ్యవహరించారు. కీలమైన వడ్డీ రేట్లను తగ్గించనున్న నేపథ్యంలో మదుపరులు అప్రమత్తత పాటించడంతో ఉదయం మార్కెట్లు నష్టాల్లోకి జారుకున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లలోని ప్రతికూల ప్రభావంతో సూచీలు ఉదయం ఫ్లాట్‌గా ముగిశాయి. ఆ తర్వాత పెట్టుబడులు పెరిగాయి. దీంతో మార్కెట్లు లాభాల్లోకి దూసుకెళ్లాయి. ఈ క్రమంలో మార్కెట్లు సరికొత్త గరిష్ఠాలను నమోదు చేశాయి. సెన్సెక్స్ తొలిసారిగా 83,326.38 పాయింట్ల గరిష్ఠాన్ని తాకింది. ఈ స్థాయికి సెన్సెక్స్ చేరడం ఇదే తొలిసారి. ఆ తర్వాత ఐటీ, ఎనర్జీ రంగాల్లో స్టాక్స్ అమ్మకాలతో మార్కెట్లు ఒక్కసారిగా ఒత్తిడికి గురైన నష్టాల్లోకి వెళ్లాయి. సెన్సెక్స్ ఉదయం 83,037.13 పాయింట్ల వద్ద ప్రారంభమైంది. ఇంట్రాడేలో 82,700.63 పాయింట్ల కనిష్ఠానికి చేరింది. చివరకు 131.43 పాయింట్ల నష్టంతో 82,948.23 వద్ద ముగిసింది. 41 పాయింట్ల నష్టంతో 25,377.55 వద్ద స్థిరపడింది. నిఫ్టీ ఇంట్రాడేలో 25,482.20 పాయింట్ల రికార్డు స్థాయి హైకి చేరింది. ట్రేడింగ్‌లో 1,453 షేర్లు పెరగ్గా.. మరో 2,343 షేర్లు పతనమయ్యాయి. నిఫ్టీ అత్యధికంగా నష్టపోయిన వాటిలో టీసీఎస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా, విప్రో ఉన్నాయి. బజాజ్ ఫైనాన్స్, శ్రీరామ్ ఫైనాన్స్, బజాజ్ ఫిన్‌సర్వ్, ఐసీఐసీఐ బ్యాంక్, నెస్లే ఇండియా లాభపడ్డాయి. బ్యాంక్ మినహా, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ 3 శాతానికిపైగా నష్టపోవడంతో అన్ని రంగాల సూచీలు నష్టాల్లో ముగిశాయి. ఆటో, ఫార్మా, మెటల్, ఆయిల్, గ్యాస్ 0.5 నుంచి ఒకశాతం వరకు తగ్గాయి. బీఎస్‌ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.7 శాతం, స్మాల్ క్యాప్ ఇండెక్స్ 0.5 శాతం తగ్గాయి.




# సినీ ప్రియులకు గుడ్ న్యూస్.. రూ.99కే మల్టీప్లెక్స్ టికెట్!

మూవీ లవర్స్‌కు ఓ గుడ్ న్యూస్. తాజాగా మల్టీప్లెక్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సినీ ప్రియులకు అదిరిపోయే వార్త చెప్పింది. ఈనెల 20న జాతీయ సినిమా దినోత్సవం సందర్భంగా సినిమా టిక్కెట్లపై బంపర్ ఆఫర్ ప్రకటించింది. దేశంలోని మల్టీప్లెక్స్‌లో ఎక్కడైనా సరే రూ.99 రూపాయలకే సినిమా చూడవచ్చని ప్రకటించింది. దేశవ్యాప్తంగా దాదాపు 4వేలకు పైగా స్క్రీన్స్‌పై ఆఫర్ వర్తిస్తుందని తెలిపింది. ఐమ్యాక్స్, 4డీఎక్స్, రిక్లైనర్స్ వంటి ప్రీమియర్ కేటగిరీలకు ఇది వర్తించదని పేర్కొంది. ఇంకేందుకు ఆలస్యం.. మీకు నచ్చిన సినిమాను కేవలం రూ.99కే మల్టీప్లెక్స్ థియేటర్లలో చూసేయండి. అయితే ఈ ఆఫర్ కేవలం పీవీఆర్ ఐనాక్స్, సినీ పోలీస్, మిరాజ్, మూవీటైమ్, డిలైట్ మల్టీప్లెక్స్‌ల్లో మాత్రమే వర్తిస్తుందని తెలిపింది. ఈ ఆఫర్ ఆ రోజు అన్ని సినిమాలతో పాటు అన్ని షోలకు వర్తిస్తుందని మల్టీప్లెక్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా వెల్లడించింది. ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్‌లోనూ ఆఫర్ వర్తిస్తుందని ప్రకటించింది. కాగా.. ఈ రోజుల్లో థియేటర్లలో ఫ్యామిలీతో కలిసి ఒక సినిమా చూడాలంటే వేలకు వేలు ఖర్చు చేయాల్సి వస్తోంది. ఈ బంపరాఫర్ పట్ల సినీ ప్రియులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## రూ.25 కోట్లు పెట్టి తీస్తే..
# రూ.3 కోట్లు వచ్చాయి

ఆయుష్ శర్మ, సుశ్రీ మిశ్రా కీలక పాత్రల్లో కరణ్.బి దర్శకత్వంలో రూపొందిన యాక్షన్ ఫిల్మ్ 'రుస్లాన్'. శ్రీ సత్యసాయి ఆర్ట్స్ పతాకంపై కె.కె.రాధామోహన్ నిర్మించారు. జగపతిబాబు కీలక పాత్ర పోషించారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద ఆశించిన విజయాన్ని అందుకోలేకపోయింది. రూ.25కోట్ల బడ్జెట్‌తో తీస్తే దాదాపు రూ.2.70 కోట్లు మాత్రమే వసూలు చేసింది. ఎట్టకేలకు ఇన్ని నెలల తర్వాత ఇప్పుడు ఓటీటీలో స్ట్రీమింగ్ అయ్యేందుకు తేదీని ఖరారు చేసుకుంది. సెప్టెంబరు 21వ తేదీన కలర్స్ సినీప్లెక్స్, జియో సినిమా వేదికగా రుస్లాన్ స్ట్రీమింగ్ కానుంది. ఈ విషయాన్ని తెలియజేస్తూ ఓటీటీ వేదికలు కొత్త పోస్టర్‌ను విడుదల చేశాయి. ఇంతకీ కథేంటంటే: రుస్లాన్ (ఆయుష్మాన్ శర్మ) తండ్రిపై ఉగ్రవాది అనే ముద్ర ఉంటుంది. తనని అందరూ ఉగ్రవాది కొడుకుగానే చూడటం రుస్లాన్‌కు ఇష్టం ఉండదు. ఆ ముద్ర చెరిపేసుకోవడానికి ఇండియన్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ 'రా'లో ఉద్యోగం సంపాదించాలనుకుంటాడు. ఈ క్రమంలో రుస్లాన్‌కు అడుగడుగునా అడ్డంకులు ఎదురవుతుంటాయి. మరి తాను అనుకున్న లక్ష్యాన్ని రుస్లాన్ చేరుకున్నాడా? ఈ క్రమంలో అతడికి ఎదురైన సవాళ్లేంటి? వాటిని ఎలా అధిగమించాడు? అన్నది చిత్ర కథ. ఇలాంటి కథా నేపథ్యానికి దగ్గరగా తెలుగులో అడవి శేష్ 'గూఢచారి', అఖిల్ 'ఏజెంట్' చిత్రాలు వచ్చాయి. 'రుస్లాన్'లోనూ అవే ఛాయలు కనిపిస్తాయి. కాకపోతే దర్శకుడు కరన్ ఎల్ భూటాని మూవీలోని యాక్షన్ సన్నివేశాలను చాలా స్టైలిష్‌గా తీర్చిదిద్దాడు. అయితే, కథాబలం లేకపోవడంతో సినిమా చాలా చోట్ల తేలిపోయింది. ఆయుష్మాన్ యాక్షన్ సన్నివేశాల్లో అదరగొట్టినా భావోద్వేగ సన్నివేశాల్లో బలమైన ముద్రవేయలేకపోయాడని సినీ విమర్శకులు అభిప్రాయపడ్డారు. దీనితోడు అసందర్భంగా వచ్చే పాటలు సినిమాకు మైనస్ అయ్యాయి.




## సానుభూతి అవసరం లేదు.. న్యాయం జరగాలి
# 'జానీ మాస్టర్' కేసుపై అనసూయ స్పందన

ప్రముఖ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్‌పై లైంగిక వేధింపుల కేసు నమోదు కావడం ఇప్పుడు టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. జానీ మాస్టర్ అలియాస్ షేక్ జానీ బాషా తనపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారని అతని సహాయకురాలు (21) ఫిర్యాదు చేయడంతో నార్సింగి పోలీసులు అతనిపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఈ క్రమంలో టాలీవుడ్‌కి చెందిన పలువురు ప్రముఖులు జానీ మాస్టర్ వ్యవహారంపై స్పందిస్తున్నారు. బాధితురాలికి న్యాయం జరగాలంటూ సోషల్ మీడియా వేదికగా డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికే నటి పూనమ్ కౌర్, సింగర్ చిన్మయితో సహా పలువురు టాలీవుడ్ స్టార్స్ బాధితురాలికి అండగా నిలిచారు. తాజాగా యాంకర్, నటి అనసూయ కూడా ఈ వివాదంపై స్పందించారు. లేడి కొరియోగ్రాఫర్‌కు జరిగిన అన్యాయం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలకు ఇలాంటి వేధింపులు ఎదురైతే.. వెంటనే భయటపెట్టాలని, ఎవరికి భయపడాల్సిన అవసరం లేదన్నారు.

**సానుభూతి అవసరం లేదు**

'మహిళలకు సానుభూతి అవసరం లేదు. అన్యాయాన్ని పశ్నించే తత్వం ఉండాలి. మీకే కాదు మీకు తెలిసిన వాళ్లకు కూడా ఇలాంటి ఇబ్బందులు ఎదురైతే వెంటనే బయటపెట్టండి. మీకు అందరూ అండగా ఉంటారు. బాధితురాలితో నేను కూడా కలిసి పని చేశాను. పుష్ప సెట్స్‌లో రెండు మూడు సార్లు ఆ అమ్మాయిని చూశాను. తను చాలా టాలెంటెడ్. ఇలాంటి క్లిష పరిస్థితులు ఆ అమ్మాయి టాలెంట్‌ను ఏమాత్రం తగ్గించలేవు. కానీ, మనసులో దాచుకొని బాధపడడం వల్ల ఎలాంటి లాభం లేదు. నేను పనిచేసే చోట మహిళలకు ఇలాంటి ఇబ్బందికర పరిస్థితులు ఎదురైతే వెంటనే స్పందిస్తాను. ఈ వ్యవహారంలో కూడా బాధితురాలికి న్యాయం జరుగుతుందని భావిస్తున్నాను. ఇందుకోసం సపోర్టుగా ఉన్న ఫిలిం ఛాంబర్ తో పాటు ఓడబ్ల్యు సభ్యులకు కృతజ్ఞతలు. రాబోయే రోజుల్లో ఇండస్ట్రీలో ఏ మహిళకు ఇలాంటి పరిస్థితులు ఎదురుకాకూడదని కోరుకుంటున్నాను'అని అనసూయ రాసుకొచ్చింది.

**పరారీలో జానీ మాస్టర్!**

జానీ మాస్టర్‌పై కేసు నమోదు చేసిన నార్సింగి పోలీసులు..అతని కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ప్రస్తుతం జానీ పరారీలో ఉన్నట్లు తెలుస్తోంది. ఫిర్యాదు విషయం తెలియగానే..హైదరబాద్ నుంచి నెల్లూరికి వెళ్లినట్లు సమాచారం. ఈ విషయం నార్సింగి పోలీసులకు తెలియడంతో.. నెల్లూరికి ఓ బృందాన్ని పంపించారట. జానీ మాస్టర్‌కి నోటీసులు అందించి, నేడో, రేపో అరెస్ట్ చేసే అవకాశం ఉందని మీడియా వర్గాలు తెలుపుతున్నాయి.



## సాయిపల్లవి సిస్టర్ పెళ్లి.. వీరి ఆచారాలు
# చాలా ప్రత్యేకమండి!

ఇటీవలే సాయిపల్లవి సోదరి పూజా కన్నన్ వివాహం జరిగిన సంగతి తెలిసిందే. తమిళనాడులోని ఊటీలో జరిగిన వేడుకలో సాయిపల్లవి డ్యాన్స్‌తో అలరించింది. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో పెద్దఎత్తున వైరల్‌గా మారింది. పూజా కన్నన్ తన క్లోజ్ ఫ్రెండ్ వినీత్ శివకుమార్‌ను పెళ్లాడారు. ఈ శుభ సమయంలో సాయిపల్లవి కుటుంబసభ్యులు ఎంతో సందడిగా గడిపారు.



అయితే చెల్లి పెళ్లిలో సాయి పల్లవి కన్నీళ్లు ఆపుకోలేకపోయింది. దీనికి పెళ్లికి సంబంధించిన ఫోటోలు నెట్టింట వైరలయ్యాయి. అయితే పూజకన్నన్ వివాహం జరిగిన తీరుపై నెట్టింట చర్చ నడుస్తోంది. అందుకు కారణం ఆమె పెళ్లి నీలగిరి కొండల్లోని బడగ అనే పురాతన సంప్రదాయం జరగడమే. సెప్టెంబర్ 5న ఊటీలోని వరుడైన వినీత్ స్వగృహంలోనే వీరి వివాహ వేడుక జరిగింది. బడగ సంప్రదాయం ప్రకారం వరుడు పెళ్లితంతు అంతా వరుడి తరఫువారే నిర్వహించాలంటా. వివాహానికి సంబంధించిన ఖర్చులన్నీ వరుడే భరించాలంటా. నీలగిరి కొండల్లోని గ్రామాలలో జరిగే వివాహాలన్నీ దాదాపు ఇదే పద్ధతిని పాటిస్తారట. బడగ సంప్రదాయం ప్రకారం పెళ్లిలో కేవలం శాఖాహార వంటకాలు మాత్రమే వడ్డిస్తారు. వీరి పెళ్లి చూస్తుంటే బడగ ఆచారాలు, సంప్రదాయాలు వాటి ఆచరణాత్మకతకు అద్దం పట్టినట్లుగా నిర్వహించారు. బాడగ సంప్రదాయం ప్రకారం వరుడు కట్నం తీసుకోరట. సాయిపల్లవి స్వస్థలం నీలగిరి జిల్లాలోని కోటగిరి కావడం.. అక్కడి ఆచార, వ్యవహారాలను పెళ్లిలోనూ పాటించడం విశేషం.

# ఆ రోజు భయంతో నాకు చెమటలు పట్టాయి

2000 సంవత్సరంలో మిస్ వరల్డ్ కిరీటాన్ని గెలుచుకొని స్టార్‌గా ఎదిగారు నటి ప్రియాంక చోప్రా. తాజాగా ఆ రోజులను మరోసారి గుర్తుచేసుకున్నారు. లండన్‌లోని ఎరీనాలో తన భర్త, గాయకుడు నిక్ కచేరీకి వెళ్లిన ప్రియాంక.. అదే వేదికపై తాను మిస్ వరల్డ్ కిరీటాన్ని గెలుచుకున్నట్లు చెప్పారు. '2000 సంవత్సరాన్ని, ఈ వేదికను నా జీవితంలో ఎప్పటికీ మర్చిపోలేను. అప్పట్లో దీన్ని మిలీనియం డోమ్ అని పిలిచేవారు. నాకు 18 ఏళ్ల వయసు ఉన్నప్పుడు మిస్ వరల్డ్ పోటీలో పాల్గొన్నాను. ఆ పోటీలో గెలవడం కోసం ఎంతో ఉత్సాహంగా, ఉద్వేగభరితంగా నావంతు ప్రయత్నం చేశాను. ఆ ఏడాది నవంబర్ 30 నా జీవితంలో ఎప్పటికీ మర్చిపోలేని జ్ఞాపకం. అందమైన డ్రెస్, హీల్స్ వేసుకున్నాను. భయానికి నాకు చెమటలు పట్టాయి. శరీరంలోని ప్రతి నరంలోనూ టెన్షనే. మరోవైపు ఆ దుస్తులు ధరించడం సౌకర్యంగా అనిపించలేదు. అవి ఎక్కడ జారిపోతాయోనని అనిపించింది. అందుకే వాటిని పట్టుకుంటూ నమస్తే చేశాను. మీరు గూగుల్లో ఆ ఫొటోలు చూస్తే.. నేను కృతజ్ఞతతో నమస్కారం చేస్తున్నట్లు ఉంటాయి. కానీ, నా దుస్తులు జారిపోకుండా కాపాడుకోవడం ఆ నమస్తే వెనక ఉన్న రహస్యం' అంటూ అప్పటి రోజులను గుర్తుచేసుకున్నారు. ఇప్పుడు 24 ఏళ్ల తర్వాత తన భర్త, కుమార్తెతో ఆ వేదికకు రావడం ఎంతో ఆనందంగా ఉందని ప్రియాంక అన్నారు. కచేరీకి సంబంధించిన ఫొటోలను షేర్ చేశారు. ప్రస్తుతం ప్రియాంక 'సిటాడెల్ సీజన్ 2' షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. తాజాగా ఆ సెట్స్ వీడియోను ఆమె పంచుకున్నారు.

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com